అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 14-4-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 52 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50



సమున్నత విజ్ఞాన మూర్తి
సామాజిక సమానత్వ స్ఫూర్తి

సామాజిక ఉద్యమ నిర్మాత, రాజ్యంగ రూపశిల్పి భారతరత్న

డా.బాబా సాహెబ్ అంబేడ్కర్
125 అడుగుల
కాంస్య విగ్రహావిష్కరణ

శుక్రవారం, 14 ఏప్రిల్ 2023

మధ్యాహ్నం 2 గంటలకు..

గౌరవ ముఖ్యమంత్రి

శ్రీ కె. చంద్రశేఖరరావు గారి చేతుల మీదుగా

ప్రపంచంలో కెల్లా ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకుందాం.

విశ్వ విజ్ఞాన మూర్తికి వినమ్ర నివాళులు అర్పించుకుందాం

షెడ్యూల్డ్ కులాల
సంక్షేమంలో దేశానికి
ఆదర్శం తెలంగాణ



గౌరవ అతిథి

శ్రీ ప్రకాశ్ అంబేడ్కర్ గారు
మాజీ లోక్ సభ సభ్యులు,
బాబాసాహెబ్ అంబేడ్కర్
గారి మనుమడు

దేశానికి దిక్సూచి తెలంగాణ దళితబంధు

దళితుల స్వావలంబన కోసం వినూత్న విప్లవాత్మక పథకం.
దేశంలోనే కాదు ప్రపంచంలోనే మరెక్కడా లేని అతిపెద్ద నగదు బదిలీ పథకం.

- దళితకుటుంబం తమకు వచ్చిన, నచ్చిన ఉపాధి లేక వ్యాపారం ప్రారంభించడానికి 10 లక్షల రూపాయల భారీ మొత్తాన్ని ఉచిత గ్రాంటు రూపంలో ప్రభుత్వం అందిస్తున్నది.
- తిరిగి చెల్లించవలసిన అవసరం లేదు, బ్యాంకు లింకేజీ లేదు. • ఇప్పటి వరకు దళితబంధు పథకం ద్వారా రూ. 3,832 కోట్ల ఖర్చుతో 38,323 దళిత కుటుంబాలకు లబ్ది చేకూరింది. మేలైన ఉపాధి మార్గాన్ని ఎంచుకొని మెరుగైన జీవితాన్ని పొందారు. • ఈ ఆర్థిక సంవత్సరంలో దళితబంధు ద్వారా 1,77,000 మందికి లబ్ది చేకూర్చేందుకు బడ్జెట్‌లోరూ.17,700 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. దశల వారీగా రాష్ట్రంలోని అన్ని దళిత కుటుంబాలకూ ప్రభుత్వం దళితబంధు ప్రయోజనాలు అందించనుంది.

ఎస్.సి. సబ్ ప్లాన్ : దళిత సామాజిక వర్గ సంక్షేమం కోసం ఏడేండ్లలో చేసిన మొత్తం ఖర్చు రూ.1,13,192 కోట్లు

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల ప్రజల జనాభా దామాషాకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరిగే విధంగా ఎస్.సి. ప్రత్యేక ప్రగతి నిధి చట్టాన్ని ప్రవేశపెట్టింది.

- ఒక ఆర్థిక సంవత్సరంలో ఎస్.సి. వర్గాలకు కేటాయించిన నిధులు ఖర్చు చేయకపోతే వాటిని తరువాతి ఆర్థిక సంవత్స రానికి బదిలీ చేయాలనే నిబంధనను చట్టంలో పొందు పరిచిన ఏకైక ప్రభుత్వం మన తెలంగాణ ప్రభుత్వం.
- 2004 నుండి 2014 వరకు దశాబ్ద కాలంలో ఆనాటి ప్రభుత్వం ఎస్.సి. సామాజిక వర్గ ప్రజల సంక్షేమానికి ఖర్చు చేసిన నిధుల మొత్తం 16,000 కోట్ల రూపాయలు మాత్రమే.
- తెలంగాణ ప్రభుత్వం ఏడేండ్లలో ఎస్.సి. సామాజిక వర్గ ప్రజల సంక్షేమానికి ఖర్చు చేసిన నిధుల మొత్తం 1,13,192 కోట్ల రూపాయలు.
- ఇది తెలంగాణ ప్రభుత్వానికి ఎస్.సి. సామాజిక వర్గ ప్రజల సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధికి బలమైన నిదర్శనం.

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వ్యాపారాల్లో దళితులకు 15% రిజర్వేషన్

దేశంలో ఎక్కడా లేని విధంగా లాభసాటి వ్యాపారాలైన ఫెర్టిలైజర్ షాపులు, మెడికల్ షాపులు, మద్యం షాపుల లైసెన్సుల కేటాయింపుల్లో షెడ్యూల్ కులాల వారికి 15 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించిన ఏకైక ప్రభుత్వం.

విదేశాలలో ఉన్నత విద్యకు రూ. 20 లక్షల స్కాలర్ షిప్

విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ విద్యార్థులకు 20 లక్షల రూపాయల అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్‌ను తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నది
దేశంలో ఇంత పెద్ద మొత్తంలో స్కాలర్ షిప్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

1001 గురుకుల విద్యాలయాలు

- బలహీన వర్గాల విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం 1001 గురుకుల విద్యాలయాలను అందుబాటులోకి తెచ్చింది.
- మేలైన వసతులతో పాటూ ఇంగ్లీష్ మీడియంలో ప్రామాణిక విద్యను అందిస్తున్నది. అంత ర్జాతీయ స్థాయిలో పోటీని తట్టుకునే విధంగా విద్యార్థులకు శిక్షణనిస్తున్నది.
- గురుకుల విద్యాలయాలలో చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలలో ప్రవేశాలను సాధిస్తున్నారు.

తెలంగాణ ఆచరిస్తున్నది..
దేశం అనుసరిస్తున్నది

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్‌కు బొడ్రాయిగా అంబేద్కర్ విగ్రహం

- తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ మహానగరానికి బొడ్రాయిగా అంబేద్కర్ విగ్రహం ఉండబోతున్నదని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించటంతో పాటు.. తెలంగాణ పరిపాలన సౌధం సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టినందుకు అన్ని కుల సంఘాల నేతలతో కలిసి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేసీఆర్ చిత్రపటానికి 500 కిలోల గులాబీలతో పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ సాగర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు రాంచందర్ మాల, టీఎమ్ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, జై భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పి. బల్వంత్ రావు మాల, టీఎమ్ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎన్ రమేష్ మాదిగ, తెలంగాణ స్టేట్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కె. గిరిందర్ మాల, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య, జాతీయ మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరణం కిషన్, దళిత నేతలు జన్ను కనకరాజు, రావుల విజయ్ కుమార్, గంధం రాములు, గంప రాజేష్, బూడాల బాబురావు, శేఖర్, శ్రీకాంత్, డేవిడ్ జంపాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై పిఎన్‌బి క్యాంపెయిన్



హైదరాబాద్: పంజాబ్ నేషనల్ బ్యాంక్ 129వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా డిజిటల్ లిటరసీ, సైబర్ అవర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించింది. సికింద్రాబాద్ సర్కిల్, ఆ పరిధిలోని శాఖల్లో బుధవారం అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బి వెంకట నరేష్ ఆధ్వర్యంలో హెల్త్ చెకప్ క్యాంప్‌లు, డిజిటల్ లిటరసీ, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆ బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది. అదే విధంగా మరింత గొప్పగా ఖాతాదారులకు సేవలు అందించాలని ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

అంతా డొల్లే !




పేదరికంపై సర్వేలలో అవాస్తవాలు...వక్రీకరణలు

- అరకొర సమాచారం....దాటవేతలు

న్యూఢిల్లీ : భారత్‌లో పేదరికం వేగవంతంగా తగ్గిపోతోందంటూ వెలువడుతున్న సర్వేలు నిజమేనని మీరు నమ్ముతున్నారా ? అయితే మరోసారి ఆలోచించండి. ఎందుకంటే ఈ సర్వేల గణాంకాలన్నీ అవాస్తవాలే. వక్రీకరణలే. సర్వేలలో అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోకపోవడం, ఒకవేళ తీసుకున్నా అరకొర సమాచారంతో నింపడం, వాస్తవాలను మరుగుపరచడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

దేశంలో పేదరికం ఏ స్థాయిలో ఉన్నదో తెలుసుకునేందుకు వినియోగ వ్యయ సర్వేలపై (సీఈఎస్‌లు) ఆధారపడుతుంటాము. ప్రజల తలసరి వ్యయం పేదరిక స్థాయి కంటే తక్కువగా ఉన్నదా లేదా అని ఈ సర్వేలు అంచనా వేస్తాయి. అయితే కేంద్రప్రభుత్వ అలసత్వం కారణంగా ఇలాంటి సర్వే నిర్వహించి దాదాపు దశాబ్దం పైనే అయింది. అంటే గడచిన దశాబ్ద కాలంలో దేశంలో పేదరికం ఎలా ఉన్నదో తెలుసుకునే అవకాశమే లేకుండా పోయిందన్న మాట. ఇదిలావుంటే ఈ కాలంలో భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తున్న సీఎంఐఈ అనే సంస్థ పలు రకాల సర్వేలు చేపట్టింది. వినియోగ వ్యయ గణాంకాలను తెలుసుకునేందుకు ఇవి ఉపకరిస్తాయి. ఈ సమాచారం ఆదారంగా పేదరికం పైన కూడా అంచనాకు రావచ్చు. అయితే ఇలాంటి సర్వేలలో పేదల అభిప్రాయాలకు పెద్దగా చోటు దక్కదు. ఉదాహరణకు దేశంలో అత్యంత పేద రాష్ట్రమైన బీహార్ లోని ఇళ్లలో తాగునీరు, మరుగు దొడ్లు, టెలివిజన్ వంటి సౌకర్యాలు బాగానే ఉన్నాయని ఓ సర్వే కట్టుకథలు అల్లింది.





అంతేకాదు... ఈ సర్వేల ఫలితాలలో వివక్ష కూడా కన్పిస్తుంది. ఒక సర్వే ఏం చెప్పిందంటే 2018లో ప్రాథమిక స్థాయి విద్య కూడా చదవని వయోజనుల సంఖ్య కేవలం రెండు శాతమేనట !. మరో సర్వే ఈ సంఖ్యను 17 శాతంగా చూపింది. ఎంత తేడా ఉన్నదో గమనించండి. ప్రపంచబ్యాంక్‌కు చెందిన ఆర్థికవేత్తలు సిన్హా రాయ్, రాయ్ వందర్ వెయిడ్‌లు సర్వేలు వివక్షాపూరితంగా ఉంటున్నాయని అంగీకరించారు. దీనిని నివారించేందుకు వారు కొన్ని పద్ధతులను కూడా సూచించారు.

వీటి ప్రకారం ముందుగా సర్వేలు పరిగణనలోకి తీసుకునే సామాజిక, ఆర్థిక అంశాలను గుర్తిస్తారు. అంటే విద్య, వృత్తి, ఆస్తి వంటివి. వీటిపై ఆయా సర్వే సంస్థలు నిర్ధారణకు వచ్చిన అంశాలను క్రోడీకరిస్తారు. వాటి ఆధారంగా పేదరిక అంచనాలు రూపొందిస్తారు. ముఖ్యంగా నెలసరి తలసరి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. విద్య, వృత్తి వంటి అంశాలనూ పరిశీలిస్తారు. కొన్ని సంస్థలు తీసుకునే అంశాలు విశ్వసించదగినవే అయినప్పటికీ అంతా వాస్తవమేనని భావించడానికి లేదు. సర్వేలు నిర్వహించే సంస్థలు కొన్ని విషయాలను దాటవేయవచ్చు. ఉదాహరణకు అనారోగ్యం, పంట నష్టాలు వంటివి. వీటిని విస్మరించి పేదరికాన్ని ఎలా అంచనా వేయగలం ? నిరుపేదలైన ప్రజలను విస్మరించి నమూనాలు సేకరించడం వాస్తవ పరిస్థితిని వక్రీకరించడమే అవుతుంది.

వాస్తవ చిత్రాన్ని ఎలా వక్రీకరిస్తారో చూద్దాం. నిరుపేదలైన ముస్లింలు, ఎస్సీలు, ఎస్టీలను పరిగణనలోకి తీసుకోకుండా సర్వేలు రూపొందిస్తారు. దినసరి కార్మికులను, విద్య తక్కువగా ఉన్న వారిని ఉద్దేశపూర్వకంగానే వదిలేస్తారు. దీనివల్ల వాస్తవాలు ఎలా బయటపడతాయి ? కొన్ని సర్వేలలో మాత్రం తక్కువ సంఖ్యలో ఎస్సీలు, ఎస్టీలను గమనంలోకి తీసుకొని 'మమ' అనిపిస్తున్నారు.

దీనిని బట్టి చూస్తే చాలా సర్వేలు అవాస్తవాలతో, కట్టుకథలతో కూడి ఉంటున్నాయి. 2011-2019 మధ్యకాలంలో పేదరికం తగ్గిదంటూ కొన్ని సర్వేలు వక్రీకరణలతో కూడిన గణాంకాలు విడుదల చేశాయి. ఈ సర్వేలు అందిస్తున్న వివరాలను చూస్తుంటే వాటి విశ్వసనీయత పైన అనుమానాలు వ్యక్తం కావడం సహజమే.

అంబేద్కర్ వారసత్వాన్ని కబ్జా కానివ్వం

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు అధ్యక్షతన నిర్వహించిన 'అంబేద్కర్-రాజ్యాంగం-సామాజికన్యాయం' సెమినార్‌లో రాఘవులు మాటాడారు. రాజ్యాంగానికి, అంబేద్కర్‌కు అవినాభావ సంబంధముందని అన్నారు. రాజ్యాంగాన్ని రచించాలనే గొప్ప ఆశయం కోసం ఆయన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి పోటీపడాలి తప్ప విగ్రహాలు పెట్టడానికి కాదని, కేసీఆర్ 125 అడుగుల విగ్రహం పెడితే మహారాష్ట్రలో మోడీ 350అడుగుల విగ్రహానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. సీఐటీయూ అధికారం కోసమో? ఓట్ల కోసమో కాకుండా దీర్ఘకాలిక లక్ష్యం కోసం కార్యక్రమాలు చేపడుతున్నదని చెప్పారు. సామాజిక న్యాయం సిద్ధిస్తేనే కార్మికులకు హక్కులు, కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలు వస్తాయని వివరించారు. అంబేద్కర్ మార్గాన్ని అనుసరించని బీజేపీ-ఆర్ఎస్ఎస్, మనువాదులు ఆయన వారసులమని చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఆయన్ను హిందూ సంస్కరణవాదిగాను చిత్రీకరిస్తున్నారని, బౌద్ధమతం హిందూమతంలో భాగమేనంటూ అబద్దాలు, అభూత కల్పనలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అయితే అదే అంబేద్కర్ మనుధర్మ శాస్త్రాన్ని తగులబెట్టారని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని మౌలిక అంశాల ప్రతిపాదనలతోపాటు వాటికి రూపాన్ని ఇవ్వడం, మార్గదర్శకానికి ప్రాధాన్యత ఉందని వివరించారు. జాతీయోద్యమ కాలంలో ప్రజలను ఒప్పించి, మెప్పించడానికి ముందుకొచ్చిన అంశాలైన ప్రజాస్వామ్య పరిపాలన, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, లౌకికతత్వం, సమాఖ్య విధానం, భాషాప్రయుక్త రాష్ట్రాలు, సామాజిక న్యాయం వంటివాటిని రాజ్యాంగంలో చేర్చారని గుర్తుచేశారు. మహిళలకు ఆస్తిలో హక్కులు, నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించేందుకు అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూకోడ్ బిల్లును అమలుకాకుండా ఆనాటి పాలకులు అడ్డుకున్నారని తెలిపారు. దానికి నిరసనగా మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జాతీయోద్యమ నినాదాలకు, రాజ్యాంగ విలువలను ధ్వంసం చేయడానికి కంకణం కట్టుకుందని, ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపర్చడానికి గవర్నర్లు పెత్తనం చెలాయిస్తున్నారని, ఇలాంటి చర్యలు దేశవిచ్ఛిన్నానికి దారితీస్తాయని హెచ్చరించారు. మహిళల వేషాధారణ శూర్పణఖల్లాగా ఉందని ఓ బీజేపీ నేత అనడం హస్యాస్పదంగా ఉందంటూ, అసలు శూర్పణఖను తయారుచేసింది మనుధర్మశాస్త్రమే కదా అని విమర్శించారు. కేరళలో గతంలో రవికల పోరాటం నడిచిందని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్, మనువాదులను మహిళలను అనుమానిస్తున్నారని, ఏం తినాలో? ఏలాంటి దుస్తులు ధరించాలనే విషయంపై శాసిస్తున్నారని, సంస్కార భారతిపేరుతో వైద్య వృత్తిని హైజాక్ చేస్తున్నారని వివరించారు. కులవ్యవస్థ నాశనం అయితేనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని తెలిపారు. కుల, మతవాదాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఆర్థిక దోపిడి, సామాజిక అణిచివేతపై పోరాటం చేయడానికి కార్మికవర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ సాధనకు సంఘటిత పోరాటాలు నిర్వహించాలని అన్నారు. కార్మికవర్గంలో సామాజిక న్యాయం కోసం రణదివే ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక దళితులపై దాడులు పెరిగాయని, కులదురంహాకార హత్యలు పెరిగాయని తెలిపారు. కర్ణాటకలో దళిత మహిళ బావిలో నీళ్లు తాగిందనే కారణంతో అగ్రవర్ణాలు ఆ బావిలో ఆడపేడ, మూత్రం కలిపారని గుర్తుచేశారు. దీనికి ప్రతిఘటనగా దళిత యువకులు అన్ని బావుల్లో నీళ్ల తాగి ఏం చేసుకుంటారో చేసుకోండని సవాల్ విసిరారని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లులక్ష్మి మాట్లాడుతూ మహిళలు మాంసం తింటే లైంగిక కోరికలు పెరుగుతాయని, నిబద్ధత లోపిస్తుందంటూ రాజస్తాన్‌లో బీజేపీ నేతలు అనడం అవమానకరంగా ఉందన్నారు. గోరక్షక దళాల దాడులు, కర్ణాటకలో హిజాబ్ అంశం పేరుతో మనువాదులు మహిళలను కించపరుస్తున్నారని తెలిపారు. అవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ వైవిధ్యాన్ని ధ్వంసం చేయడానికే ఆర్ఎస్ఎస్‌శక్తులు మనుధర్మశాస్త్రాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు. మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వడానికి బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్ మాట్లాడుతూ ఆదివాసీలు, గిరిజనులను మనువాదులు హిందువులుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. ఝార్ఖండ్‌లో గిరిజనులు హిందుమతానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. తాము ఏ మతంకాదు.. ప్రకృతి ఆరాధీకులమంటూ చెప్పకుంటున్నట్టు గుర్తుచేశారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం క్యాంపెయిన్‌కు సంఘీభావ నిధిగా సంగారెడ్డిలోని శాండ్విక్ కంపెనీ కార్మికులు రూ.14,900, పశుమిత్రల సంఘం నుంచి రూ.5,200 విరాళంగా అందజేశారు. అందకార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శులు ఎస్వీ.రమ, జె.వెంకటేష్, శ్రీకాంత్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మనాయక్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షకార్యదర్శులు జె.కుమారస్వామి, ఎం.వెంకటేష్, గ్రేటర్ హైదరాబాద్ సౌత్ సిటీ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అర్థమయ్యే రీతిలో అంబేద్కర్ పాటలు..

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, సాంస్కృతిక శాఖ కళాకారులు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. ఆయన కృషి, సేవలను ప్రజలు స్మరించుకునే విధంగా అర్థమయ్యే భాషలో పాటల రూపంలో ప్రదర్శన ఇవ్వాలని సూచించారు. భారత పార్లమెంటుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుపెట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

అమెరికా 20 ఏండ్లలో చెయ్యలేని పనిని

తాలిబన్లు ఒకే ఒక్క సంవత్సరంలో చేశారు!

ప్రపంచ గమనం

నెల్లూరు నరసింహారావు

మాదక ద్రవ్యాల తయారీలో ఉపయోగించే గంజాయి సాగును తాలిబన్లు నిషేధించి దాదాపు ఒక సంవత్సరం అవుతోంది. దీని ప్రభావం ప్రపంచ మాదక ద్రవ్య మార్కెట్లపై తీవ్రంగా ఉండబోతోంది. దీనితో అనేక దేశాలకు మాదక ద్రవ్యాల నుంచి ఉపశమనాన్ని కాకుండా వాటి వినియోగానికి సంబంధించిన సంక్షోభం మరింతగా తీవ్రతరం అవనుంది. ప్రపంచ మార్కెట్‌లో అఫ్ఘాన్ గంజాయి ఆధారిత హెరాయిన్ అందుబాటులో లేకపోతే ఫెంటానిల్ అనే సింథటిక్ మాదక ద్రవ్య వినియోగం పెరుగుతుంది. పర్యవసానంగా అమెరికా, పశ్చిమ దేశాలతోపాటు అనేక దేశాలలో డ్రగ్ ఓవర్ డోస్ మరణాలు విపరీతంగా పెరుగుతాయి. ఫెంటానిల్ అమెరికా ఆరోగ్య వ్యవస్థలోని మెడికల్ ప్రిస్క్రిప్షన్ల ద్వారా చైనా, మెక్సికో దేశాల నుంచి దిగుమతి అవుతోంది.



అమెరికా అఫ్ఘానిస్తాన్‌పై "టెర్రరిజంపై ప్రపంచ యుద్ధం" అని ప్రకటించిన కాలం (2001)లో అమెరికా తదితర దేశాలలో హెరాయిన్ ఓవర్ డోస్ కేసులు బాగా పెరిగాయి. అఫ్ఘానిస్తాన్ ప్రభుత్వాలపైనా అమెరికాకు పూర్తి నియంత్రణ ఉన్నప్పటికీ ఆ దేశంలో మాదక ద్రవ్య సంబంధిత ఉత్పత్తుల సాగును గానీ, వాటి ఎగుమతులను గానీ నియంత్రించలేకపోయింది. నిజానికి అవి అమెరికా కనుసన్నల్లో పెరిగాయి.

అంతర్జాతీయ మాదక ద్రవ్య నియంత్రణ వ్యవహారాల సహాయ కార్యదర్శిగా వున్న రాబర్ట్ చార్లెస్ 2004 ఫిబ్రవరిలో అమెరికా కాంగ్రెస్‌కి "మాదక ద్రవ్య టెర్రరిజం"ను ప్రతిఘటించటానికి ఉద్దేశింపబడిన నూతన విధానాన్ని వివరించాడు. పది సంవత్సరా లలో అమెరికా మద్దతుతో అఫ్ఘాన్ ప్రభుత్వం మాదక ద్రవ్య సాగును నిర్మూలిస్తుందని ఆయన చెప్పాడు. అమెరికా గూఢచార సంస్థ సిఐఏ మద్దతుతో మాదక ద్రవ్యాలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. కానీ వాస్తవం మరోలా ఉంది. అఫ్ఘానిస్తాన్‌లో 1991 నుంచి సిఐఏ "మాదక ద్రవ్య వ్యాపారంలో మునిగి తేలుతోంది" అని అమెరికా న్యాయ శాఖ తన విధానపత్రంలో ఆరోపించింది. సిఐఏ రహస్య కార్యకలాపాలతో మాదక ద్రవ్యాల స్వయం సమృద్ధి జోన్‌గా వున్న దక్షిణ ఆసియా ప్రపంచ మార్కెట్‌కు హెరాయిన్ ప్రధాన సరఫరాదారుగా మారింది. మాదక ద్రవ్యాలతో పాటుగా ఇస్లామిస్టు జిహాదీ టెర్రరిస్టు భావజాలాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన అదృశ్య శక్తి సిఐఏ నే.

మాదక ద్రవ్య సాగును, ఉత్పత్తిని నియంత్రించాలనే ఆసక్తి అమెరికాకు, దాని నాటో మిత్ర దేశాలకు లేదనేది సుస్పష్టం. ఈ దేశాలు తిరుగుబాటును అణచివేసే పేరుతో మాదక ద్రవ్య సాగును, ఉత్పత్తిని సంరక్షిస్తున్నాయి. నిజానికి 2001లో అమెరికా అఫ్ఘానిస్తాన్‌ను దురాక్రమించటానికి ముందే తాలిబన్లు మాదక ద్రవ్య సాగును అరికట్టాలని ప్రయత్నించారు. ఒకవైపు మాదక ద్రవ్యాల వ్యాపారంతో విదేశాల్లోని కీలుబొమ్మ ప్రభుత్వాలను అవినీతిలోకి దించుతూ మరోవైపు (నికరాగ్వా, హైతీల నుంచి ఆగ్నేయాసియా, ఇండోచైనావంటి దేశాలదాకా) అటువంటి వ్యాపారంతో ఏమాత్రం సంబంధంలేని ప్రతిపక్ష పార్టీలు మాదక ద్రవ్య వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించిన చరిత్ర సిఐఏకుంది.

వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో కొలంబియాలో ఫార్క్ పేరుతో సాయుధ పోరాటం చేసిన విప్లవకారులతో మిలాఖత్ అయి కొకైన్ అనే మాదక ద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తున్నాడని అమెరికా ఆరోపించింది. నిజానికి 2022లో వామపక్ష అభ్యర్థి అధ్యక్షుడిగా ఎన్నుకోబడేదాకా కొలంబియాలోని నియంతృత్వ ప్రభుత్వానికి ఎటువంటి షరతులు లేకుండా అమెరికా మద్దతు పలికింది. అటువంటి నియంతృత్వ ప్రభుత్వ కనుసన్నల్లో మాదక ద్రవ్యాల వ్యాపారం అనేక సంవత్సరాలు నిరాటంకంగా జరిగింది.

ఆ విధంగా చారిత్రకంగా మాదక ద్రవ్య వ్యాపారాన్ని నియంత్రించటంలోగానీ, వినియోగాన్ని తగ్గించటంలో గానీ అమెరికా నిజాయితీగా వ్యవహరించలేదనేది సుస్పష్టం. అంతిమంగా మాదక ద్రవ్యాల నియంత్రణపై అమెరికన్లు అనుసరించిన అవకాశవాద విధానం విఫలమైన తరువాత తాలిబన్లు తమ దేశంలో మాదక ద్రవ్యాలకు ముడి సరుకైన గంజాయి సాగును విజయవంతంగా నియంత్రించగలిగారు.

తిరిగి రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్!

డొనాల్డ్ ట్రంప్ తన బిజినెస్ అకౌంట్లను 34సార్లు తారుమారు చేశాడనే ఆరోపణలపై న్యూయార్క్ అటార్నీ జనరల్ అల్విన్ బ్రాగ్ అభిశంసించిన తరువాత బుధవారంనాడు ఫ్లోరిడా రాష్ట్రంలోని పామ్ బీచ్‌లోవున్న మార్ ఏ లాగో రిసార్ట్‌లో 25 నిముషాలపాటు ప్రసంగించి నాటకీయంగా అమెరికా రాజకీయాలలో కేంద్రకంగా మారాడు. గత కొంత కాలంగా ఎవరూ పట్టించుకోని ట్రంప్ ఇలా రాజకీయాలలో కేంద్రకంగా మారటానికి కారణం ఒక అధికారి తీసుకున్న అనాలోచిత నిర్ణయమే. ఇటువంటి ఉదాహరణ ఇటీవలి అమెరికా చరిత్రలో మనకు కనపడదు. ట్రంప్ ఉపన్యాసం ఆసాంతం అత్యంత అద్భుతంగా సాగింది. ఆయన ఇలా అన్నాడు:

మన దేశం పని అయిపోయింది. అవినీతి, నేర ప్రవర్తనతో దేశం బలహీనపడింది. ఇలా బలహీనపడిన దేశం మూర్ఖంగాను, అత్యంత ప్రమాదకరంగాను, అనవసరంగాను, స్వీయ వినాశకరమైన యుద్ధాన్ని ఉక్రెయిన్‌లో ప్రోత్సహిస్తోంది. అమెరికా క్షీణిస్తున్న దేశం. ఇది ఒక విఫల రాజ్యంగా మారింది.

తాను మాత్రమే అమెరికాను ఈ దుస్థితి నుంచి కాపాడగలనని ఆయన అన్నాడు. ప్రస్తుత అమెరికా దుస్థితికి కారణభూతమైన డెమోక్రాట్లు, ఎఫ్ బి ఐ, న్యాయ శాఖ, జార్జి సొరోస్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి శక్తులు కుమ్మక్కై, కుట్రపూరితంగా తనను తిరిగి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నుకోబడకుండా చూస్తున్నారని ఆయన ఆరోపించాడు. ఈ వారంలో నిర్వహించిన సర్వేల ప్రకారం రిపబ్లికన్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న మిగిలిన అభ్యర్ధులకంటే ట్రంప్ చాలా ముందున్నాడు.



రాబోయే సంవత్సరంలో అమెరికా అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికైనా గత దశాబ్దాలుగా క్షీణిస్తున్న అమెరికా ప్రాబల్యాన్ని తిరిగి బలోపేతం చెయ్యటం అంత తేలికకాదు. ట్రంప్ దాడికి గురౌతున్న అమెరికా లిబరల్ ప్రజాస్వామ్యంలోని వ్యవస్థలు సుదీర్ఘ అధ్యక్ష ఎన్నికల ప్రచార కాలక్రమంలో మరింతగా బలహీనపడతాయి. అమెరికన్ సమాజం మరింతగా చీలిపోతుంది. డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నట్టు అమెరికా "క్షీణిస్తున్న దేశం". అయితే "అమెరికా క్షీణతను నిర్ద్వందంగా, సుస్పష్టంగా ప్రతిబింబిస్తున్నది తానే" అనే విషయాన్ని ట్రంప్ గ్రహించినట్టు లేదు!

అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శుక్రవారం 14-4-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com
సంపుటి : 9 సంచిక : 52 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 10 పేజీలు వెల:



విద్యాలయాల అప్పులు

మోడీ సర్కారు తీరుపై విద్యావేత్తలు, నిపుణులు ఆగ్రహం


విద్యార్థులకు తిప్పలు

- ఫీజుల పెంపుతో స్టూడెంట్స్ నుంచి పిండుడే
- ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ స్టూడెంట్స్‌కు ఇబ్బందులు

మోడీ పాలనలో దేశంలోని ప్రభుత్వ యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. సరిపడ సిబ్బంది లేక ఇప్పటికే కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఫలితంగా.. స్టూడెంట్స్ తీవ్రంగా నష్టపోతున్నారు. వారు చదువుపై దృష్టి పెట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులకు తోడు సదరు విద్యాసంస్థలు వివిధ అవసరాల కోసం తీసుకునే రుణాలు కూడా అందులో చదువుకునే విద్యార్థుల మెడకే చుట్టుకుంటున్నాయి. ఈ రుణాలను తీర్చడానికే విద్యాసంస్థలు ఫీజులను పెంచుతున్నాయి. దీంతో రుణభారం ఫీజుల రూపంలో విద్యార్థుల పైనే పడుతున్నదని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.



న్యూఢిల్లీ : హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్ ఏజెన్సీ (హెచ్‌ఈఎఫ్‌ఏ) 2017లో కొత్తగా ఏర్పాటు చేశారు. కెనరా బ్యాంకు, విద్యా మంత్రిత్వ శాఖ జాయింట్ వెంచర్ ఇది. ఇందులో కెనరా బ్యాంకు వాటా 90.91 శాతం కాగా.. విద్యా మంత్రిత్వ శాఖది 9.09శాతంగా ఉన్నది. అదే ఏడాది దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటీ బాంబే హెచ్‌ఈఎఫ్‌ఏ నుంచి రూ. 520 కోట్లను రుణంగా తీసుకున్నది. అయితే, సదరు విద్యాసంస్థ విద్యార్థుల చదువులకు, హాస్టళ్లకు అయ్యే ఫీజులను భారీగా పెంచింది. ఉదాహరణకు.. ఎంటెక్ కోర్సు ఫీజులను (హాస్టల్ మరియు ఇతర ఫీజులు) సెమిస్టర్‌కు రూ. 19 వేల నుంచి రూ. 26,450 కి పెంచింది. ఈ పెరుగుదల దాదాపు 40 శాతం. అలాగే, రాబోయే ఎంటెక్ విద్యార్థుల ఫీజులనురూ. 32,450కి పెంచింది. ఈ పెరుగుదల ఏకంగా 70 శాతంగా ఉన్నది. అదే విధంగా పీహెచ్‌డీ రెండో సంవత్సరం విద్యార్థుల సెమిస్టర్ ఫీజును రూ. 16,500 నుంచి రూ.23,950కి పెంచింది. ఈ పెరుగుదల 40 శాతం కంటే ఎక్కువే.. పీహెచ్‌డీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజును 60 శాతం కంటే పైకి పెంచడం గమనార్హం. అయితే, ఫీజుల పెంపుపై యాజమాన్యం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దీంతో అది కాస్తా, నిరసనలు ఆందోళనలకు దారి తీసింది. పెంచిన ఫీజులకు వ్యతిరేకంగా గతేడాది జులైలో విద్యార్థులు ఐఐటీ బాంబేలో నిరసనలకు దిగారు. ఫీజులు తగ్గించాలంటూ ఉత్తరాలు రాశారు. ప్లకార్డులు, ...9లో



బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకూడదు



లౌకిక, ప్రత్యామ్నాయం కోసం చర్చలు

- ఎన్నికల తరువాత ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి :ఏచూరి
- ఏచూరి, డి.రాజాతో నితీశ్ భేటీ

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాట్లు జరగాలనీ, ఎన్నికల తరువాతే ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి ఏర్పడుతుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే ధ్యేయమని ...9లో



అంబేద్కర్ వారసత్వాన్ని కబ్జా కానివ్వం

రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గానిదే

- సామాజిక న్యాయ సాధనకు సమైక్య పోరాటాలు
- జాతీయోద్యమ నినాదాలే మౌలికాంశాలు
- 'అంబేద్కర్-రాజ్యాంగం-సామాజిక న్యాయం' సెమినార్‌లో బీవీ.రాఘవులు


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'రాజ్యాంగం ఉంటేనే కార్మికులకు హక్కులు ఉంటాయి. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉంది. సామాజిక న్యాయ సాధనకు సమైఖ్య పోరాటాలు నిర్వహించాలి. అంబేద్కర్ వారసులం మేమే అంటూ బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. ఎట్టి పరిస్థితిల్లోనూ అంబేద్కర్ వారసత్వాన్ని కబ్జా కానివ్వం. ఆయన వారసత్వాన్ని కార్మికులు పుణికిపుచ్చుకోవాలి. రాజ్యాంగంలో మౌలిక అంశాలను ప్రతిపాదించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుంది' అనిసీఐటీయూ ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ.రాఘవులు అన్నారు. అంతకుముందు లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి సీఐటీయూ రాష్ట్ర నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు 'వాక్ ఫర్ సోషల్ జస్టిస్' పేరుతో 10కే రన్ నిర్వహించారు. అనంతరం కార్మికోద్యమ నిర్మాత బీటీ రణదివే వర్ధంతి సందర్భంగా ఈనెల 6 నుంచి అంబేద్కర్ జయంతి అయిన 14 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాలను నిర్వహించాలని ...2లో

విశ్వమానవుడు అంబేద్కర్

అసమానతలు లేని సమాజం కోసం తపించిన మహోన్నతుడు

- దురాచారాలను ఎదురొడ్డిన ధీరోదాత్తుడు : సీఎం


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవితంలో ఎన్ని ఆటంకాలెదురైనా ఆత్మన్యూనతకు, దుర్బలత్వానికి గురికాకుండా గొప్ప ఆలోచనలతో గెలుపు శిఖరాలను చేరుకున్న విశ్వమానవుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కొనియాడారు. అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పరితపించిన మహోన్నతుడు అని ప్రశంసించారు. అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని సీఎం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో నెలకొన్న అజ్ఞానాంధకారాలను చీల్చుకుంటూ జ్ఞానపు వెలుగులు విరజిమ్మిన ప్రపంచ మేధావి ఆయన అని ప్రశంసించారు. కష్టంతో కూడుకున్న ఎంతటి సుదీర్ఘ ప్రయాణమైనా చిత్తశుద్ధి, పట్టుదలతో కొనసాగిస్తే గమ్యాన్ని చేరుకోవడం ...9లో

నింగినంటిన స్మరణం భారతరత్నావిష్కరణం

దేశంలోనే పెద్ద విగ్రహం

- ఎత్తు 125 అడుగులు,45 అడుగుల వెడల్పు
- నేడే ఆవిష్కరణ
- సర్వాంగ సుందరంగా స్మృతి వనం
- స్ఫూర్తిదాయక సన్నివేశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ..ఈ పేరు తెలియని వారుండరు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాత. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు. మనువాద ప్రమాదాన్ని ఆ నాడే గుర్తించి ..దాని ప్రతుల్ని దగ్ధం చేసిన దార్శనికుడు. ఆ మహనీయుని ఆశయాలకు, ఆయన అందించిన రాజ్యాంగ విలువలకు విఘాతం ఏర్పడిన నేటి పరిస్థితుల్లో అంబేద్కర్ భావజాలానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ విగ్రహావిష్కరణ ఒక స్ఫూర్తిదాయకమైన సందర్భం... 9లో

మధ్యాహ్నం 2.30గంటలకు విగ్రహావిష్కరణ

డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన మనవడు ప్రకాశ్ అంబేద్కర్ హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం కేసీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.. ఈ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు,మంత్రులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు, జడ్పీ చైర్మెన్లు, నగర మేయర్, ఉన్నతాధి కారులు పాల్గొంటారు. సభావేదికపై నుంచి సీఎం కేసీఆర్, ప్రకాశ్ అంబేద్కర్, కొప్పుల ఈశ్వర్ ప్రసంగించనున్నారు.

సంపాదకీయం

సజీవుడు అంబేద్కర్!



ఆయన పుట్టి నూటాముప్పయి మూడేండ్లు, మరణించి ఏడు దశాబ్దాలు గడిచాయి. కానీ సామాజిక రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ ఆయనింకా సజీవంగానే సంచరిస్తున్నాడు. ఈ దేశంలోని అశేష ప్రజానీకపు సమస్యలపై జీవిత పర్యంతమూ పనిచేసిన అమరుడాయన. జ్యోతిబాపూలే

> గత ఏడు దశాబ్దాలుగా అంబేద్కర్ తీవ్ర కృషి ఫలితంగా ఏర్పడిన రాజ్యాంగం ఇచ్చిన అవకాశాలతో, చదువునూ, విజ్ఞానాన్ని, బతుకు దెరువునూ కొంతలో కొంతయినా పొందిన బడుగులు నేడు ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. అయితే అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన లక్ష్యం ఇంకా చేరువకాలేదు. గత ఆరుదశాబ్దాలుగా రిజర్వేషన్లు అమలువుతున్నా దళితుల, ఆదివాసీల, వెనకబడిన తరగతుల సామాజిక పరిస్థితులు తగినంతగా మెరుగుపడలేదు.

లాంటి సామాజిక విప్లవకారుల అడుగుజాడలో మరింత వేగంగా అడుగులు వేసి, పీడితుల తాడితుల గుండెల్లో వెలుగుదీపమై నేటికీ నిలిచివున్నాడు బాబాసాహెబ్ అంబేద్కర్. నిజంగా అతనో గొప్ప మేధావి. న్యాయశాస్త్ర కోవిదుడు. భారతదేశం గర్వించదగిన నాయకుడు. మన రాజ్యాంగ రూపకల్పన చేసిన మార్గనిర్దేశకుడు.

చిన్నతనంలోనూ, చదువుకునే రోజుల్లోనూ అంబేద్కర్ అంటరానివారు అనుభవించే అవమానాలను తానూ అనుభవించాడు. ఆ అనుభవాలే ఆయనలో మరింత పట్టుదల పెంచాయి. కుల వ్యవస్థ నిర్మూలన కోసం నిరంతరం శ్రమింప జేశాయి. సాహు మహరాజ్ మొదలైనవారి సహకారంతో లండన్, కొలంబియాలలో ఆర్థిక, రాజకీయ, న్యాయశాస్త్రాలను అధ్యయనం చేసి మేధస్సుకు పదునుపెట్టాడు. గాంధీజీ నాయకత్వంలో దేశంలో అంటరానితనం నిర్మూలన కోసం తీవ్రంగా కృషిచేసినప్పటికీ, ఆ సమస్యకు మూలమైన హిందూ చాతుర్వర్ణ వ్యవస్థ వర్ణాశ్రమ ధర్మాన్ని పవిత్రంగానే చూడటాన్ని అంబేద్కర్ వ్యతిరేకించాడు. 1927లోనే మనుస్మృతిని వేలాది మంది దళితుల సమక్షంలో దహనం చేశారు. అస్పృశ్యులలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో గల బానిస ప్రవృత్తిని నిర్మూలించేందుకు, మానవ హక్కుల కోసం, సమానత్వం కోసం వారు పోరాడేటట్లు నిర్విరామంగా కృషి చేశారు. ఛాందసవాదులను ధిక్కరించాడు. మహద్ చెరువులో నీరు తాగే హక్కు కోసం, దేవాలయ ప్రవేశం కోసం నాసిక్‌లో పోరాటానికి అంబేద్కర్ నాయకత్వం వహించాడు. గుడిలోకి ప్రవేశాన్ని, చెరువులో నీళ్లు తాగే స్వేచ్ఛనూ నిరాకరిస్తున్న హిందూమతంపై విశ్వాసాన్ని కోల్పోయాడు. 'మతబోధకులూ, మతావలంబకులు కేవలం దేవుడికి మనుష్యులకు ఉండే సంబంధాలను గురించి మాత్రమే ప్రస్తావిస్తారు. కానీ మనుష్యుల మధ్య ఉండవలసిన సంబంధాలను గురించి వారు చెప్పరు' అని నిలదీస్తాడు. హిందూ మతంలోని వివక్షతలను, మూఢ విశ్వాసాలను, అన్యాయా లను బహిరంగ పరచి ఎండగట్టారు. మనుధర్మ శాస్త్రాన్ని, మన రాజ్యాంగానికి మారుగా నేడు ప్రచారంలోకి తెస్తున్న హిందూత్వవాదుల కుటిల పన్నాగాలను అంబేద్కర్ స్ఫూర్తితో నేడు మనం తిప్పికొట్టాల్సివుంది.

ఇక రెండో విషయం నేటి పాలకులు ఆర్థికపరంగా, సామాజికపరంగా అంబేద్కర్ ఆలోచనలకు, రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఆనాడు అంబేద్కర్ 'రాష్ట్రాలు- మైనార్టీలు' అన్న రచనలో ఇలా చెబుతారు... "మౌలికమైన, కీలకమైన పరిశ్రమ లన్నింటినీ, ఇన్సూరెన్స్‌ను, సాగుకు అనుకూలంగా ఉన్న భూములను ప్రభుత్వం వశం చేసుకోవాలి. పేదరైతులకు, భూమిలేని వ్యవసాయ కార్మికులకు పంచాలి, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు నెలకొల్పాలి. సవర్ణ హిందువుల నుండి మైనార్టీలకు తగు రక్షణలను కల్పించాలని" కోరారు. అందువల్లనే ప్రముఖ దళిత మేధావి రావు సాహెబ్ కాస్బే అంబేద్కర్ గురించి చెబుతూ... 'ప్రపంచ చరిత్ర అంతా వర్గ సమాజ చరిత్రే. ఇందుకు ఇండియా మినహాయింపు ఏమీకాదు." అయితే "వర్గంలోనే కులం కూడా ఇమిడివున్నది" అని అంబేద్కర్ దేశంలోని వర్గ వ్యవస్థ మూలాన్ని గురించిన వివరణలో పేర్కొనడాన్ని కాస్బే వివరిస్తారు. అంటే బుద్ధుని "దుఃఖం" అన్నదానిని దోపిడీతో సమాన అర్థంగా భావించారు. మన దేశంలో గ్రామీణ ప్రాంతాలలోని అత్యధిక పేదలు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, అస్పృశ్యకులాలుగానే ఉన్నారు. దోపిడీ పీడనకు గురవుతున్న వారూవారే. అందుకనే ఇప్పుడు దోపిడీ, కుల పీడనలకు వ్యతిరేకంగా జమిలిగా పోరాడవలసిన అవసరం ఉందని, నేడు వామపక్షాలు భావిస్తున్నాయి. ఆచరణలోను అడుగులేస్తున్నాయి.

గత ఏడు దశాబ్దాలుగా అంబేద్కర్ తీవ్ర కృషి ఫలితంగా ఏర్పడిన రాజ్యాంగం ఇచ్చిన అవకాశాలతో, చదువునూ, విజ్ఞానాన్ని, బతుకు దెరువునూ కొంతలో కొంతయినా పొందిన బడుగులు నేడు ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. అయితే అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన లక్ష్యం ఇంకా చేరువకాలేదు. గత ఆరుదశాబ్దాలుగా రిజర్వేషన్లు అమలువుతున్నా దళితుల, ఆదివాసీల, వెనకబడిన తరగతుల సామాజిక పరిస్థితులు తగినంతగా మెరుగుపడలేదు. కుల పీడనకు ఆధారంగా ఉన్న దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కులనిర్మూలనా పోరాటాన్ని మిళితం చేయవలసి ఉన్నది. ఇది మనం అంబేద్కర్ జయంతి రోజున పొందాల్సిన స్ఫూర్తి.



> హిందూ రాష్ట్రం ఏర్పడితే దేశ సమైక్యతకు గొడ్డలిపెట్టు అని అంబేద్కర్ ఆనాడే చెప్పారు. కుల నిర్మూలన కోసం అంబేద్కర్ పనిచేస్తే అందుకు భిన్నంగా ఆర్ఎస్ఎస్ మతోన్మాద బీజేపీ చాతుర్వర్ణ వ్యవస్థను కోరుతున్నది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఫాసిస్టు సిద్ధాంతం. వారి లక్ష్యం విభజనవాదం, హిందూ రాజ్యస్థాపన, ఏక సంస్కృతి, మధ్యయుగాల నాటి విధానాలను పునరుద్ధరణే వారి ధ్యేయం. నేడు అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్- బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులు అంబేద్కర్ భావజాలం, ఆచరణకు పెద్ద ఆటంకంగా, సవాల్‌గా మారాయి.

అంబేద్కర్ ఆశయాలను సమాధి చేస్తున్న ఆరెస్సెస్-బీజేపీ



పాలడుగు భాస్కర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రముఖ భారతీయ న్యాయ కోవిదుడు. ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త, సామాజికోద్యమ నాయకుడు. కుల నిర్మూలన కోసం ఎంతగానో కృషిచేసిన మహానుభావుడు. స్వతంత్ర భారతదేశపు మొదటి కేంద్ర న్యాయ శాఖామంత్రి, రాజ్యాంగ శిల్పి. కొలంబియా విశ్వ విద్యా లయం నుండి పీహెచ్‌డీ, లండన్ విశ్వవిద్యాలయం నుండి డీఎస్‌సీ డాక్టరేట్ పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించిన విజ్ఞాన వేత్త. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాల్లో పరిశోధనలు చేసిన మేధావి. ఆయన 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్రలో జన్మించారు. చిన్నతనం నుంచే కుల అసమానతలను చవిచూశారు. చదువుకోవాలన్నా, మంచినీళ్ళు తాగాలన్నా ఆయనకు కులమే అడ్డుగా నిల బడింది. ఆయన జీవితాంతం ఎన్నో అవమానాలను, అవహేళనలను ఎదుర్కొన్నారు. తన స్వ అను భవాలను దృష్టిలో పెట్టుకుని సమాజంలో వర్ణ, వర్గ బేధాలు ఉండొద్దని రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. అంబేద్కర్ విభిన్న అంశాలపై విస్తృతంగా రచనలు చేశారు. ప్రజాస్వామ్యం, అంటరానితనం, మత మార్పిడులు, బౌద్ధమతం, హిందూ మతంలోని చిక్కుముడులు, సంస్కరణలు, దళితులు, భారతదేశ చరిత్రలోని వివిధ అంశాలపై కూడా రచనలు చేశారు. కుల వ్యవస్థ రద్దు చేయడానికి కుల నిర్మూలనను ప్రతిపాదించాడు. స్వతంత్ర భారతావనిలో తొలి న్యాయ శాఖామంత్రిగా అంబేద్కర్ పనిచేశారు. కుల వ్యవస్థను సవాల్ చేసిన సామాజిక విప్లవకారుడు అంబేద్కర్. సమానత్వం, ఒక మనిషికి ఒక విలువను ఆయన ముందుకు తీసుకొచ్చారు. కుల వ్యవస్థ, అంటరానితనం, మానవ, కార్మిక, స్త్రీల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారు. సమాజాన్ని సమానత్వం, హేతుబద్ధమైన పద్ధతుల్లో పునర్ వ్యవస్థీకరించాలని కోరుకున్నారు. నిచ్చెనమెట్ల సామాజిక నిర్మాణంపై ఆధారపడిన కులాన్ని ఆయన వ్యతిరేకించారు. సమానత్వం, సౌభ్రాతృత్వం ఆధారంగా సమాజాన్ని నిర్మించబడాలని ఆయన దృఢంగా విశ్వసించారు. కానీ నేడు దేశంలో జరుగు తున్నది అంబేద్కర్ ఆలోచనలకు భిన్నం. స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు దాటినా, అంబేద్కర్ ఏ వివక్షలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారో, ఆ వివక్ష నేటికీ కొనసాగుతున్నది. జనాభాలో 70శాతం మందికి పైగా ఉన్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారు అనాగరికమైన కుల వివక్షకు, అణిచివేత, లైంగికదాడులకు గురౌతున్నారు.

కుల నిర్మూలన, వివక్షపై పోరాడాలన్న అంబేద్కర్

అణగారిన వర్గాలు-ముఖ్యంగా కార్మికవర్గాలు ఆర్థిక, సామాజిక దోపిడీకి గురౌతుండటంపై అంబేద్కర్ ఆవేదన చెందారు. వైస్రాయి కార్యనిర్వాహక కౌన్సిల్‌లో 1942 జూన్ వరకు అంబేద్కర్ సభ్యుడిగా ఉన్నప్పుడు కార్మికుల ప్రయోజనాల కోసం కీలకచర్యలు ప్రతిపాదించారు. కార్మికులందరికీ సరైన వేతనాలు, పని పరిస్థితులు హక్కుగా ఉండేందుకు కృషిచేశారు. పరిశ్రమల్లో రోజుకు 12గంటల పని విధానాన్ని వ్యతిరేకించారు. పని గంటలు ఎనిమిది గంటలకు తగ్గింపు, సమాన పనికి - సమాన వేతనం చట్టాల కోసం పోరాడారు. పని గంటలపై 1942 నవంబర్ 27న ఢిల్లీలో అంబేద్కర్ అధ్యక్షతన నిర్వహించిన 4వ భారత కార్మిక సదస్సులో ఆయన తొలిసారి ప్రతిపాదించాడు. 1945 నవంబర్ 27, 28 తేదీల్లో జరిగిన 7వ భారత కార్మిక సదస్సు వారానికి 48గంటల పని విధానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సదస్సులో కేంద్ర, ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు, యాజమాన్య సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. మనదేశంలో వర్గంలోనే కులం ఇమిడి ఉందని ఆయన నమ్మారు. కుల నిర్మూలన, వివక్ష, సామాజిక న్యాయం కోసం పోరాడకుండా భారతదేశంలో వర్గ ఐక్యతను సాధించలేమన్నారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే మనం ఎటు వెళ్ళినా కులం దారికి ముళ్ల కంచెలా అడ్డం నిలుస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగ నిర్మాణ సభకు షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్ తరపున సమర్పించిన "రాష్ట్రాలు - మైనార్టీలు" అనే డాక్యుమెంట్‌లో అంబేద్కర్ ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాన్ని కోరారు. మౌలికమైన కీలక పరిశ్రమలు, ఇన్సూరెన్స్ ప్రభుత్వ ఆధీనంలో ఉండాలనీ, సాగుకు అనువైన భూములకు పరిహారం చెల్లించి పేద రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలకు పంచాలన్నారు. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు నెలకొల్పాలని, మైనార్టీలకు తగు రక్షణ కల్పించాలని కోరారు. 1937 సెప్టెంబర్‌లో మైసూరులో జరిగిన దళిత మహాసభలో అధ్యక్షోపన్యాస మిస్తూ సాంఘిక, ఆర్థిక సమానత్వం అనే లక్ష్యాల ద్వారా మాత్రమే సామాన్య మానవునికి తన అభిమతానుసారంగా స్వేచ్ఛగా పురోగమించడానికి అవకాశాలేర్పడుతాయని, ఉత్పత్తి సాధనాలు కొద్ది మంది చేతుల్లో ఉండి దోపిడీ చేయడానికి వీలున్నంత కాలం సామాన్య ప్రజలు అభివృద్ధి చెందడానికి ఏ మాత్రం అవకాశం ఉండదని ఆయన పేర్కొన్నారు. 1938లో కొంకన్ ప్రాంతంలో కౌలు రైతుల హక్కుల కోసం జరిగిన పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో ఆయన న్యాయశాఖా మంత్రిగా ఉన్న సమయంలో హిందూ కోడ్ బిల్లు ద్వారా స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించేందుకు ఆయన చేసిన కృషికి ఆనాటి నెహ్రూ ప్రభుత్వం ఆటంకాలు కల్పించడంతో 1957లో తన పదవికే రాజీనామా చేశారు.

మనువాద రాజ్యాంగం అమలుకు ఆరెస్సెస్-బీజేపీ కుట్రలు

హిందూ రాష్ట్రం ఏర్పడితే దేశ సమైక్యతకు గొడ్డలిపెట్టు అని అంబేద్కర్ ఆనాడే చెప్పారు. కుల నిర్మూలన కోసం అంబేద్కర్ పనిచేస్తే అందుకు భిన్నంగా ఆర్ఎస్ఎస్ మతోన్మాద బీజేపీ చాతుర్వర్ణ వ్యవస్థను కోరుతున్నది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఫాసిస్టు సిద్ధాంతం. వారి లక్ష్యం విభజనవాదం, హిందూ రాజ్యస్థాపన, ఏక సంస్కృతి, మధ్యయుగాల నాటి విధానాలను పునరుద్ధరణే వారి ధ్యేయం. నేడు అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్- బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులు అంబేద్కర్ భావజాలం, ఆచరణకు పెద్ద ఆటంకంగా, సవాల్‌గా మారాయి. ఒకే మతం అంటూ హిందూయేతర ముస్లిం - క్రిస్టియన్, మైనార్టీ మతస్తులపై దాడులు సాగిస్తున్నారు. అణగారిన కులాలకు చెందిన దళిత, గిరిజన, మహిళ, వెనుకబడిన తరగతులపై నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయి. కులాల పేరుతో, మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారు. తినే తిండిపై, కట్టే బట్టలపై ఆధిపత్యం చేస్తున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని లౌకిక విలువలకు తూట్లు పొడిచి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. ఓట్ల కోసం, సీట్ల కోసం అంబేద్కర్‌ను తనవాడంటూ బీజేపీ స్వంతం చేసుకుంటున్నది. ప్రజల్ని నమ్మించడానికి నాటకాలాడుతున్నది. మరోవైపు అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి మూల స్తంభాలైన సమానత్వం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయాన్ని పునాదులతో సహా ధ్వంసం చేసేందుకు ఆర్ఎస్ఎస్-మతోన్మాద బీజేపీ బుల్డోజర్ రాజకీయాలను నడిపిస్తున్నాయి. అంబేద్కర్ కార్మిక చట్టాల కోసం పోరాడితే, అదే స్ఫూర్తితో కార్మికవర్గం పోరాడి, అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దుచేసింది. పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల్ని బానిసలుగా మార్చేందుకు నిర్ణయం తీసుకున్నది. మౌలిక వసతులు, సహజ వనరులు జాతీయం కావాలని అంబేద్కర్ కాంక్షిస్తే, బీజేపీ ప్రభుత్వం వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థల్లో 100శాతం వాటాలను తెగనమ్ము తున్నారు. దీంతో రాజ్యాంగంలో అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్లు కనుమరుగైపోతున్నాయి. ఉద్యోగుల కష్టార్జితమైన పీఎఫ్, పెన్షన్ నిధులను ప్రయివేటు ఇన్సూరెన్స్, మ్యూచ్యువల్ ఫండ్ సంస్థలకు అప్పజెప్పు న్నారు. ఎల్ఐసిలో కోట్లరూపాయల వాటాలను ఐపిఓ ద్వారా విక్రయిస్తున్నారు.

ఆరెస్సెస్-బీజేపీ విధానాలను ప్రతిఘటించాలి...

అంబేద్కర్ విగ్రహారాధనకు వ్యతిరేకం. 'ఎక్కడా నా విగ్రహాలు పెట్టొద్దు' అనే ఆయనే హెచ్చరించారు. నేను తలపెట్టిన లక్ష్యసాధనకు, ఆశయాల అమలుకు చిత్తశుద్ధితో అంకితమవ్వాలని పిలుపునిచ్చారు. కానీ నేడు పాలక వర్గాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు సామాజిక న్యాయానికి భంగం కలిగిస్తున్నాయి. అంబేద్కర్ కోరుకున్న ప్రణాళికాబద్ధ ఆర్థిక విధాన స్థానంలో బహుళజాతి సంస్థలు, ఆదానీ, అంబానీల నమూనా ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నది. అంబేద్కర్ ఆశించినట్లు భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేసే కార్యక్రమాన్ని అటకెక్కించారు. కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాల భూములను కట్టబెడుతున్నారు. కార్మికుల, పేద ప్రజల జీవన ప్రమాణాలను దిగజారుస్తున్న బీజేపీ విధానాలను అర్థం చేసుకోవాలి. దానికి వ్యతిరేకంగా పేదలను, కార్మికులను సమీకరించాలి. అంబేద్కర్ ఆశయాలను సమాధి చేస్తున్న ఆర్ఎస్ఎస్, మతో న్మాద బీజేపీ విధానాలను ప్రతిఘటించేందుకుత పోరాటాలను ఉధృతం చేయాలి. అందుకు సామాజిక - వర్గ పోరాటాలను మమేకం చేయాలి. అదే అంబేద్కర్‌కి మనమిచ్చే నిజమైన నివాళి. •

అంబేద్కర్ బాటలో గుజరాత్‌లో బౌద్ధం



డాక్టర్ దేవరాజు మహారాజు

ఏప్రిల్ 14 బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పుట్టిన రోజు. హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ సెక్రటేరియట్ నూతన భవన సమీపంలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఈరోజు ఆవిష్కరణకు సిద్ధమైంది. ఆయన పట్ల దేశ ప్రజల ప్రేమాభిమానాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఆ రకంగా భారత రాజ్యాంగ నిర్మాతకు దక్కాల్సిన గౌరవం దక్కుతోంది. 'లైట్ ఆఫ్ ఆసియా'గా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గౌతమ బుద్ధుణ్ణి; ఆయన బోధించిన ధర్మాన్ని ప్రచారం చేసిన అశోక చక్రవర్తిని ఈ ఆధునిక కాలంలో కూడా ప్రజలు స్మరించుకుం టున్నారు. అంతేకాదు, హిందూ మతాన్ని త్యజించి ఆరులక్షల మందితో అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడం కూడా ఆధునికులకు స్ఫూర్తినందిస్తోంది. తెలంగాణ టూరిజంశాఖ నాగార్జున సాగర్‌లో బుద్ధవనాన్ని ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ స్థాయిలో దాన్ని నిలబెట్టడానికి ఇంకా కృషి చేస్తోంది. ఇక భారతదేశం బయట జరిగే విషయాలు చెప్పు కోవాలంటే... ఉత్తర అమెరికాలో అంబేద్కర్ జయంతి ని... "డా॥బి.ఆర్. అంబేద్కర్ సమానత్వపు రోజు (DAY OF EQUALITY) గా గుర్తించి జరుపుతున్నారు. అంతేకాదు, నెల పొడవునా 'దళిత్ర చరిత్రమాసం'గా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ విషయాలు ఇలా ఉంటే, ఇదే రోజు 2023 ఏప్రిల్ 14న, గుజరాత్‌లో మరో మహాద్భుతం జరుగుతోంది. గుజరాత్ రాష్ట్ర రాజధాని గాంధీనగర్‌లో యాభైవేల మంది దళితులు బౌద్ధం స్వీకరిస్తున్నారు. ఆ రాష్ట్రంలోని పలు గ్రామాల్లోంచి, పట్టణాల్లోంచి, నగరాల్లోంచి, అటవీ ప్రాంతాల్లోంచి దళితులూ, ఆదివాసీలు అక్కడి రమాకాంతా మైదానంలో సమావేశమవుతున్నారు. హిందూ మతాన్ని త్యజించి, బాబాసాహెబ్ అంబేద్కర్ నడిచిన దారిలో నడవాలని అనుకుంటున్నారు. అక్కడి దళితులు, ఆదివాసీలు, వెనకబడిన జాతుల వారు అందరూ కలిసి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించుకుంటున్నారు. దంగాపూర్ ఆదివాసీలు కుటుంబాలకు కుటుంబాలు తరలివచ్చి బుద్ధ దీక్ష తీసుకుంటున్నారు. కార్యక్రమం చూడటానికి మరికొన్ని లక్షల మంది అక్కడికి చేరుతున్నారు. ఈ కార్యక్రమాన్ని స్వయం సైనిక్ దళ్ (ఎస్ఎస్‌డి) అనే స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తోంది! ఇప్పుడు ఈ ఏప్రిల్ 14న జరగబోయే కార్యక్రమం బౌద్ధ భిక్షు ప్రజ్ఞారత్న ఆధ్వర్యంలో జరుగుతుంది. వీరు పోరుబందర్‌లోని గ్రేట్ అశోకా బౌద్ధ విహార్ నుండి వచ్చి ఆ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. అక్కడి వారందరితో బుద్ధదీక్ష ఇప్పిస్తారు. కార్యక్రమాలు ఈ విధంగా కొనసాగితే, రాబోయే రెండేండ్లలో అంటే 2025 నాటికి ఒక కోటి మంది దీక్ష తీసుకుంటారని దీని వెనక కృషి చేస్తున్న స్వయం సైనిక్ దళ్ ఆశిస్తోంది.

ప్రభుత్వం వివిధ మతాల మధ్య విద్వేషాలు రగిలించడం మాత్రమే కాదు, హిందూ మతస్థుల మధ్య కూడా కలహాలు సృష్టిస్తోంది. బలవంతంగా హిందూత్వను ప్రజల మీద రుద్దడం వల్ల ఫలితాలు వ్యతిరేకంగా వస్తున్నాయి. హిందూ మతంలోని ఎగుడు దిగుళ్ళని, నిచ్చెన మెట్ల కుల సంస్కృతిని బలపర్చడం, మహిళల హక్కులు, మానవ హక్కులు హరించడం ఈ దేశ ప్రజలు భరించలేకపోతున్నారు. మనుధర్మ శాస్త్రాన్ని మన ప్రాచీన రాజ్యాంగం అంటూ నెత్తికెత్తుకోవడం, దేశ ద్రోహులైన గాడ్సే, సావర్కర్‌ల స్థాయి అనూహ్యంగా పెంచడం - ఈ దేశ ప్రజలకు నచ్చడం లేదు. నీతిలేని, చదువులేని ప్రబుద్ధులంతా మహా నాయకులై వెలిగిపోవడం - అధర్మమే ధర్మంగా చలామణి అవుతూ ఉండటం - ఈ దేశ ప్రజలకు కష్టంగా ఉంది. అందుకే వేల సంఖ్యలో జనం బుద్ధ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీన్ని హిందూ దేశంగా మార్చాలని కలలు కంటున్న నేటి పాలకులకు, లక్షల మంది హిందూ మతాన్ని త్యజించడం - ఒక చెంప పెట్టుకాబోతోంది!

అధికారంలో ఉన్న వారు ఉగ్రమార్గాన్ని వెతుక్కుంటూ ఉంటే దానికి ధీటైన సమాధానం చెప్పగల సమతా మార్గాన్ని, నైతిక రుజుమార్గాన్ని సామాన్య ప్రజలు వెతుక్కుంటున్నారు. దేవుడనే రాముడి బూచీ చూపించి పాలకులు రాజకీయాలు చేస్తుంటే... అసలు దేవుడనేవాడే లేడన్న బుద్ధ మార్గాన్ని ప్రజలు ఇష్టపడుతున్నారు. శోభాయాత్రల పేరుతో పాలకులు అల్లర్లు, కల్లోలాలు ప్రోత్సహిస్తుంటే... మనసు ప్రశాంతంగా ఉంచుకుని సర్వ జనాభ్యుదయాన్ని కాంక్షించే బుద్ధమార్గాన్ని జనం కోరుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ముఖ్య నాయకులంతా ఆ రాష్ట్రం వారే. బ్యాంకులు దోపిడీ చేసి పారిపోయిన దొంగలంతా అక్కడివారే. అలాంటి గుజరాత్ రాష్ట్రంలో సామాన్యుల ఆలోచనలు ఎలా ఉన్నాయో ఈ కార్యక్రమం తేటతెల్లం చేస్తుంది. అబద్ధాలతో అధికారంలో ఉందామనుకున్న వారికి బదులుగా - అబద్ధం ఆడరాదనీ, దొంగతనాలు చేయకూడదని చెప్పిన బుద్ధ మార్గాన్ని గుజరాత్ ప్రజలు కావాలనుకుంటున్నారు. ఇది ఎంతో ఆహ్వానించతగిన పరిణామం. మనం బతుకుదాం. మరొకరిని బతకనిద్దాం. మొత్తానికి మొత్తంగా మనిషిని బతికించుకుందాం - అనే సూత్రానికి కట్టుబడ్డ సామాన్యుల చైతన్యం చాలా గొప్పది. వెలుగు వెంట నీడలుండటం కాదు, నీడల్ని మాయం చేయగల వెలుగులు అక్కడ దేదీప్యంగా ప్రసరిస్తున్నాయి.



> అధికారంలో ఉన్న వారు ఉగ్రమార్గాన్ని వెతుక్కుంటూ ఉంటే దానికి ధీటైన సమాధానం చెప్పగల సమతా మార్గాన్ని, నైతిక రుజుమార్గాన్ని సామాన్య ప్రజలు వెతుక్కుంటున్నారు. దేవుడనే రాముడి బూచీ చూపించి పాలకులు రాజకీయాలు చేస్తుంటే... అసలు దేవుడనేవాడే లేడన్న బుద్ధ మార్గాన్ని ప్రజలు ఇష్టపడుతున్నారు. శోభాయాత్రల పేరుతో పాలకులు అల్లర్లు, కల్లోలాలు ప్రోత్సహిస్తుంటే... మనసు ప్రశాంతంగా ఉంచుకుని సర్వ జనాభ్యుదయాన్ని కాంక్షించే బుద్ధమార్గాన్ని జనం కోరుకుంటున్నారు.

హిందూమతంలోని పూజలు, భజనలు, పాపాలు, పుణ్యాలు, ఆత్మలు, పునర్జన్మలు, ఆచారాలు, సంప్రదాయాలు వీటన్నిటి కంటే ముఖ్యంగా ఉన్నతులు, నిమ్నవర్గాలు - వంటివన్నీ మూఢనమ్మకాల పుట్టలు. వీటిలో వేటికీ ఆధారాలు లేవు. నిరూపణలు లేవు. కేవలం విశ్వాసాల ఆధారంగా శతాబ్దాలుగా కొనసా గుతూ మానవుల జీవితాలు దుర్భరం చేస్తున్నాయి. అందుకే, వాటన్నింటినీ వదిలి స్వేచ్ఛాలోచనకు, మానవ వాదానికి, విశ్వ మానవ సౌభ్రాతృత్వానికి విలువనివ్వాలని స్వయం సైనిక్ దళ్ ప్రచారం చేస్తుంది. మనుషుల్ని ఎగుడు దిగుడు స్థాయిలో ఉంచి, వివక్ష చూపుతున్న హిందూ ధర్మాన్ని తిరస్కరించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం. ఆనాడు అంబేద్కర్ చేసిందే ఆదర్శంగా తీసుకుని, ఈ రోజు దేశంలో లక్షల మంది బౌద్ధం స్వీకరిస్తున్నారు. మనుషులందరిదీ ఒకే స్థాయి అని నినదిస్తున్నారు. ఎవరి జ్ఞానాన్ని వారు ఎవరి వివేకాన్ని వారు తట్టిలేపుకోవాలని, నిర్ణయం తీసుకునే ముందు బాగా ఆలోచించాలని, బుద్ధిని ఉపయోగించాలని స్వయం సైనిక్ దళ్ జనానికి బోధిస్తోంది. దీక్ష తీసుకునే విషయంలో ఎవరూ ఎవరినీ బలవంతం చేయడం లేదు. ఎవరూ ఎవరినీ ప్రభావితం చేయడం లేదు. ఎలక్షన్లలో మాదిరిగా ఎవరూ ఎవరినీ డబ్బుతో లొంగదీసుకోవడం లేదు. స్వచ్ఛందంగా ఇలాంటి పని ఆలోచనా పరులే చేస్తారు. అదీగాక, ఇది - పూజలో మంత్రాలు వల్లెవేసి మతమార్పిడి చేసేతంతు కాదు. అసలు బౌద్ధం-మతేమే కాదు! అదొక జీవన విధానం!! బుద్ధుడి బోధనలు పూర్తిగా స్వీకరించి, అందుకు అనుగుణంగా తమజీవన విధానం మార్చుకుంటారు. అంతే - ఇది న్యాయ సమ్మతంగా, చట్టబద్ధంగా, మనస్ఫూర్తిగా చేయవల్సిన పని! దీక్ష తీసుకునే వారు వారి వారి కలెక్టర్ ఆఫీసుల్లో అప్లికేషన్‌లు నింపాలి. ఆ తర్వాత అందులో ప్రకటించిన వన్నీ నిజాలా కాదా - అనేది పోలీసు ఎంక్వయిరీ జరుగుతుంది. దీక్ష తీసుకున్న వారి వివరాలన్నీ గజిట్‌లో అచ్చేస్తారు. ఇదంతా అధికారికంగా జరిగే కార్యక్రమం.

ఈ స్వయం సేవక్ దళ్ ఎప్పుడు ఏర్పడింది? ఏయేం పనులు చేస్తుందో చూద్దాం... తొలుత 2006లో ఇది యాభైమందితో ఏర్పడింది. ఒకే ఆలోచనా విధానం గల మిత్రులయిన దళిత కార్యకర్తలతో మొదలైంది. ఆ సంఖ్య క్రమంగా ఊహించని రీతిలో పెరుగుతూ పోయింది. ఈ స్వయం సైనిక్ దళ్‌లో ఎవరు చేరవచ్చు? అంటే - నిచ్చెనమెట్ల సంస్కృతిని తిరస్కరించే వారంతా చేరొచ్చు. అందరికీ సమానమైన స్థాయి, హక్కులు, బాధ్యతలు కావాలనుకునే వారు చేరొచ్చు. మనుషులంతా ఒక్కటే అన్న భావన గలవారే ఈ స్వయం సైనిక్ దళ్ సభ్యులవుతారు. వీరిలో కొందరు నాయకులు, మరికొందరు కార్యకర్తలు అనే హెచ్చుతగ్గులుండవు. కలిసి మాట్లాడుకోవడానికి, చర్చించుకోవడానికి చింతన శిబిరాలు ఉంటాయి. అందులో అందరూ సమానమే. కొందరు వేదిక మీద ఉండి ఉపన్యసించడం, మరికొందరు వేదికముందుండి వినడం ఉండదు. ఏదో ఒక మైదానంలో అందరూ నేల మీద కూర్చుంటారు. ఎక్కడి వారు అక్కడే నిలబడి మాట్లాడుతారు. అందరూ సమానమనే భావన - బాధ్యత అందరిదీ అనే భావన - అక్కడ ఉన్నవారందరిలో కలుగుతుంది. స్వయం సైనిక్ దళ్ సభ్యులు ఆకుపచ్చ దుస్తులు ధరిస్తారు. ట్రాఫిక్, రవాణా, వైద్య రంగాలకు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం కలిగి ఉంటారు. సామాన్య పౌరులకు ఏ ఇబ్బంది కలగకుండా ఇదే రోజు ఒక మహార్యాలీ కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చేవారి కోసం 800ల బస్సులు, 5వేల కార్లు ఏర్పాటు చేసుకున్నారు. గాంధీనగర్ విధాన సభ ముందున్న అంబేద్కర్ విగ్రహం దగ్గర 22 ప్రతిజ్ఞలు చేస్తారు. ఈ ర్యాలీ ఉద్దేశమే మంటే... సామాన్య పౌరుల్లో చేతనత్వాన్ని కలిగించడం. బుద్ధమార్గంలోకి రావాలనుకునే వారిని ఆహ్వానించడం ఏ నిర్ణయమూ తీసుకోలేక కొట్టుమిట్టాడు తున్న వారికి ఒక ఉత్తేజాన్ని కలిగించడం. దిశానిర్దేశం చేయడం.

ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి రోజున ఇలాంటి దీక్షలు ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగుళూర్, భోపాల్, ముంబాయి, హైదరాబాద్, లక్నో వంటి పెద్ద పెద్ద నగరాలలో జరపాలని స్వయం సైనిక్ దళ్ పథకాలు వేసుకుంది. రాబోయే కాలంలో బుద్ధ దీక్ష కార్యక్రమాలు దేశంలో ఇంకా పెద్ద ఎత్తున జరిగే అవకాశాలు కనబడుతున్నాయి. మోసం, దగా నిత్యకృత్యాలై జీవితాలు దుర్భరమై పోతున్న ఈ రోజుల్లో... కేవలం బౌద్ధమే నైతిక మార్గం చూపగలదని, ప్రజల మానసిక ఆరోగ్యం కాపాడగలదని, మానవ జాతిని రక్షించగలదని మానవ ప్రేమికులంతా భావిస్తున్నారు. మానవవాదు లంతా ఆశిస్తున్నారు. ఈ దేశ ప్రజలు మానవీయ విలువల పరిరక్షణ కోరుకుంటున్నారని - ఈ సంఘటన చెప్పకనే - బలంగా చెపుతోంది!!

వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

అభినవ బుద్ధుడా!

అభినవ బుద్ధుడా!
మానవాళి మిత్రుడా!
క్రూరకుటిల కులతత్త్వపు కోరల
పెకలించి - సకలజనులకు
సుఖశాంతుల నొసగినవాడా!


మనిషన్నవాడు చదువుకోవాలని
తానెవరన్నది తెలుసుకోవాలని
విషయం సత్ ప్రవర్తనల దిద్ది తీర్చుకోవాలని
అజ్ఞానం వదిలించుకోవాలని
ఆత్మబలం, విశ్వాసం పెంచుకొని
అద్భుత విజయాలు అందుకోవాలని
బోధించినవాడా!

చరిత్ర పొడుగున కొనసాగిన
కౌటిల్యుని అర్థశాస్త్రాలకు భిన్నంగా
కొనసాగిన బుద్ధిస్ట్ అర్థశాస్త్రజ్ఞుడా!
పెద్దపీటవేసిన అర్థశాస్త్రజ్ఞుడా
సాంఘిక విప్లవరణ దుంధుభి
మ్రోగించినవాడా!

సుపరిపాలనకు
చిన్న రాష్ట్రాలు మేలన్నావుకదా!
నవభారత రాజ్యాంగం అందించినవాడా!
కర్షక కార్మిక జనులను
మహిళలను ఉద్ధరించినవాడా!
సమతావైతాళికుడా! అభినవ బుద్ధుడా!

నీ సమున్నత వ్యక్తిత్వానికి
ఈ నీ ఉన్నత విగ్రహరూపం
చంద్రునికో నూలుపోగు
జ్ఞానభాండాగార సాగరాన్ని
మథించిన నీ విశాల హృదయానికి
ఇది గ్రంథాలయాలు చేస్తున్నవి అక్షరార్చనం
సజీవ ఆదర్శానికి నిదర్శనం
సమున్నత మేధాసంపదను
మేల్కొల్పే చైతన్య దీపం
స్వయం కృషిని ప్రబోధించే మౌన సందేశం.

- కడియం సోమన్న, 784299964



రాజ్యాంగ దీప ధారి

పుట్టిన నాటి నుంచీ
పుట్టిన గడ్డకోసమే
రక్త బిందువులన్నీ
అక్షరాలుగా మార్చిన
నిజమైన దేశభక్తుడు

దేశమంటే
ఒక్క కులమే కాదని
కులాల పుట్టుకను
స్కానింగ్ చేసి చూపించిన
సామాజిక శాస్త్రవేత్త

చీకట్లో ఎటువైపు నడవాలో
తెలియని స్వతంత్ర దేశానికి
రాజ్యాంగ దీపాన్ని వెలిగించి
చేతిలో పెట్టిన మార్గదర్శి

ఈ దేశంలో పుట్టిన
ప్రతి మనిషికి సమానంగా
హక్కులను పంచి పెట్టిన
నికార్సైన మహాత్ముడు

ఆయన లేకపోతే
ఈ దేశాన్ని ఏ రాహువు
మింగేసేదో?
కింది జాతుల జీవితాలు
ఎంతగా 'తలకిందు'లయ్యేవో??

ఏ నాటికైనా
నా దేశాన్ని దేశంగా నిలబెట్టేది
ఆయన చూపుడు వేలే!

-తోకల రాజేశం, 9676761415



నిమ్స్‌లో చీమలపాడు క్షతగాత్రులకు కేటీఆర్, నామ పరామర్శ

- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం
- ప్రభుత్వం అన్ని విధాలా అండ

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారేపల్లి మండలం చీమలపాడు అగ్ని ప్రమాద ఘటన క్షతగాత్రులను గురువారం రాష్ట్ర మంత్రి కేటీఆర్, పార్టీ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై వైద్య బృందంతో ప్రత్యేకించి మాట్లాడి, క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్, నామ మీడియాతో మాట్లాడుతూ చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగానే ఉందన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉందని భరోసా కల్పించారు. ఈ ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇన్ని రోజులు మాతో ఉన్న పార్టీ కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోవడం బాధగా ఉందని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎలాగైనా క్షతగాత్రులను కాపాడు కునేందుకు వైద్య బృందం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. నిమ్స్‌లో క్షతగాత్రులకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందేలా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నామని నామ తెలిపారు. బాధితులంతా త్వరగా కోలుకుని, క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారని నామ భరోసా కల్పించారు. వారి వెంట నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఓఎస్డీ గంగాధర్ తదితరులు ఉన్నారు.



గణిత, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో 'హార్వెస్ట్' కు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

నవతెలంగాణ-ఖమ్మం

సీమో ఎడ్యుకేషన్స్ ఆధ్వర్యంలో ప్రతీయేటా రాష్ట్రాల వారీగా నిర్వహించే గణిత, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు విశేషంగా రాణించి, రాష్ట్రలో మొదటి ర్యాంకుతోపాటు, 10 లోపు 20 ర్యాంకులు సాధించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరానికిగానూ రెండు విడతలుగా సీమో ఎడ్యుకేషన్స్ గత ఫిబ్రవరిలో రాష్ట్రాల వారీగా సంబంధిత పరీక్షలు నిర్వహించి గురువారం ఫలితాలు వెల్లడి చేశాయని తెలిపారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనే పరీక్షలో తమ 8వ తరగతి విద్యార్థి టి. శ్రీజిత్ గణిత ఒలింపియాడ్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. 6వ తరగతి నుండి ఎ. విహాన్ 2వ ర్యాంకు, బి. రోహాన్ 4వ ర్యాంకు, జి.అర్జున్ 10వ ర్యాంకు, 7వ తరగతి నుండి ఎ. మనోమ్నజాన్సీ 6వ ర్యాంకు, పి.జెదిద్యాజోష్ సార్థక్ 10వ ర్యాంకు, ఎన్. రేవంత్ కుమార్ 10వ ర్యాంకు, 8వ తరగతి నుండి కె. శ్రియ 5వ ర్యాంకు, జి. వరుణ్ శ్రీ చైతన్య 6వ ర్యాంకు ఎస్.కె. రయాన్ అర్షత్ 9వ ర్యాంకు, 9వ తరగతి నుండి సి. హెచ్ కృష్ణమాదుర్ 10వ ర్యాంకు, రేవంత్ కుమార్ 8వ ర్యాంక్, 10వ తరగతి నుండి బి.భార్గవి 11వ ర్యాంకులు సైన్స్ ఒలింపియాడ్లో సాధించగా గణిత ఒలింపియాడ్లో 7వ తరగతి నుండి ఆర్. లక్ష్మి శర్వాణి 4వ ర్యాంకు, 9వ తరగతి నుండి టి.రేవంత్ కుమార్ 4వ ర్యాంకు, 10వ తరగతి నుండి పి.రోహిత్ 4వ ర్యాంకులు సాధించడం జరిగిందని వారు తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులను అభినందించి భవిష్యత్లో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఐఐటి బ్రాంచ్ ఇంచార్జిలు సి. హెచ్. ఉమామహేశ్వర రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఉపాధ్యాయుల బదిలీలపై హైకోర్టులో నడుస్తున్న కేసు జూన్ 13కు వాయిదా పడిందని, వాయిదాను ఏప్రిల్ నెలాఖరు లోగా ముందుకు జరిపే విధంగా విద్యా శాఖ అధికారులు ప్రయత్నం చేయాలని తద్వారా వేసవి సెలవులలోనే బదిలీలు, పదోన్నతులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మీనవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాబీరా బేగం యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాల కాలంగా పదోన్నతులు క ల్పించక పోవడంతో అర్హులైన ఉపాధ్యాయులు నష్ట పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బండారు నాగరాజు, మండల బాధ్యులు నీలం అజయ్ కుమార్, సైదారావు పాల్గొన్నారు.

ప్రమోషన్లు వెంటనే కల్పించాలి

నవతెలంగాణ-తల్లాడ

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు బదిలీలు తక్షణమే చేపట్టాలని టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు పర్నానాయక్, బుల్లెప్ప సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని రెండువేల హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, మురళీకృష్ణ, సమ్మయ్య, వెంకటేశ్వర్లు సునీత, దాసు, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ వైరా గ్రేట్ విజన్ వారి ఆధ్వర్యంలో

ఉచిత కంటి ఆపరేషన్స్

నవతెలంగాణ-వైరా

గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెంనకు చెందిన ఐదు మందికి, ఖమ్మంనకు చెందిన 5 మందికి ఉచిత కంటి ఆపరేషన్స్ చేశారు. వైరా లయన్ కంటి ఆసుపత్రిలో అత్యాధునిక ఎకో ఆపరేషన్ మిషన్‌లు అమర్చిన తర్వాత మొదటి సారి 10 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ చేయించుకున్న పేషంట్స్ అందరికి ఫ్రూట్స్, బ్రెడ్ అందించారు. ఈ కార్యక్రమంలో జిఎంటి కోఆర్డినేటర్ ఉండ్రు శ్యామ్ బాబు, జడ్‌సి లగడపాటి ప్రభాకరరావు, ట్రెజరర్ గంగవరపు కిషన్, ఉండ్రు వరలక్ష్మి డాక్టర్ కృష్ణచైతన్య డాక్టర్ రవి చంద్ర, కె గోపి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నాయకురాలు తిరుపతమ్మ మృతి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం గోల్లెనపడు గ్రామంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకురాలు కంచర్ల తిరుపతమ్మ (80) అనారోగ్యంతో మరణించారు. ఈ సమాచారం తెలియగానే సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, వైరా రూరల్ మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు కిలారు శ్రీనివాసరావు, నల్లమోతు వెంకటనారాయణ అమరజీవి కంచర్ల మరియమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరితోపాటు పార్టీ నాయకులు అమరనేని అప్పారావు, చంద్ర ప్రసాదు, వెంపటి రాజేశ్వరరావు సంద్ర వెంకటరావు, కొణిదన ధర్మారావు, కొణిదన రాజేంద్రప్రసాద్, తాళ్లూరి లక్ష్మి, శ్రీరామనేని ప్రసాదు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు నివాళులు అర్పించారు.

పరీక్ష ఫీజులను తక్షణమే తగ్గించాలి

ఖమ్మం : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని యూజీ, పీజీ ప్రొఫెషనల్ సెమిస్టర్ వైజ్ పర్మిషన్ ఫీజును రూ.3000 నుండి 1000 రూపాయలకు, బ్యాక్ లాగ్ సబ్జెక్టులకు సంబంధించిన ఒక్కొక్క పేపర్ కు పరీక్ష ఫీజును 5000 వేల నుండి 1000 రూపాయలకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ యూనివర్సిటీ సబ్ క్యాంపస్ ఎదుట వీసీ రమేష్ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఉన్నారు.

రైతుల ధాన్యం మొత్తం కొంటాం

రాష్ట్రంలోనే తొలి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎమ్మెల్యే వెంకట వీరయ్య

నవతెలంగాణ-కల్లూరు



రబీ సీజన్‌లో పండించిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని, రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, అదనపు కలెక్టర్ మధుసూదన్ రావు చెప్పారు. గురువారం పుల్లయ్య బంజారా సమీపంలోని కాశ్మీర మహాదేవ క్షేత్రం ఆవరణలో ఐకెపి మల్లిక గ్రామ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించటం అభినందనీయమని అన్నారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాన్ని ఉపయోగించుకొని గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలా అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రవాణా, గన్ని సంచులు చర్యలు తీసుకోవాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వం రైతులకు అండగా నిలబడి అన్ని విధాలుగా సహకరిస్తుందని అన్నారు. రైతులు పెట్టుబడి కోసం రైతు బంధు ద్వారా ఎకరానికి పదివేలు ఇస్తూ, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం కోసమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయిన రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. ధాన్యం కాటా వేసిన తర్వాత రవాణా ఆలస్యమైనా కానీ రైతులు అధైర్య పడవద్దు నని మీ దగ్గర కాటా వేసింది లెక్కగా తీసుకుంటారని అదనపు కలెక్టర్ మధుసూదన్ రావు అన్నారు. పుల్లయ్య బంజార, గ్రామ సర్పంచ్ పెదబోయిన కృష్ణవేణి, ఎంపీటీసీ బుర్రి భవాని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డిఆర్డిఓ మెరుగు విద్యాచందన, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ బీరవెల్లి రఘు, కట్టా అజయ్ బాబు, ప్రసంగించారు. అదేవిధంగా డిఆర్‌డిఏ ధాన్యం కొనుగోలు సెంటర్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బీ దర్గయ్య, ఏవో ఎం.రూప, ఏపిఎం ఎం.వెంకట రామారావు, సివిల్ సప్లై డిఎం సోములు, డిఎస్ఓ రాజేందర్, కల్లూరు పంచాయతీ సర్పంచ్ లక్కినేని నీరజ రఘు, రైతు సమన్వయ సమితి మండల జిల్లా ప్రతినిధులు లక్కినేని రఘు, పసుమర్తి చంద్రరావు, టిఆర్ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు, పెద్ద బోయిన మల్లేశ్వరరావు, బోబోలు లక్ష్మణరావు, వాసిని నారాయణరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ వెంకటరావమ్మ,గ్రామ సమాఖ్య కొనుగోలు కమిటీ సభ్యులు రామలక్ష్మి, సరిత, రమాదేవి,మాధవి,శివ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించాలని సీఐటీయు పాదయాత్ర

నవతెలంగాణ-ఖమ్మం



దేశంలో సామాజిక న్యాయాన్ని కాపాడాలని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుతూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్ పేరుతో నగరంలో పాదయాత్ర నిర్వహించారు. తొలుత ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి పాత కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అంబేద్కర్‌కి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరావు మాట్లాడుతూ జాతీయోద్యమ కాలంలోనూ, స్వాతంత్ర్యానంతర కాలంలోనూ భారతదేశంలో కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, అణచివేత, మూఢ నమ్మకాలు, స్త్రీల హక్కులు, ఆర్థిక, సామాజిక దోపిడీ, పీడనల నుండి విముక్తి కోసం దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలతో పాటు వెనకబడిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎందరో మహనీయులు అశేష త్యాగాలు చేశారని, వారు నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాడారని, వారి పోరాటాలు, త్యాగాలు, వారు చేసిన కృషి ఫలితంగానే, ఆయా తరగతుల కొన్ని హక్కులు, చట్టాలు, సౌకర్యాలు లభించాయని వారు పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ నెలకు ఒక ప్రత్యేకత ఉందని, అంటరానితనం, అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్తలు, సామాజికవేత్తలు, విప్లవకారులు, దోపిడీ రహిత సమసమాజ స్థాపనను కాంక్షించే కార్మికోద్యమ నేతల వర్ధంతులు, జయంతులు వరుసగా ఈ ఏప్రిల్ నెలలోనే రావడం విశేషమని అన్నారు. ఏప్రిల్ 5, ఏప్రిల్ 6 అన్నిరకాల వివక్షలు, అణచివేతలు, దోపిడీల నుండి ప్రజల్ని విముక్తి చేసి సమసమాజ స్థాపన చేయాలనే లక్ష్యానికి కట్టుబడిన కార్మికోద్యమ నేత బీటీఆర్ జయంతి, ఏప్రిల్ 11 అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనలతో పాటు మహిళా ఉద్ధరణ, హక్కుల కోసం కృషి చేసిన జ్యోతిరావ్ పూలే జయంతి, ఏప్రిల్ 14 కుల నిర్మూలన కోసం పదునైన రాజీలేని పోరాటం చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఈ మహానుభావులను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో దోపిడీ, వివక్షల అంతం కోసం ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.విక్రమ్, పి.రమ్య, జె.ఉపేందర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జె. శ్రీను నాయకులు నాగేశ్వరరావు, పద్మ, వెంకటరమణ, దొడ్డ నరసింహారావు, జల్లి శ్రీను, విజయ, ప్రసాద్, ట్రాన్స్పోర్ట్ యూనియన్ నాయకులు రాందాసు, ఉపేందర్, సిఐటియు నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్దంగా చదవాలి




శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య


నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

శ్రీచైతన్య విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో ప్రణాళికా బద్దంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య అన్నారు. స్థానిక మమత రోడ్ లోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో గురువారం యు.కె.జి మరియు 5వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ.. మున్ముందు చదువులలో ప్రతిభ కనబరచి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకరావాలన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడితో ముందుకుసాగాలన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు, ధృవపత్రాలు అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, అతిధులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల డిజిఎం చేతన్మాథుర్, ప్రిన్సిపాల్స్ జి.నాగప్రవీణ, టిఎల్ఎన్ శర్మ వైస్ ప్రిన్సిపాల్స్ రామకృష్ణా రెడ్డి, సురేష్, ఇన్‌చార్జి హిమబిందు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా బైపాస్ రహదారి నిర్మాణం

- బీటీ రోడ్లు ధ్వంసం
- అవస్థల్లో ప్రజలు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ముదిగొండ



సూర్యాపేట జిల్లా కోదాడ నుండి మహబూబాబాద్ జిల్లా కొరివి వరకు కేంద్ర ప్రభుత్వ నిధులు కోట్ల రూపాయలతో జాతీయ రహదారి నిర్మాణం (బైపాస్ రోడ్డు) గోకినేపల్లి, వెంకటాపురం, ముదిగొండ గ్రామల సమీపము నుండి రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ బైపాస్ రహదారి నిర్మాణం కోసం మండలంలోని ఉన్న బీటీ రోడ్లను మరోపక్క అంతే శరవేగంగా ధ్వంసమై గుంతల మాయంగా మారి తారు రోడ్లు కాస్త మట్టి రోడ్లుగా మారాయి. దీంతో మండల ప్రజలు, ప్రయాణికులు వాహనదారులు ఈ రోడ్‌లో ప్రయాణించాలంటే అవస్థల పడుతూ పలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో ప్రధానంగా ముదిగొండ నుండి వల్లభి వెళ్లే మార్గంలో న్యూలక్ష్మీపురం, సువర్ణాపురం రెవెన్యూ నుండి అక్రమంగా, అనుమతి లేకుండా బైపాస్ రహదారికు పెద్ద, పెద్ద లారీలతో గ్రావెల్‌ను తోలుతూ ఉన్న రోడ్లను ధ్వంసం చేశారు. బీటీ రోడ్లు మట్టితేలి రోడ్లు కాస్త పెద్ద పెద్ద గుంటలతో బావురమంటున్నాయి. జాతీయ రహదారి కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా బైపాస్ రహదారికి పరిమితికి మించి అధిక లోడులతో లారీలను రోడ్డు మీద తిప్పి ఉన్న బీటీ రహదారులు పూర్తిగా ధ్వంసం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తూ జాతీయ రహదారి పనులకు సహకరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో వాహనాలు రద్దీ పెరిగి మట్టి, వాహన కాలుష్యం కోరల్లో వాహనదారులు ప్రజలు చిక్కి అనారోగ్యాలతో కూనరిల్లుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం వాహనాల్లో ఈ మార్గంలో గుంతలుగా ఉన్న రోడ్డును చూసుకుంటూ వెళ్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లను బాగు చేసే నాధుడే లేడా.. అంటూ వాహనదారులు, ప్రయాణికులు మొరపెట్టుకుంటున్నారు. జాతీయ రహదారి కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్న బీటీ రోడ్లను పూర్తిగా ధ్వంసం చేసి, మట్టి రోడ్లుగా తయారు చేశారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.





జంపాల రామనాథం ఆశయాలు ముందుకు తీసుకెళ్దాం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



జంపాల రామనాథం ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండల పరిధిలోని తాళ్లచెరువు గ్రామంలో తుళ్లూరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జంపాల రామనాథం సంస్మరణ సభకు తమ్మినేని ముఖ్యఅతిథిగా పాల్గొనాలని ప్రసంగించారు. జంపాల రామనాథం తాళ్లచెరువు గ్రామ కార్యదర్శిగా అనేక సంవత్సరాలు పనిచేశారని, గ్రామంలో మండలంలో అనేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారన్నారు. పార్టీ కష్టకాలంలో సైతం ఆయన పార్టీ వెన్నుంటి ఉండి నడిపించారని అలాంటి జంపాల రామనాథం లేకపోవడం పార్టీకి తీరని లోటు అని సందర్భంగా గుర్తు చేశారు. రామనాథం కోరుకున్న కమ్యూనిస్టు రాజ్యం కోసం కార్యకర్తలు అందరూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మండల ఇన్‌చార్జి షేక్ భషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, బసపొంగు వీరన్న, దాసరి మహేందర్, వెంకటేశ్వర్లు, ఉపేందర్ రెడ్డి, రవి, తంగిల రమేష్, గోపోజు రవి, కోడి లింగయ్య, పల్లి రమేష్, సిద్దుల వెంకన్న, చారి, శాఖ కార్యదర్శి చిగురుపాటి ఉపేందర్, రవి, మైసయ్య, రామనాథం కుటుంబ సభ్యులు దుర్గమ్మ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-పెనుబల్లి

మండల పరిధిలోని మండాల పాడు గ్రామ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం వ్యక్తి మృతి చెందాడు. కల్లూరు మండలం లోకారానికి చెందిన అన్నపరెడ్డి మంద(32) లారీ ఢీ కొట్టిన సంఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్తుపల్లి నుండి కల్లూరు మీదుగా లోకారం వెళ్లేందుకు కల్లూరు మీదుగా మెటార్ సైకిల్‌పై వెళతుండగా మార్గమధ్యలో మండల పాడు దాటిన తర్వాత ట్రాలీ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పెనుబల్లి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని శవ పంచనామ కొరకు పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్ఐ సూరజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ తల్లాడ



మండలంలోని బస్వాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం అంబేద్కర్ విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, దిగ్గిదేవర వెంకటలాల్, సర్పంచ్ సూరంపల్లి లక్ష్మీనారాయణ, జెడ్పిటిసి ప్రమీల, సిపిఎం నాయకులు తాత భాస్కర్ రావు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

తల్లాడలో రంజాన్ తోఫా, రంజాన్ కిట్లను లబ్దిదారులకు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పంపిణీ చేశారు. మండలంలోని 274 మంది ముస్లిం సోదరులకు రంజాన్ కిట్లను కేటాయించారు. రైతు వేదికలో తహసీల్దార్ ఘంటా శ్రీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి

నవతెలంగాణ-ఖమ్మం

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి అన్నారు. గురువారం ఐడిఓసి లోని అదనపు కలెక్టర్ చాంబర్ లో అగ్ని మాపక వారోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖచే అగ్ని ప్రమాదాలు, జాగ్రత్తలు, సూచనలపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ఐడిఓసిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదం వంటి విపత్కర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఎలా రక్షించుకోవాలి అనే విషయాలపై ఉద్యోగులకు తగు సూచనలు చేశారు. వేసవికాలం కావడంతో అకస్మాత్తుగా సంభవించే అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బందిని సమాయత్తం చేసేందుకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా సహాయ కలెక్టర్ రాధిక గుప్తా, డిఎఫ్ఓ జయప్రకాష్, ఏడిఎఫ్ఓ రేమాండ్ బాబు, ఎస్ఎఫ్ఓ రాజేశ్వర రావు, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సిఓఈ సెట్‌లో రత్నరోహి ప్రతిభ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదల చేసిన సీఈవో సెట్ 2023 ఫలితాలలో మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన కోట రత్నరోహి ఎంపీసీ గ్రూపులో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోనే నెంబర్ వన్ కాలేజీగా పేరు పొందిన హైదరాబాద్ గౌలి దొడ్డి ఐఐటి కళాశాలలో సీటు సాధించారు. ఎర్రుపాలెం గురుకుల పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



ఆడ బిడ్డలకు ఎంత కష్టమో...

తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో నలుగురు ఆడపిల్లలు

నవతెలంగాణ-కారేపల్లి

పేద కుటుంబమైన తన బిడ్డలను ఉన్నతంగా చూడాలనుకున్న ధర్మసోత్ లక్ష్మణ్(56) తన ఆకాంక్షను నెరవేరకుండానే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం రూపంలో మృత్యువు కబలించింది. కారేపల్లి మండలం గేటురేలకాయలపల్లికి చెందిన ధర్మసోత్ లక్ష్మన్(56) బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంకు హాజరైనాడు. కార్యకర్తలు కాల్చిన బాణాసంచా గుడిసెపై పడి నిప్పంటుకుంది. ఆ సమయంలో మంటలు ఆర్పే పనిలో ఉండగా ఒక్కసారిగా గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలటంతో లక్ష్మన్ ఎడమ కాలు నుజ్జునుజ్జు అయింది. అయినా ధైర్యంతో అందరితో మాట్లాడుతూనే ఆసుపత్రికి వెళ్లాడు. ఏమి కాదనుకున్నా సమయంలో బుధవారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మణ్‌కు భార్య సరోజా నల్గురు కుమార్తెలు సరస్వతి, బిందు, రాజేశ్వరి, దుర్గా లు ఉన్నారు. వీరిలో సరస్వతి, బిందులకు తనకు ఉన్న స్తోమతలో వివాహాలు జరిపించాడు. మూడోవ కుమార్తె రాజేశ్వరిని వారణాసిలో బీటెక్ చదివిస్తున్నాడు. చిన్న కూతురు దుర్గా డిప్లొమా చదువుతోంది. తన పిల్లలకు ఎలాంటి కష్టం రాకుండా అల్లారుముద్దుగా పెంచాడు. నల్గురు కూతుర్లకు తండ్రి అంటే ప్రాణం. సాఫీగా నడుస్తున్న వారి జీవితాల్లో అనుకోని ఘటన జరిగి తండ్రిని కోల్పోయారు. దీంతో వారు కన్నీరుమున్నీరు అవుతున్నారు. తమ భవిష్యత్ ఏమిటో అర్థంకాని పరిస్థితిలో వారు కొట్టుమిట్టాడుతున్నారు.

తలకొరివి పెట్టిన తనయ

పేలుడు ఘటనలో మృతి చెందిన ధర్మసోత్ లక్ష్మణ్‌కు నల్గురు కూతుర్లు కావటంతో తండ్రి లక్ష్మణ్‌కు పెద్ద కూతురు సరస్వతి తలకొరివి పెట్టింది. దహన సంస్కరాల సందర్భంగా తండ్రిని పై పడి భార్య సరోజా, నల్గురు కూతుర్లు విలపించిన తీరు అక్కడి వారిని కలచివేసింది.

మిషన్ వాత్సల్య లబ్దిదారులకు ఆదాయ ధృవపత్రం ఇవ్వాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-వేంసూరు

కుటుంబ పెద్దలను కోల్పోయిన చిన్నారులకు విద్యా ప్రోత్సాహకం అందించే మిషన్ వాత్సల్య పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి ఈ నెల 15 వరకు మాత్రమే ధరఖాస్తు చేసుకున్నే అవకాశం ఇచ్చింది. లబ్ధిదారులు కుటుంబ కుటుంబ ఆదాయం 72 వేలు వుండాలని నిబంధన ఉంది. మండలంలో అనేకమంది అర్హత ఉన్నప్పటికీ ఆదాయ ధృవీకరణపత్రాల కోసం స్థానిక మీ సేవా ద్వారా దరఖాస్తులు చేసుకున్న ఇవ్వడం లేదని వెంటనే ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం బాధితులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు. మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పత్రాలను జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి రామారావు, హరింద్ర, తిరుపతిరావు, మారేష్, చంద్రకళ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

చీమలపాడు బాధితులకు రూ.50 లక్షలు ఎక్స్ గ్రేసియా చెల్లించాలి

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పేలుడు వల్ల మృతి చెందిన కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎంఎస్ఎఫ్ పార్టీ మండల నాయుకులు గోళ్లమూడి శ్రీనివాసరావు మాదిగ అన్నారు. ఆ నిరుపేద మృతుల కుటుంబాలకు, ఒక్కొక్కరికి 50 లక్షలు, క్షతగాత్రులకు 25 లక్షలు చెల్లించి మెరుగైన చికిత్స, చేయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయుకులు పరిగడపు.లక్ష్మణ్, ఎంఆర్‌పీఎస్ మండల నాయుకులు తాళ్ళ అర్జున్, పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం పాలడుగు గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. సిపిఐ(ఎం) పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వనమా చిన్న సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలోని ఇఫ్తార్ విందును ముస్లిం సోదరులకు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వనమా చిన్న సత్యనారాయణ ముస్లిం సోదరులకు స్వయంగా భోజనాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు బాజోజు రమణ, మండల కమిటీ సభ్యులు షేక్ మజీద్, వనమా రమేష్, మహిళా సంఘం మండల కార్యదర్శి షేక్ శైనాబి, షేక్ మజీద్ బి, షేక్ రేహనాబి, షేక్ పాతిమ, షేక్ అబ్దుల్ రహిం, షేక్ రఫీ, బొల్లం రామయ్య, షేక్ మౌలాలి, షేక్ కాశం తదితరులు పాల్గొన్నారు.

చిరుమర్రిలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో చిరుమర్రి గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని జడ్పిటిసి పసుపులేటి దుర్గ గురువారం లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ పిహెచ్సి వైద్యాధికారి అంకం అరుణాదేవి, ఎంపీటీసీ కోలేటి అరుణఉపేందర్, గ్రామ ఉపసర్పంచ్ వినుకొండ రమేష్, పంచాయతీ కార్యదర్శి వేల్పుల స్వర్ణలత, కంటి వెలుగు వైద్యాధికారి పి దిలీప్, ఆశ, అంగన్వాడి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో పాదయాత్ర

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం కోసం మండల పరిధిలోని పెద్దతండా నుంచి జలగంనగర్ వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్ రావు మాట్లాడారు. సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు సామాజిక న్యాయం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్, దేవ్ జా, శ్రీను, రవి, సురేశ్, వెంకన్న, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి



నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని పండితాపురం బస్టాండ్ సెంటర్లో ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన ప్రకారం ప్రకారం.. కోదాడ పట్టణంలోని అనంతగిరి నుండి ట్రాక్టర్‌లో కూలీలు ఫినిషింగ్ రాళ్లను తీసుకొని సింగరేణి మండలానికి వెళుతుండగా మార్గమధ్యలో పండితాపురం వద్ద ఎదురుగా వస్తున్న కారు, మోటార్ సైకిల్ ను ట్రాక్టర్ డ్రైవర్ తప్పించబోయి క్రమంలో పల్టీ కొట్టింది. ఆ ట్రాక్టర్ పై వెనకాల కూర్చున్న కూలీలు రాళ్ల పైన పడటంతో ఒకరు మృతిచెందగా ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో అంబులెన్స్ ద్వారా స్థానికులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

రేణుక పర్యటనకు అడుగడుగున అడ్డు

- రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్
- బీఆర్ఎస్ బలి తీసుకుంది : రేణుకా చౌదరి

నవతెలంగాణ-కారేపల్లి

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో గ్యాస్ బండ పేలిన ఘటనలో మృతుల పరామర్శకు గురువారం వచ్చిన కాంగ్రెస్ నేత మాజీ ఎంపీ రేణుకా చౌదరి పర్యటనకు పోలీసులు అడుగడుగున అడ్డుపడ్డారు. ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలుకుతూ బాణాసంచా పేల్చగా అది పక్కనే ఉన్న గుడిసెకు అంటుకోని దానిలో ఉన్న గ్యాస్ బండ పేలి ముగ్గురు మృతి చెందగా, మరో 6 గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన కారేపల్లి మండలం చీమలపాడు, స్టేషన్ చీమలపాడు, గేటురేలకాయలపల్లి గ్రామాలకు చెందిన అజ్మీర మంగు, బానోత్ రమేష్, ధర్మసోత్ లక్ష్మన్ పరామర్శకు బయలుదేరిన మాజీ ఎంపీ రేణుకా చౌదరి ని కామేపల్లి మండలం తాళ్లగూడెం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కారేపల్లి మండలంలోని అడుగు పెట్టకుండా రేణుకా చౌదరి వాహనాలను అపారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరికి పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. మృతుల కుటుంబాలను ఎమ్మెల్సీ తాతా మధు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ లు పరామర్శ చేస్తున్నారని వారి పర్యటన అనంతరం అవకాశం ఇస్తామని పోలీసులు చెప్పారు. రేణుకాచౌదరి తాళ్లగూడెం సర్పంచ్ ఇంటిలో ఉంచి గృహనిర్బంధం చేశారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పర్యటన అనంతరం రేణుకా వస్తుండగా చీమలపాడు వద్ద సైతం ట్రాక్టర్ ట్రాక్‌ను అడ్డుపెట్టి రేణుకా చౌదరి వాహనాలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న రేణుకా చౌదరి పాటిమీదిగుంపు నుండి చీమలపాడు చేరుకున్నారు.



బీఆర్ఎస్ బలి తీసుకుంది.

ఆత్మీయ సమ్మేళనం పేరుతో అమాయకులను బీఆర్ఎస్ బలి తీసుకుందని మాజీ ఎంపీ రేణుకా చౌదరి ఆరోపించారు. గురువారం పేలుడు ఘటన మృతుడు ధర్మసోత్ లక్ష్మణ్ కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పేలుడు ఘటనకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలన్నారు. అంత పెద్ద ఘటన జరిగినా కారకులు ఒక్కరిని అరెస్టు చేయకపోవటం శోచనీయమన్నారు. మా కార్యకర్త చనిపోతే ఆఖరి చూపు చూడకుండా 3 గంటలు అపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నన్ను ఏ చట్టం క్రింద ఆపారని పోలీసులను ప్రశ్నించారు. చేయాల్సిన ధర్మం చేయకుండా అధికార మదంతో బీఆర్ఎస్ నాయకులు ప్రవర్తిస్తుందన్నారు. మృతుల కుటుంబాలకు 3 ఎకరాలు భూమి, రూ.50లక్షలు పరిహారం, ఉద్యోగం, పిల్లలకు ఉచిత విద్య ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడిన పోలీస్ కానిస్టేబుల్‌కు దేవ నవీన్ కు రూ.50 లక్షలు అందించాలని, డిపార్టుమెంట్ పరంగా అన్ని విధాల ఆదుకోవాలన్నారు. అమాయకులకు న్యాయం



దక్కేవరకు వదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దారావత్ రామ్మూర్తి నాయక్, పగడాల మంజుల, చీమల వెంకటేశ్వర్లు, దారావత్ భద్రు, గడ్డం వెంకటేశ్వర్లు, ఈసాల ఛాయదేవి, బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య వాగ్వివాదం

చీమలపాడులో మృతుల కుటుంబాల పరామర్శల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వివాదం జరిగి ఉద్రిత్త పరిస్థితిలు చోటుచేసుకున్నాయి. అజ్మీర మంగు కుటుంబాన్ని ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌లు పరామర్శిస్తున్న క్రమంలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అక్కడి వచ్చారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి పరామర్శించారు. ఈక్రమంలో బాధితులకు పరిహారం పెంచాలని, కాళ్ల కొల్పోయిన వారు జీవచ్ఛావంగా ఉంటారని వారి పట్ల సానుకూలంగా స్పందించి పరిహారం, ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకవచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ తాతా మధు మీరు ఏమిస్తారూ అంటూ కాంగ్రెస్ నేత గోపాల్‌రెడ్డి ఎదురు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పోగ్రాంతో మృతి చెందారని, ప్రభుత్వం ఉన్నది మీదని మీరేమిస్తారంటూ మమ్ములను ఎలా అడుగుతారంటూ గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు వాగ్వివాదం జరిగింది. ఇదే సమయంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాంచంద్రనాయక్, ఏసీపీ బస్వారెడ్డి మధ్య వాగ్వివాదం జరిగింది.

శవ రాజకీలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

మాజీ మంత్రి రేణుక చౌదరి

కామేపల్లి : బీఆర్ఎస్ ప్రభుత్వం శవరాజకీయాలు చేస్తుందని, ఏ చట్టం పేరుతో నన్ను ఆపుతున్నారని మాజీ ఎంపీ రేణుక చౌదరి పోలీసులను ప్రశ్నించారు. కామేపల్లి మండలం ఖమ్మం నుండి ఇల్లందు వెళ్ళే ప్రధాన రహదారి తాళ్ళగూడెం పోలీస్‌స్టేషన్ ముందు మాజీ ఎంపీ రేణుకా చౌదరిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. సింగరేణి మండలం చీమలపాడులో జరిగిన సంఘటనలో మృతి చెందిన బాధితకుటుంబాలను పరామర్శించడానికి వెళ్తుంటే పోలీసులు బిఆర్ఎస్ కార్యకర్తలాగా తమను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. దొంగలకు సెల్యూట్ కొట్టి పంపిస్తున్న పోలీసులు నన్ను ఎందుకు ఆపుతున్నారని హెచ్చరించారు. నా జీవితంలో ముందుకు అడుగు వేయడం తప్ప వెనక్కి అడుగు వేసేది లేదన్నారు. పోలీసులకు కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. దీంతో రోడ్డుపై కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలు దగ్ధం చేశారు. దిష్టిబొమ్మను దగ్ధం చేయవద్దని పోలీసులు అడ్డుకోని లాగేసుకున్నారు. దీంతో రేణుక చౌదరికి రాస్తారోకోకు దిగింది.

ఆదుకుంటాం.. అండగా ఉంటాం..

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం చీమలపాడులో బుధవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనం సమీపంలో గ్యాస్ బండ పేలిన ఘటనలో మృతి చెందిన అజ్మీర మంగు, స్టేషన్ చీమలపాడుకు చెందిన బానోత్ రమేష్, గేటురేలకాయలపల్లికి చెందిన ధర్మసోత్ లక్ష్మణ్ కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, ఇన్‌కం ట్యాక్స్ అడిషనల్ కమీషనర్ లావుడ్యా జీవన్‌లాల్ పరామర్శించారు. జరిగిన ఘటనపై వారి విచారం వ్యక్తం చేశారు. కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని, అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ప్రకటించిన విధంగా మృతుల కుటుంబాలు ఒక్కోక్కరికి రూ.2 లక్షల ను అందజేశారు. ప్రభుత్వ పరంగా రూ. 10



లక్షలు, బీఆర్ఎస్ పార్టీ పరంగా రూ. 5లక్షలు, ఎంపీ నామా నాగేశ్వరరావు ప్రకటించినట్లు రూ.2 లక్షలు అందిస్తామన్నారు. ప్రభుత్వం సాయం త్వరిత గతిన అందేలా కలెక్టర్‌తో మాట్లాడమని ఎమ్మెల్సీ మధు తెలిపారు. పార్టీ పరంగా అందజేసే రూ.5 లక్షలను అంబేద్కర్ జయంతి అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదిగా అందజేయటం జరుగుతుందన్నారు. దురదుష్టకరమైన సంఘటనలో శవరాజకీయలు వద్దన్నారు. ఈసందర్భంగా బాధిత కుటుంబాల సభ్యులు తమకు ఎక్స్‌గ్రేషియాతో పాటు జీవనాధారంగా ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను వేడుకున్నారు. అజ్మీర మంగు కుమారులు గణేష్, ఉమేష్ తమకు అవకాశం కల్పించాలన్నారు. గణేష్ ఐటీఐ పూర్తి చేయగా, ఉమేష్ 10 తరగతి చదివామని తెలిపారు. దీనిపై స్పందించిన వారు ఐటీఐ పూర్తి చేసిన గణేష్ కు ఉద్యోగ కల్పనపై హామీ ఇచ్చారు. వీరి వెంట ఎంపీపీ మాలోత్ శకుంతల, జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, వైస్‌ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్, రైతు బంధు కమిటీ సభ్యులు ఉన్నం వీరేందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, సర్పంచ్ మాలోత్ కిషోర్, బీఆర్ఎస్ నాయకులు ముత్యాల వెంకటప్పారావు, అజ్మీర వీరన్న, అడపా పుల్లారావు, శివరాత్రి అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకుపై అంబేద్కర్ చిత్రం...

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఓ కళాకారుడు రావి ఆకుపై అంబేద్కర్ చిత్రాన్ని రూపొంది ంచాడు. మండలంలోని తెల్దారుపల్లి ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తెల్దారుపల్లి గ్రామానికి చెందిన పాము నాగేశ్వరరావు రావి ఆకుపై అంబేద్కర్ చిత్రాన్ని రూపొందించి అంబేద్కర్ పై తనకున్న ప్రేమను చాటి చెప్పాడు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజకీయవేత్తగా, భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ ఈ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

పీఈటి అద్దంకి జయరాజు మృతి

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అద్దంకి జయరాజు అనారోగ్య కారణాలతో గురువారం మృతి చెందారు. కొంత కాలంగా బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ నిమ్స్ వైద్యశాల నందు కన్ను మూశారు. జయరాజు విద్యార్థులకు వ్యాయామ నేర్పుతూ మండల జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే విధంగా విద్యార్థుల్ని ప్రోత్సహించేవారు. అతనికి భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు గొల్లపూడి గ్రామంలో చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.

జెర్మియా బాబు మృతికి ప్రముఖుల సంతాపం

నవతెలంగాణ-కల్లూరు

పట్టణంలోని శాంతినగర్‌కి చెందిన చర్చి ఫాదర్, స్వచ్ఛంద సేవ నిర్వాహకులు, జెర్మియా బాబు అకాల మృతికి చింతిస్తూ గురువారం పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, ఎంపీపీ బీరవెల్లి రఘు, రైతు సమన్వయ సమితి మండల జిల్లా ప్రతినిధులు లక్కినేని రఘు, పసుమర్తి చందర్రావు, డిసిసిబి డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, చెన్నూర్ సొసైటీ అధ్యక్షుడు పాలె పు రామారావు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, పీసీసీ సభ్యులు బైరెడ్డి మనోహర్ రెడ్డి, స్టేట్ ఎస్సీ డిప్యూటీ కన్వీనర్ కొండూరు కిరణ్ కుమార్, ఖమ్మం జిల్లా నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, ఉన్నారు.

బాధితులకు పరిహారం పెంచాలి : సీపీఐ(ఎం)



- మృతుల కుటుంబాలకు
- సీపీఎం, సీపీఐ పరామర్శ

నవతెలంగాణ-కారేపల్లి

గ్యాస్ బండ పేలుడు ఘటనలో మృతి చెందిన, కాళ్ళు కోల్పోయిన వారికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపెంచాలని సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. గురువారం మృతుల కుటుంబాలను సీపీఐ(ఎం) బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ మృతులు పేద గిరిజనులన్నారు. కుటుంబ పెద్ద మృతితో ఆ కుటుంబాలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్ళాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారం, ప్రభుత్వం ఉద్యోగం కల్పించి అదుకోవాలన్నారు. ప్రమాదం గాయపడి కాళ్ల కోల్పోయిన వారికి రూ.25 లక్షల పరిహారంతో పాటు ఉద్యోగం కల్పించటం ద్వారా వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయన్నారు. గతంలో జరిగిన ఘటనలో రూ.కోటి వరకు పరిహారం అందించిన సందర్భాలు ఉన్నాయని అదే రీతిలో ముఖ్యమంత్రి స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు దుగ్గి కృష్ణ, కే.నాగేశ్వరరావు, కే.నరేంద్ర, వజ్జా రామారావు, శోభన్ తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు సీపీఐ పరామర్శ

చీమలపాడు ఘటనలో మృతి చెందిన అజ్మీర మంగు, బానోత్ రమేష్, ధర్మసోత్ లక్ష్మన్ కుటుంబాలను సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లు పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితు కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో జిల్లా నాయకులు యర్రా బాబు, సీతామహాలక్ష్మి ఉన్నారు.

వేసవి నీటి ఎద్దడి, ఇంటి పన్ను వసూళ్లపై సమీక్ష

నవతెలంగాణ-వైరా



వైరా మునిసిపల్ పరిధిలో రానున్న మూడు నెలలు నీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని చైర్మన్ సూతకాని జైపాల్, కమీషనర్ పితాని వెంకటేశ్వర్లు కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుండి వచ్చే వినతులు నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించాలని, సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే నేరుగా నా దృష్టికి తెచ్చినట్లయితే కమిషనర్‌తో చర్చించి పరిష్కరిస్తానని తెలిపారు. అంతే కాకుండ వైరా మున్సిపాలిటీ పరిధిలో గల 20 వార్డులో కాల్వ పూడికలు, శానిటైజన్ తగిన సమయంలో చేయాలని చైర్మన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ పితాని వెంకటేశ్వర్లు, ఏఈ అనిత, జెఏఓ స్వప్న, టిపిఓ ఎస్.ప్రశాంత్, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

మంత్రి క్యాంపు ఎదుట ఉద్రిక్తత

ఖమ్మం : ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట గురువారం ఉద్రిక్తత నెలకొంది. చీమలపాడు గ్యాస్ సిలిండర్ బాధితులకు రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ కార్యకర్తలు మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడించారు. ఎంపీ నామ నాగేశ్వరరావుకు, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ పై హత్య నేర కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారులను పోలీసులు అరెస్ట్ చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

అకౌంటు నుండి 1,43,000 మాయం

నవతెలంగాణ-మధిర

మండలం పరిధిలో దేశినేనిపాలెం గ్రామానికి చెందిన నాన్ ఐటి ఉద్యోగి, ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంటి నుండి ఉద్యోగం చేస్తున్నా శేఖముడి శ్రీనాథ్ అకౌంటు నుండి గురువారం 1,43,000 రూపాయలు కట్ అయ్యాయని బాధితుడు వాపోయాడు. తనకు ఎలాంటి ఓటీపీలు, లింకులు, మెసేజ్‌లు రాకుండానే తన సెంట్రల్ బ్యాంక్ ఎకౌంటు నుండి అమౌంట్ ఏడుసార్లు ట్రాన్సాక్షన్ అయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారేపల్లి బంద్ విజయవంతం

పేదల మృతికి బీఆర్ఎస్‌దే బాధ్యత

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం చీమలపాడు లో జరిగిన ఘటనలో మృతులకు కంటి తుడుపు పరిహారం వద్దని రూ.కోటి, కాళ్లుకోల్పోయిన వారికి రూ.50 లక్షలు, గాయపడిన వారికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలంటూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం కారేపల్లి బంద్ జరిగింది. ఈ బంద్‌కు సీపీఐ, బీజేపీలు మద్దతు ప్రకటించాయి. బంద్ సందర్భంగా కారేపల్లి దుకాణాలు మూసివేశారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో అఖిల పక్షనాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆనువూరి మధు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా బీఆర్ఎస్ సభ నిర్వహించిందని చట్ట విరుద్దంగా వేలాదిమందిని సమీకరించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నాయకులు వై.ప్రకాష్, కంచర్ల శ్రీనివాసరెడ్డి, వై.జానకీ, కోయల శ్రీనివాస్, సీపీఐ నాయకులు బోళ్ల రామస్వామి, నాగవెల్లి సుధాకర్, బీజేపీ నాయకులు తురక నారాయణ, కాంగ్రెస్ నాయకులు మేదరి వీరప్రతాప్(టోనీ), బానోత్ హీరాలాల్, ఆటో యూనియన్ నాయకులు బద్దె రాము, దిండు సైదులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం

తహసీల్దార్ శిరీష

నవతెలంగాణ-ముదిగొండ



మండలంలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుని, ఉక్కు పాదంతో అణిచివేస్తామని తాసిల్దార్ జి శిరీష హెచ్చరించారు. గురువారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా చేస్తే ట్రాక్టర్లను పట్టుకొని నెలరోజులుపాటు సీజ్ చేస్తామన్నారు. రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టామన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇసుక అవసరం మేరకు అనుమతులు ఇస్తామన్నారు. తహసీల్దార్ అనుమతితోనే ఇసుక రవాణా చేసుకోవాలన్నారు. ఇసుక అక్రమానికి పాల్పడితే అక్రమార్కులను వదిలిపెట్టేది లేదన్నారు.

4వేలు చెల్లిస్తే 40వేలు లోన్ ఇస్తామంటూ మోసం

నవతెలంగాణ-తల్లాడ

4వేలు చెల్లించండి 40వేల లోను ఇస్తామంటూ మోసం చేశారని మోసం చేసిన వారిపై చర్య తీసుకోవాలంటూ తల్లాడ మండలం అంజనాపురం గ్రామానికి మహిళలు తల్లాడ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల కథనం ప్రకారం అశ్వారావు పేటకు చెందిన వారమని, తన పేరు సురేష్ రెడ్డి అంటూ ఓ వ్యక్తి అంజ నాపురం వచ్చి, పరిచయం చేసుకొని రూపాయి వడ్డీకి రుణాలు ఇస్తామని రెండు సంవత్సరాల్లో రుణం నెల వాయిదాల్లో చెల్లించాలని నమ్మబలికారు. ముందుగా నాలుగు వేలు చెల్లించిన వారికి 40 వేలు రుణం అందిస్తామని ఈనెల 5న 8 మంది నుండి 4000 రూపాయలు చొప్పున కట్టించుకుని పత్తా లేకుండా పోయారని బాధిత మహిళలు వాపోయారు. వారి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వినియోగించిన పల్సర్ 180 సిసి నెంబర్ ఏపీ 37 ఎటు 9898, కార్ నెంబర్ ఏపీ 28 ఏటి 2652 నెంబర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు.

మీసేవ కేంద్రాల నిర్వహణ తీరును తహసీల్దార్లు పర్యవేక్షణ చేయాలి

- ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి
- కలెక్టర్ అనుదీప్



నవతెలంగాణ-పాల్వంచ

మీసేవ కేంద్రాల నిర్వహణ తీరును తహసీల్దారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ కేంద్రాల ద్వారా అందించే సేవలకు ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు ప్రజల నుండి నామమాత్ర రుసుంలు మాత్రమే తీసుకోవాలని అదనంగా తీసుకునే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆయనే ఆదేశించారు. మీ సేవ కేంద్రాల నిర్వహణతో సమావేశ నిర్వహించి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. ధరణిలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులు సత్వరం పరిష్కరించి విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. కోర్టు కేసులకు సంబంధించి పెండింగ్ ఉన్న 94 కేసులో తక్షణమే కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పారు. గోదావరి వరదల ప్రజల ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఇరిగేషన్ అధికారులు కార్యచరణ నివేదికల సిద్ధం చేయాలని చెప్పారు. మండలాల్లో ఆధార్ సేవల కోసం చర్యలు తీసుకోవాలని ఈడీఎంను ఆదేశించారు. కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా విచారణ నిర్వహించాలని చెప్పారు. 507 దరఖాస్తులు విచారణ పూర్తయిందని 308 దరఖాస్తులు విచారణ నిర్వహించాల్సి ఉందని వారం రోజుల్లో విచారణ పూర్తి చేయాలని చెప్పారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత ప్రతిపాదనలు అందజేయాలని పంచాయతీరాజ్ గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. కొత్తగూడెం, ఇల్లందు మండలాల్లో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వారిగా 5, 10శాతం తొలగించిన ఓటర్ జాబితా అనుసరించి తిరిగి విచారణ చేపట్టాలని చెప్పారు. బూత్ స్థాయి అధికారులుగా ప్రైవేట్ సిబ్బంది ఉండొద్దని అలా ఉన్నట్లయితే వారి వివరాలు అందజేయాలని చెప్పారు. నూతనంగా వచ్చిన 6, 7, 8 విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనప కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ వెంకటేశ్వర్ రెడ్డి, పీఆర్ ఈ.సుధాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈ.తానాజీ, సర్వే ఏడీ కుసుమ కుమారి, డిఎస్‌ఓ మల్లికార్జున్, పౌరసరఫరాల డిఎం త్రినాథ్, డిఆర్‌ఓ అశోక్ చక్రవర్తి, ఆర్డీవో సనాతన్య, అన్ని మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సుజాతనగర్

మండల పరిధిలోని సింగభూపాలెం, సర్వారం గ్రామంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు గురువారం పరామర్శించారు. సర్వారం గ్రామంలోని కొత్తగూడెం సొసైటీ డైరెక్టర్ సేవ్య నాయక్ అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మరణించాడు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగభూపాలెం గ్రామంలోని బీఆర్‌ఎస్ నాయకులు ఇస్తారయ్య కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్నాడని తెలిసి అక్కడికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. తనను నమ్ముకున్న వారికి ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, స్థానిక కౌన్సిలర్ రుక్మందర్ బండారి, బిఆర్‌ఎస్ నాయకులు సాంబయ్య, గాజుల సీతారామయ్య, కుమారస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యాగ్రహ సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి



నవతెలంగాణ-ఇల్లందు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నిర్వహిస్తున్న పీపుల్స్ మార్చ్ కార్యక్రమంలో భాగంగా నేడు ఛలో మంచిర్యాల సత్యా గ్రాస్ సభకు కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నియోజవర్గ కాంగ్రెస్ నాయకురాలు మాలోత్ విజయలక్ష్మి, కిషన్ నాయక్, గూగులోత్ బాలు, అశోక్ లాల్ సింగ్, మురళి కోరారు. స్థానిక అయితా ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న కాలం కాంగ్రెస్ పార్టీ దేనిని అన్నారు.

చీమలపాడు ఘటనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో జరిగిన అగ్ని ప్రమాదం ఘటన దురదృష్టకరమని అన్నారు. రాజకీయాలు లబ్ది కోసమే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారని అన్నారు. అనుమతులు లేకుండా టపాసులు పేల్చడం కూలీలు, పేదలు మృతి చెందడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే ఎంపీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, బాధిత కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం, మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు

- భద్రాద్రి రామయ్య తలంబ్రాలు అందజేత



నవతెలంగాణ-దుమ్ముగూడెం

రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కె.పద్మారావు గౌడ్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకొని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలతో పాటు, అక్రిడిటేషన్ కార్డులు అందజేయాలని, అన్ని కార్పొరేట్ హాస్పిటల్లో హెల్త్ కార్డుల ద్వారా ఉచితంగా వైద్యం అందించాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య వంటి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన జర్నలిస్టుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు భద్రాద్రి రామయ్య కళ్యాణ తలంబ్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెలమ రాజేందర్ తదితరులు ఉన్నారు.

ప్రశ్నపత్రాలు లీకేజీలో టీఎస్పీఎస్సీ బోర్డు చైర్మెన్‌ను సస్పెండ్ చేయాలి

- జడ్పీటీసీ నాగమణి



నవతెలంగాణ-ములకపల్లి

ప్రశ్నాపత్రాల లీకేజీలో టీఎస్పీఎస్సీ బోర్డు చైర్మెన్‌ను సస్పెండ్ చేయాలని జడ్పీటీసీ సున్నం నాగమణి అన్నారు. గురువారం ములకలపల్లి మండలం మాదారం గ్రామంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డును ప్రక్షాళన చేసి కొత్త బోర్డును ఏర్పాటు చేసిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలన్నారు. నేటివరకు లీకేజీల వెనక ఉన్న ప్రముఖుల పాత్రపై సరైన దర్యాప్తు చేసి చర్య తీసుకోలేదని ఆరోపించారు. సుమారు 30 లక్షల మంది నిరుద్యోగులు పొట్ట కొట్టిన ప్రముఖులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకొని, బోర్డు ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన నిరుద్యోగులందరికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టీడబ్ల్యూజేఎఫ్ ములుగు జిల్లా ఇన్చార్జిగా కర్ర అనిల్ రెడ్డి



నవతెలంగాణ-దుమ్ముగూడెం

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ములుగు జిల్లా ఇన్చార్జిగా కర్ర అనిల్ రెడ్డి నియమితులయ్యారు. గురువారం సికింద్రాబాద్‌లోని సీతాఫల్ మండి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో ఆయనకు ములుగు జిల్లా బాధ్యతలను అప్పగించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్రిడిటేషన్ మెంబర్‌గా యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్న అనిల్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సంఘం బలోపేతానికి తనదైన శైలిలో ఎనలేని కృషి చేశారు. జిల్లాలో మిగతా ట్రేడ్ యూనియన్ల కంటే అత్యధిక సభ్యత్వాలతో పాటు టీడబ్ల్యూజేఎఫ్ సంఘాన్ని ముందు వరుసలో ఉంచారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ తన మీద నమ్మకంతో ములుగు జిల్లా బాధ్యతలు అప్పగించిందని సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టులందరినీ ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ములుగు జిల్లా బాధ్యతలు స్వీకరించిన అనిల్ రెడ్డిని పలువురు జర్నలిస్టు యూనియన్ నాయకులు జర్నలిస్టులు అభినందించారు.



లౌకిక, ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే..

అంబేద్కర్‌కి ఇచ్చే నివాళి

డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ జయంతి వేళ సీపీఐ(ఎం) భద్రాచలం ఒక చక్కని కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అనేక రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు, వివిధ సంఘాల బాధ్యులు భారీ ఎత్తున హాజరయ్యారు. భారత రాజ్యాంగం గొప్పతనం, అంబేద్కర్ చేసిన సేవలు గురించి అనేకమంది వక్తలు తమ తమ అభిప్రాయాలను ఘంటాపదంగా వెల్లడించారు. అంబేద్కర్ ఔన్నత్యంపై సీపీఐ(ఎం) రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా మరోసారి మననం చేసుకునే అవకాశాన్ని కల్పించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి భారీ స్పందన లభించింది.

ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న బీజేపీ

- సీపీఐ(ఎం) రౌండ్ టేబుల్ సమావేశం పలువురు వక్తలు



నవతెలంగాణ-భద్రాచలం

భారత లౌకిక, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని దానిని కాపాడు కోవడం పౌరులందరి బాధ్యతని, అంబేద్కర్ 132వ జయంతి ఉత్సవాల సందర్భంగా భద్రాచలంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో "భారత రాజ్యాంగం-ప్రజాస్వామ్యం-ఎదురవుతున్నసవాళ్లు" అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ గురువారం జరిగింది. ఈ సమావేశమునకు సీపీఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్, భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట్ల దేవదానం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నదని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకు పోవడం ప్రతి ఒక్క పౌరుడు పై ఉన్నదని వారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని, లౌకిక, ప్రజాస్వామ్యం, ఆర్థికస్వాలంబన, సామాజిక న్యాయం, ఫెడరలిజం వంటి రాజ్యాంగ మౌలిక స్వరూపాలకు పెనుముప్పు పొంచి ఉన్నదని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు ముందుకు తీసుకోవడం అంటే తిరోగమన విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమేనని అన్నారు. ప్రస్తుతం దేశంలో కార్పోరేట్, సామ్రాజ్యవాద పరిస్థితులు రాజ్యమేలుతున్నాయని అందుకు బీజేపీ గుత్త సంస్థలకు అనుకూలంగా ఆర్థిక విధానాలు నిర్ణయించడం కారణం అన్నారు. సామాజిక న్యాయం అందని ద్రాక్షగా ఉన్నదని విమర్శించారు. బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ అండదండలతో పాలన సాగుతుందని అన్నారు. బీజేపీ కార్పొరేట్, గుత్త సంస్థలకు భారత ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మటానికి నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని అన్నారు.

భారత రాజ్యాంగానికి బదులు బీజేపీ మనువాదాన్ని అమలు జరపాలని చూస్తున్నదని అన్నారు. భారత సమాజంలో మనువాదాన్ని అమలు జరపడం అంటే పాతకాలపు ఫ్యూడల్ భావజాలాన్ని ముందుకు తీసుకురావటమేనని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి పురోగామి శక్తులు, అభ్యుదయ సంస్థలు ఒక తాటిపైకి రావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం ప్రజలందరి బాధ్యత అన్నారు. భారత సమాజంలో కులం, మతం, ప్రాంతం అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయని అన్నారు. అభ్యుదయ శక్తులు ఐక్యంగా పోరాటం ద్వారా అంబేద్కర్ ఆశించిన ఫలాలను సాధించవచ్చునని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అరికెళ్ల తిరుపతిరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సరేళ్ళ నరేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు కుంచాల రాజారాం, ఎంఎస్‌పీ పార్టీ నాయకులు అలవాల రాజా, గిరిజన సామాజిక సంఘాల నాయకులు పూనం వీరభద్రం, పూజెం కృష్ణ, టీఎన్జీవో జిల్లా నాయకులు చల్లగుల్ల నాగేశ్వరరావు, పట్టణ ప్రముఖులు సీనియర్ సీపీఐ(ఎం) నాయకులు జిఎస్ శంకర్రావు, పట్టణ పౌరసమితి నాయకులు తాళ్లపూడి రాము, గ్రీన్ భద్రాద్రి గౌరవ అధ్యక్షులు పల్లంటి దేశప్ప, కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముర్ల రమేష్, తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్, దళిత సంక్షేమ సంఘం వ్యవసాయ వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పాల్రాజ్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు కోరాడ శ్రీనివాస్, అంబోజీ రత్నం, గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్, మైనారిటీ నాయకులు మునాఫ్, సలీం, సిఐటియు నాయకులు ఎం.రేణుక, ఎం.నాగరాజు, లక్ష్మన్న, పార్టీపట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు యు.జ్యోతి, డి.సీతాలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు లీలావతి, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజన్ ఉపాధ్యక్షులు ప్రతాప్, ఆర్టీసీ జిల్లా నాయకులు రాజేశ్వరరావు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బిబిజి తిలక్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు పట్టణ పౌరులు ఎన్జీవో సంస్థలు అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు : రేణుక చౌదరి



నవతెలంగాణ-మణుగూరు

చీమలపాడులో క్షతగాత్రులను, మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు వెళుతున్న మాజీ మంత్రి రేణుకా చౌదరిని అడ్డుకోవడం అప్రజాస్వామ్యం చర్యాని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గురజాల గోపి అన్నారు. గురువారం కారేపల్లి మండలం చీమలపాడులో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా బాణాసంచా వలన గ్యాస్ పేలిన ఘటనలో ముగ్గురు మృతి చెందిన ఘటన తెలిసిందన్నారు. మరణించిన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుక చౌదరిని పోలీసులు అడ్డుకోవడం సరైన కాదన్నారు. రేణుక చౌదరిని గృహనిర్బంధంలో ఉంచగా వెళ్లి చీమలపాడును ముందుగా సందర్శించి అక్కడి వివరాలను వివరించారు.

60 ఏండ్ల సమస్యకు నెరవేరిన రహదారి 'మార్గం'

- గ్రామానికి అనుదీప్ గుంపుగా నామకరణం
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని సుబ్బారావుపేట గ్రామ పంచాయతీలో గల మద్యగుంపు గ్రామంలో 40 గిరిజన కుటుంబాలు నివసించుచున్నారు. వీరి ఇండ్ల నుండి ప్రధాన రహదారికి వెళ్ళడానికి రోడ్డు సౌకర్యం లేనందున 60 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్య గుంపు ప్రజలు బయటకు వెళ్ళాలి అన్న పొలం గట్ల వెంబడి వెళ్ళవలసి వస్తుందని, దీనితో పాఠశాలకు వెళ్ళే చిన్న పిల్లలు, అనారోగ్య పరిస్థితులలో వున్నా వృద్ధులు, గర్భిణీలు వెళ్ళడానికి రోడ్డు లేక నిత్యం అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో తీవ్రమైన సమస్య వుంటుంది. ఎవరైనా వ్యక్తి మరణించినప్పుడు బయటకు తీసుకు వెళ్ళవలసిన పరిస్థితి వస్తే పొలం గట్ల మీద నుండి వెళ్ళవలసి వచ్చేది. పొలం రైతులు తన పొలం చెడిపోతుందని నానా దుర్భాషలాడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ విషయమై గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు 27.02.2023 రోజున ఫిర్యాదు చేశారు. తదుపరి ప్రజా ప్రతినిధులు మండల స్థాయి అధికారులు అనేక మార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి గత 60 ఏండ్ల రోడ్డు సమస్యకు పరిష్కార మార్గం చూపించారు. గ్రామానికి చెందిన పాయం కన్నయ్యకు చెందిన వ్యవసాయ పట్టా భూమి నుండి 8 ఫీట్లు వెడల్పుతో 200 మీటర్ల పొడవు రోడ్డు నిర్మాణానికి నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్ పై దాన పత్రము గ్రామ పెద్దల సమక్షములో రాసి ఇచ్చారు. దీంతో గ్రామపంచాయతీ నిధులతో రహదారి పనులు ప్రారంభించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో తమ గ్రామానికి రహదారికి మోక్షం కలిగిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు గ్రామానికి అనుదీప్ గ్రామంగా నామకరణం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటసీ తెల్లం సీతమ్మ ఎంపీడీవో ఎం.చంద్రమౌళి, ఎంపీఓ ముత్యాలరావు, సుబ్బారావు పేట, నడికుడి సర్పంచులు చిన్నారావు, తెల్లం రామకృష్ణ, ఎంపీటీసీ తిరుపతిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మణుగూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా : రేగా



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీనీ ఆదర్శమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం మణుగూరు మున్సిపాలిటీలో ఆయన విస్తృతంగా పర్యటించారు రాజీవ్ గాంధీ నగర్‌లో సుమారు రూ.4.50 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు పరిశీలించిన ఆయన మరోమారు ఆ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతికి సంబంధించి సంబంధిత శాఖల అధికారుల నుండి ఫైల్ తెప్పించుకొని పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వ్యాపారులకు అందించి ప్రజలకు సమీకృత మార్కెట్లను సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. అనంతరం ఆదర్శనగర్‌లో రూ.50 లక్షల అంచనాతో నిర్మిస్తున్న డ్రైనేజ్‌ని నిర్మాణ పనులను పరిశీలించి గుర్తించారు. డ్రైనేజ్ వెంట నడుస్తూ ఆ పనులను స్వయంగా రేగా పరిశీలించారు. అనంతరం వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

ఈ పర్యటనలో ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ నరసింహారావు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ పట్టణ అధ్యక్షులు ముత్యం బాబు, అడపా అప్పారావు, కార్యదర్శులు బొల్లి శెట్టి నవీన్, యాదగిరి గౌడ్, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ కారం విజయకుమారి, కో ఆపరేషన్ సభ్యులు జావిద్ పాషా, వట్టం రాంబాబులతో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఉద్యోగుల సమ్మె సైరన్

- ఏప్రిల్ 17 నుండి సమ్మె

నవతెలంగాణ-పినపాక

తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధం అవుతున్నమని పీఆర్సి అమలులో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఏప్రిల్ 17వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు దిగాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం మేరకు సమ్మెలో పాల్గొంటున్నట్లు జేఏసీ చైర్మన్ వెంకటేశ్వర్లు (1104 యూనియన్) తెలియజేశారు. గురువారం ఈ బయ్యారంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కరకగూడెం, మణుగూరు ఉద్యోగులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 1999, 2004 మధ్య నియమించబడిన ఉద్యోగుల కోసం ఈపీఎఫ్‌ను జీపీఎఫ్ సదుపాయంగా మార్చడం, విద్యుత్తు వినియోగాల్లోని చేతివృత్తుల వారి డిమాండ్లపై ప్రతిష్టంభన కొనసాగిందన్నారు. గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ సంఘంపై యాజమాన్యం వైఖరి పట్ల ఉద్యోగులు నిరాశ చెందారని జేఏసీ నాయకులు తెలిపారు. సమ్మెను ఉద్యోగులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్, డీఈ జీవన్ కుమార్, కో చైర్మన్ బి.రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ వెంకటరాజు (సీఐటీయూ), ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ఉదయ్ రత్న కుమార్, ఉద్యోగుల సంఘం బీసీ నాయకులు సీతారాములు, ఉద్యోగుల ఓసి అసోసియేషన్ నాయకురాలు, ఈ.బయ్యారం ఏఈ కావ్య, విద్యుత్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులను అభినందించిన ఏఎస్‌పీ



నవతెలంగాణ భద్రాచలం రూరల్

ఈ నెల హైదరాబాదు మహానగరంలోని శంషాబాద్ నందు జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులకు రెండు బంగారు పథకాలు, ఒక సిల్వర్ పథకం సాధించినారు. ఈ గెలుపొందిన క్రీడాకారులను భద్రాచలం ఏఎస్పీ వారి కార్యాలయంలో అభినందించారు. ఏఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి ఎంతో ఉల్లాసాన్నిస్తాయని చెప్పి తెలిపారు. అంతేకాకుండా ప్రతి వ్యక్తి కూడా ప్రతిరోజు ఉదయము కనీసం ఒక గంట అయినా సరే వ్యాయామం చేయాలని సూచించారు. ఈ వ్యాయామం చేయటం వలన శరీరానికి ఫిట్నెస్ మాత్రమే కాకుండా డాక్టర్ దగ్గర కూడా వెళ్లే అవసరం ఉండదు అని తెలిపారు. ఈ క్రీడాకారుల విజయానికి కారణమైనటువంటి సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా ఈ గెలుపొందిన క్రీడాకారులను ఫోన్ ద్వారా పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, క్రీడా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఉపాధ్యక్షుడు వి.మల్లేష్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లాయర్ తిరుమల రావు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు టి.వసంతరావు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ట్రెజరర్ వీరారెడ్డి, సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

బీఆర్‌ఎస్ పార్టీకి పలువురు రాజీనామా

- రాజీలు ఇంకా ఉంటాయి : జారే

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. అన్నపురెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బొడా పద్మ, మండల ప్రధాన కార్యదర్శి పర్స వెంకట్‌తో పాటు వంద కుటుంబాలు అశ్వరావుపేట నియెజకవర్గ నాయుకులు జారే ఆదినారాయణ సమక్షంలో మండల కేంద్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా జారే ఆదినారాయణ మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి మండలంలో ప్రతి గ్రామంలో రాజీనామాలు ఉంటాయన్నారు.

పినపాక : మండలానికి చెందిన పలువురు గురువారం బీఆర్‌ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. మండల పరిధిలోని ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నామని ప్రకటించారు. పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పొంగులేటి, పాయం అభిమానులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వైపు నడుస్తామని ప్రకటించారు.

రూ.5 లక్షలతో సీసీ రహదారి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని మారాయి గూడెం గ్రామపంచాయతీలో రూ.5 లక్షలతో సీసీ రహదారి పనులు చేపట్టారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిర్మించే బీసీ రహదారి పనులను మారాయి గూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ టి.తిరుపతిరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మారాయి గూడెం ఆర్ అండ్ బి రహదారి నుండి సోందే భద్రయ్య ఇంటి వరకు 102 మీటర్ల మేర సీసీ రహదారి నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మారాయి గూడెం ఎంపీటీసీ పెనుబల్లి సీతమ్మ, జేఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మణుగూరు : మండల పరిషత్ అభివృద్ధి నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించినట్లు ఎంపీపీ కారం విజయకుమార్ తెలిపారు. గురువారం పరిషత్ నిధులతో సమితి సింగారం గ్రామపంచాయతీలో పద్మశాలి భవన్ దగ్గర రూ.1,80,000తో సైడ్ డ్రైన్‌లు రిక్షా కాలనీలో 8 లక్షలతో సైడ్ డ్రైను, రాజీవ్ గాంధీ నగర్‌లో నాలుగు లక్షలతో ఫైట్ డ్రైన్‌ను ముత్యాలమ్మ నగర్‌లో రూ.ఐదు లక్షలతో సైడ్ డ్రైన్‌ను నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నరసింహారావు, వైస్ ఎంపీపీ కేవీ రావు, సర్పంచ్ బచ్చల భారతి, ఉప సర్పంచ్ శంకర్, సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ ముత్యం బాబు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

చండ్రుగొండ : మన ఊరు మనబడి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్ ఆదేశించారు. గురువారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోకలగూడెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోకలగూడెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చండ్రుగొండ పాఠశాలలను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్ జిల్లా సమ్మిళిత విద్యాధికారి సైదులు సందర్శించారు. ఎస్ఏ-II పరీక్షల నిర్వహణ, మన ఊరు మన బడి పనులు పరిశీలించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

భద్రాచలం రూరల్ : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్‌ని పాటించాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ వివిఎన్ రావు వాహన దారులను కోరారు. గురువారం భద్రాచలం పట్టణంలోని వివిధ ప్రధాన కూడ ళ్ళ వద్ద విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరిం చని, లైసెన్స్ లేని వారిని నెంబర్ ప్లేట్లు లేని వారు అదే విధంగా నెంబర్లు పూర్తిస్థాయిలో లేని వారిని ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటిస్తేనే ఇటు సమాజానికి, తన వ్యక్తిగత కుటుంబానికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

ఏరియాలో పర్యటించిన జీఎం (ఐఅండ్‌పీఎం)

ఇల్లందు : జీఎం(ఐఅండ్‌పీఎం)ఎ.రవికుమార్ గురువారం ఇల్లందులో పర్యటించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏరియా అధికారులతో నూతన జెకె5 ఉపరితల గని పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వారికి ఎస్ఓటు జీఎం మల్లారపు మల్లయ్య నూతన జెకె5 ఉపరితల గని కోసం చేస్తున్న పనుల వివరాలు, రెమిడేయేషన్ పనులలో భాగంగా ఓసి ప్రభావిత గ్రామాలకు సింగరేణి సంస్థ ద్వారా చేసిన పనుల వివరాలను, కార్పొరేట్ సామజిక భాద్యతలో భాగంగా నిరుద్యోగ యువతకు, మహిళలకు కల్పిస్తున్న ఉచిత శిక్షణ వివరాలను వివరించారు. తదుపరి రవికుమార్ తగు సలహాలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (ఐఅండ్‌పీఎం)డి.వి రామారావు, డిజియం(ఫైనాన్స్) బి.వెంకటరామచంద్ర, ఎస్టేట్ అధికారి పి.మహేశ్వర్, సర్వేయర్ మంగిలాల్ తదితరులు పాల్గొనారు.

మహిళ సమ్మాన్ సర్టిఫికెట్ పై అవగాహన సదస్సు

దుమ్ముగూడెం : మండలంలోని దుమ్ముగూడెం సబ్ పోస్ట్ ఆఫీస్‌లో గురువారం మహిళ సమ్మన్ సర్టిఫికెట్ పై అవగాహనా సదస్సు నిర్వహించారు. భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఇంచార్జ్ ఏఎస్పీ వి.సుచెందర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు దుమ్ముగూడెం సబ్ పోస్ట్ మాస్టర్ జానకి రాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా మహిళలకు ఎంతో ఉపయోగపడేలా మహిళా సమ్మాన్ సర్టిఫికెట్ పథకం ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ పథకంలో కనిష్టంగా రూ.1000 నుండి గరిష్టంగా రూ.రెండు లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చని అన్నారు. ఫిక్స్ చేసిన డబ్బులకు 7.5 వడ్డీ చెల్లించడం జరుగుతుందని, చక్ర వడ్డీ కూడా లభిస్తుందని, తెలిపారు. ఈ సమావేశంలో మెయిల్ వరుసల్ గోపాల్, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు బతికించాలి

కొత్తగూడెం : పాలక ప్రభుత్వాల వలన అంబేద్కర్ ఆశయాలు మాసిపో తున్నాయని, ఆయన ఆశయాలు బతించి, ముందు తరాలకు అందించాలని గాంధీ పథం కన్వీనర్ చింతల చెర్వు గెర్షోం అన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీ భవిష్యత్తు తరగతి గదిలోనే ఉందిని చెప్పిన మహానుభావుడని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెలికం డీఈ సక్రు, నారాయణ, అల్ ఇండియా పరిశ్రమల బోర్డు మెంబర్ దాయానంద్, గుడివాల రాము, మాల మహనాడు కొత్తగూడెం కన్వినర్ కిష్టఫర్, సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, నర్సమ్మ, ఎల్లమ్మ రాజమ్మ, జి. ప్రేమానందం, జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : జీఎం

ఇల్లందు : మజ్జిగ ప్యాకెట్లను తగు నాణ్యతతో అన్ని ప్రమాణాలు పాటించి సరఫరా చేయాలని లేనిపక్షంలో టెండర్ రద్దు చేస్తామని జీఎం షాలెం రాజు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని వివిధ గనులలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేసవికాలం జాగ్రత్తలలో భాగంగా ఏప్రిల్ 1 నుండి మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగానే మజ్జిగ నాణ్యత పై అందుకున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేసే టెండర్ దారుడితో సమీక్ష నిర్వహించడం జరిగిందని తెలిపారు.

మండల వాసవీక్లబ్ అధ్యక్షునిగా బిక్కుమళ్ల



ములకలపల్లి : ములకలపల్లి మండల వాసవీక్లబ్ అధ్యక్షునిగా బిక్కుమళ్ల సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం బాధ్యులు బిక్కుమళ్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బిక్కుమళ్ల మాట్లాడుతూ వాసవీక్లబ్ అధ్యక్షునిగా తనను నియమించడంతో తనకు బాధ్యత మరింత పెరిగిందని, మండలంలో పలు సేవాకార్యక్రమాలను క్లబ్ ద్వారా ముందుకు తీసుకువెళ్లి ప్రజాసేవలో తనవంతు పాత్ర పోషిస్తానన్నారు.

తునికాకు బకాయిలును వెంటనే చెల్లించాలి

కరకగూడెం : గత సంవత్సరం ఎండలను సైతం లెక్కచేయకుండా తునికకు సేకరణ చేసిన ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఇప్పటివరకు బకాయిలు చెల్లించలేదని పినపాక నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త చందా మధు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తునికాకు సేకరించే వారికి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, వడదెబ్బ గురికాకుండా కాంట్రాక్టర్లు కల్లేదారులు, ఫారెస్ట్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తునికాకు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

చీమలపాడు మారణ హోమానికి బీఆర్ఎస్ సర్కార్ దే బాధ్యత

- బీఎస్పీ రాష్ట్ర పధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమల పాడులో జరిగిన ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ అంబేడ్కర్ సెంటర్ నుండి బస్టాండ్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు గురువారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ అండ, ఆర్థిక, అధికార బలం ఉన్నాయని బీఆర్ఎస్ ప్రభుత్వం విర్రవీగుదిగుతుందని ఆరోపించారు. మరికొద్ది నెలలోనే తెలంగాణలో అధికార మార్పిడి కచ్చితంగా జరిగి తీరుతుందని జోష్యం చెప్పారు. ఘటనలో క్షతగాత్రులకు రూ.50 లక్షల ఆర్థిక సహాయంతో పాటు పూర్తి వైద్య ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని, మృతుల కుటుంబాలకు రూ.1కోటి పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మం ఎంపీ, ఎమ్మెల్యేపై హత్యానేరం కింద క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జున రావు, సాయి, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు కోలా మల్లికా, నాగుల రవికుమార్, తాటి పాముల హరి కృష్ణ, సందేల పవన్ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఆర్టిజన్ కార్మికులు

కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో మహాధర్నా

- రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్న 5000 మంది ఆర్టిజెన్స్
- స్పందించకుంటే 25 నుండి సమ్మెకు దిగుతాం
- మద్దతు ప్రకటించిన వామపక్షాలు



నవతెలంగాణ-పాల్వంచ

టీఎస్ జెన్కో, టీఎస్ ట్రాన్స్కో, ఎంపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న 23 వేల మంది ఆర్టిటిషన్‌లందరినీ ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని స్టాండింగ్ ఆర్డర్‌ను రద్దుచేసి కన్వర్షన్ అమలు పరచాలని, ఆర్టిజన్స్ అందరికీ 50 శాతం ట్రీట్మెంట్తో కలిసి పీఆర్సి అమలుపరచాలని, ఈపీఎఫ్ సీలింగును ఎత్తివేసి అన్లిమిటెడ్ ఈపీఎఫ్‌ను అమలు చేయాలని, ఐడీ నెంబర్ కలిగిన కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 82 ఆధ్వర్యంలో గురువారం పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ అంబేద్కర్ సెంటర్లో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5000 మంది కార్మికులు పాల్గొని కతం తొక్కారు. ఆర్టిజన్లో నినాదాలతో దద్దరిల్లిపోయింది. ఈ మహా ధర్నాకు వామపక్ష పార్టీలన్నీ మద్దతు పలికాయి. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్-82 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిలు మాట్లాడుతూ యాజమాన్యం తక్షణమే స్పందించి ఆర్టిజన్ల ప్రధాన సమస్య ఏపీఎస్ఈబి కన్వర్షన్, 50శాతం పిఆర్సీ, ఇతర సమస్యలపై చర్చించి పరిష్కారించకుంటే 25వ తారీఖు నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23000 మంది ఆర్టిజన్లు నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. తామేమీ గొంతెమ్మ కోరికలు కోరట్లేదని తమవి న్యాయబద్దంమైన, రాజ్యాంగబద్దమైన కోరికలని ఒకే సంస్థలో ఒకే సర్వీస్ రూల్స్ ఉంటాయని ఎందుకు మా ఆర్టిజన్ల మీద బ్రిటీష్ స్టాండింగ్ ఆర్డర్స్‌ను రుద్దుతున్నారని ప్రశ్నించారు. తాము ప్రభుత్వానికి ఏ మాత్రం వ్యతిరేకం కాదని గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ విద్యుత్ సంస్థలోని కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయమని యాజమాన్యానికి చెప్పినా యాజమాన్యం మాత్రం మామీద ఈ బ్రిటీష్ రూల్స్ రుద్దుతూ వెట్టిచాకిరి చేయిస్తున్నదని, ఇది ఏ మాత్రం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ప్రపంచానికి వెలుగును పంచి చీకటి జీవితాలు గడుపుతున్న ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించి 23000 మంది ఆర్టిజన్ కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపాలని ఆకాంక్షించారు. ఈ ధర్నాకు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ మహాధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడుతూ ఆర్టిజన్లతో వ్యక్తి చాకిరీ చేయిస్తున్నారని మీరు అడిగే డిమాండ్లు న్యాయమైనవని తక్షణమే యాజమాన్యం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆర్టిస్టులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. బిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శియెర్రా కామేష్ మాట్లాడుతూ తక్షణమే సమస్య పరిష్కరించాలని, ఆర్టిజన్ల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో హెచ్-82 జెన్కో రాష్ట్ర కార్యదర్శి ఆవుల క్రిష్ణా రెడ్డి, అధ్యక్షులు ఉండేటి జయరాజు, జలీల్, బాలకృష్ణ, బాల్ రెడ్డి, శ్రీకాంత్, రాము, పురుషోత్తం, సునీల్, హనుమంతరావు, మధు, మసూద్, కేసరి రవీందర్, శంకర్, సాంబ, అనిల్, నవీన్, శ్రీకాంత్, దుర్గా ప్రసాద్, దస్రు, సత్యం, శ్రీను, సమి, కోటేశ్వరరావు, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు. ఈ మహా ధర్నాకు సీపీఐ కమిటీ నాయకులు బీజేపీ ప్రభాకర్ రెడ్డి, ప్రముఖ నాయకులు పూకంటి గోపాలరావు, ముత్తయ్య, నాగరాజు తదితరులు మద్దతు తెలిపారు.



అభివృద్దే అస్త్రం-సంక్షేమ పథకాలే సమాధానం

- ప్రతి గ్రామానికి నూతన సీసీ రోడ్లు

నవతెలంగాణ-టేకులపల్లి

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి అస్త్రమని, ప్రతి గ్రామానికి నూతన సీసీ రోడ్లు, సంక్షేమ పథకాలే సమాధానమని, ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు బానోత్ హరిప్రియ నాయక్ అభిప్రాయపడ్డారు. గురువారం మండలంలోని కోయగూడెం పంచాయతీలో ముత్యాలంపాడు క్రాస్ రోడ్ నుంచి సంపత్ నగర్‌కు వెళ్లే రహదారికి రెండు కోట్ల యాభై లక్షల ఎఫ్‌డీఆర్ నిధులతో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజలు మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ప్రభంజనాన్ని ఆపడం ఎవరి తరం కాదన్నారు. గత ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి సౌకర్యం లేక వర్షాకాలం వస్తే ఇబ్బందులు పడుతూ ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు, సంపత్ నగర్ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, జిల్లా రైతు బంధు సమన్వయ సభ్యులు పులిగండ్ల మాధవరావు, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ హరిసింగ్ నాయక్, ఎంపీపీ భూక్య. రాధా, పార్టీ మండల అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలు నాయక్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఎంపీటీసీ జాల సంధ్య, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలి

- రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు
- జిల్లాలో 134 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- కలెక్టర్ అనుదీప్
- మద్దతు ధర పోస్టులు ఆవిష్కరణ



నవతెలంగాణ-పాల్వంచ

రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. గురువారం యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పౌరసరఫరాల శాఖ పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో సహకార శాఖ డీఆర్‌డీఏ వ్యవసాయ జీసీసీ మార్కెటింగ్ తూనికల కొలతల రవాణా రైస్ మిల్లలతో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సన్నాహ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సహకార శాఖ ద్వారా 99 జీసీసీ ద్వారా 32 డీఆర్డిఏ ద్వారా మూడు మొత్తం 134 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన 25 మిల్లులకు చెరపరా చేయనున్నట్లు తెలిపారు. క్రాఫ్ బుకింగ్ చేసిన ప్రకారం వ్యవసాయ అధికారులు టోకెన్లు జారీ చేయాలని చెప్పారు. పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులకు వ్యవసాయ అధికారులు ధృవీకరణ పత్రం జారీ చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాలు రద్దీ నియంత్రణకు గ్రామ పద్దతి పాటించేందుకు తేదీల వారిగా కొనుగోలు చేసేందుకు టోకెన్లు జారీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నాణ్యత పై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో తార్పాలెంలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఇతర జిల్లాల నుండి మన జిల్లాకు ధాన్యం రాకుండా సరిహద్దుల్లో పోలీస్, రెవెన్యూ వ్యవసాయ అధికారులతో చెక్పోస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ద్వారా రైతులకు మద్దతు ధర లభిస్తుందని దళాలను ఆశ్రయించొద్దని పేర్కొన్నారు. క్వింట ఏ గ్రేడ్ రకానికి రూ.2060 మతకరకానికి రూ.2040 మద్దతులను ప్రభుత్వం ప్రకటించినట్లు చెప్పారు. అనంతరం వరి పంటకు మద్దతు నాణ్యత ప్రమాణాలు కనీస మద్దతు ధర పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ మల్లికార్జున్, డీఎం శ్రీ నాథ్ డీసీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డిఓ మధుసూదన్ రాజు, జీసీసీ టీఎం విజయకుమార్, మార్కెటింగ్ ఎడి ఆల్ ఇన్ వ్యవసాయ అధికారి అభిమన్యుడు, తునికెళ్ళకొలతల అధికారి మనోహర్, రవాణా శాఖ అధికారి రెడ్డి, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు జూగల్ కిషోర్, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయులపై అత్యంత అమానుషం...జలియన్వాలాబాగ్ ఘటన

- నివాళి అర్పించిన ప్రజా సంఘాల నేతలు

నవతెలంగాణ-కొత్తగూడెం



భారతీయులపై జరిగిన అత్యంత అమానుష సంఘటన జలియన్ వాలాబాగ్ ఘటన అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారయణలు అన్నారు. గురువారం చారిత్రక ప్రదేశాన్ని యాదృచ్ఛికంగా వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సరిగ్గా 104 సంవత్సరాల క్రితం 1919 ఏప్రియల్ 12న ఇదే రోజు జలియన్ వాలాబాగ్‌లో బ్రిటిష్ అధికారి అయిన డయ్యర్ నాటి స్వతంత్ర పోరాటంలో పెద్ద ఎత్తున పోరాడుతున్న భారతీయులపై అత్యంత అమానుషంగా క్రూరంగా కాల్పులు జరిపినటువంటి సందర్భంలో 379 మంది చనిపోవడం 1500 మంది పైగా గాయపడటం జరిగిందని తెలిపారు. అటువంటి చారిత్రక ప్రదేశాన్ని యాదృచ్ఛికంగా నేతలు సందర్శించి, ఘనమైన నివాళు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్నం జిల్లా నాయకులు కొండపల్లి శ్రీధర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండబోయిన వేంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల అర్జున్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, కర్ల వీరస్వామి, రమేష్ బాబు, శ్రీరామ్మూర్తి శ్రీనివాస్, ఇందిర, పద్మ, నాగమణి, కృష్ణవేణి, రమ, రాధ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ ప్రజాపోరు యాత్రలు

- చర్ల ఏజెన్సీలో ప్రారంభించనున్న ఎడిటర్ కె.శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం



జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వాల హామీల అమలు, దేశ సమగ్రత, సమైక్యతను కాపాడాలని డిమాండ్ చేస్తూ సిపిఐ భద్రాది కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం నుంచి తొలిదఫా ప్రజాపోరు యాత్రలు ప్రారంభం కానున్నాయి. భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలోని చర్ల ఎజెన్సీలో ఈ యాత్రలు ప్రారంభం కానున్నాయి. యాత్రలను సీనియర్ ఎడిటర్ కె.శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి మే 10వరకు జరగనున్న ప్రజాపోరు తొలిదఫా యాత్రలు జిల్లాలోని 25 మండల, పట్టణాలమీదుగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండల, పట్టణ కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లోని 28 సెంటర్లలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న భద్రాచలం నియోజకవర్గ పరిధిలో, 15, 16 తేదీల్లో పినపాక నియోజకవర్గ పరిధిలో, 17న పినపాక నియోజకవర్గ పరిధిలోని గ్రామాలతోపాటు నియోజకవర్గంలో, 18 ఇల్లందు నియోజకవర్గంతోపాటు లక్ష్మి దేవిపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో, 19న అశ్వారావుపేట పరిధిలోని గ్రామాలతో పాటు జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో పోరుయాత్రలు జరుగుతాయని తెలిపారు. తొలిదఫా చివరి రోజు 20వ తేదీన చుంచుపల్లి మండల పరిధిలోని గ్రామాలతోపాటు కొత్తగూడెం పట్టణ పరిధిలో పర్యటణ, రైల్వే స్టేషన్ సెంటర్‌లో ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు పాష తెలిపారు.

మణుగూరు సీపీఐ ప్రజాపోరు యాత్ర జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. ఆయోధ్య పిలుపునిచ్చారు. గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్.కే. సర్వర్, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేత

నవతెలంగాణ-ములకలపల్లి



పేదల ఆకలిని గుర్తించేదే పవిత్ర రంజాన్ పండుగ మాసమని, ఈ పండుగలో పేదలు భాగస్వామ్యం చేసి వారిని సంతోషంగా ఉంచడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మండల కేంద్రంలో టీఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు, మహ్మద్ ఖాజీమ్లీ సహకారంతో 100 పేద కుటుంబాలకు రంజాన్ తోఫాను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సభలో ఎస్ కె. సాబీర్ పాషా మాట్లాడారు. గడిచిన 9 ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికోసం ఎలాంటి పథకాలు ప్రవేశ పెట్టిన దాఖలాలు లేవన్నారు. టీఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు, మహ్మద్ ఖాజీమ్ అలీలు తమ సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, వెల్ఫేర్ సంస్థ అధ్యక్షులు ఎండీ.యూసఫ్, ఎంపీటీసీ జబ్బార్, ఎంపీటీసీ పుల్లారావు, ముస్లిం పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి మండల కేంద్రమైన టేకులపల్లి మసీద్ ఆవరణలో ప్రభుత్వం రంజాన్ పండగకు ముస్లింలకు బట్టలు పంపిణీ గురువారం తహసీల్దార్ అంజద్ పాషా ఆధ్వర్యంలో 125 కుటుంబాలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సర్పంచ్ బోడ సరిత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండి మౌలానా, మత పెద్ద, రెవెన్యూ సిబ్బంది, మస్జిద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి మండలంలోని ముస్లీం సోదర, సోదరీమణులకు స్థానిక ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రములోని రైతు వేదికలో 140 మంది ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫా (బట్టలు) పంపిణీ కార్యక్రమం స్థానిక తహసీల్దార్ మొహమ్మద్ సాదియా సుల్తానా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మందా మంగమ్మ, డీటీ అనుష, ఆర్.ఐలు సోయం రామయ్య, బుల్లిబాబు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ బాబా సహాయ కార్యదర్శి మొహమ్మద్ ఖయ్యూం, ఎండీ.ఆదం, మత పెద్దలు, రెవెన్యూ సిబ్బంది స్వామిదాసు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

- యూటీఎఫ్ 10వ ఆవిర్భావ దినోత్సవ సభలో జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-ఇల్లందు

ఉపాధ్యాయుల సమస్యల సాధనకు పోరాటాలే శరణ్యమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం యుటిఎఫ్ 10వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించినారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ఐక్య ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఇల్లందు, గుండాల, టేకులపల్లి మండల అధ్యక్షులు రాంబాబు, మంగతాయి, వీరన్న, నాయకులు శేషగిరిరావు, పి.రమేష్, ఎల్.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మణుగూరు : యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించినట్లు మండల జనరల్ సెక్రెటరీ వాయిస్ ఆఫ్ తెలంగాణ జిల్లా కన్వీనర్ కారం సీతారామయ్య తెలిపారు. గురువారం కరకగూడెం, పినపాక, మణుగూరు మండలాలు టీఎస్ యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కో-ఎడ్యుకేషన్ మణుగూరు పాఠశాలనందు నిర్వహించామన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.రాము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నిట్ట రాంబాబు, మణుగూరు ఉపాధ్యక్షులు ఎం.రాజ, కరకగూడెం బి.సురేష్, వి.కిరణ్, జనరల్ సెక్రటరీ బి.భాస్కర్, పినపాక మూడు మండలాలు సభ్యులు పాల్గొన్నారు.

పాల్వంచ : సంఘ నిర్మాణ కర్త కామ్రేడ్ చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాలు అనుగుణంగా ప్రతి కార్యకర్త నడుచుకోవాలని, విద్యాభివృద్ధికి కృషి చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పాల్వంచలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఇందులో సీనియర్ నాయకులు కామ్రేడ్ బండి జానకీ రాములు పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎస్.కె యాకూబ్ పాషా, ఉపాధ్యక్షులు బి.మంగిలాల్, ఏఎన్ఆర్ సీనియర్ నాయకులు ఏ.సత్యనారాయణ, వీటీఆర్ మోహన్ రావు, ఎస్.కె రహీముద్దీన్ సంతోష్, పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT KOTHAGUDEM
O.S. NO. 197/2018

Between :Smt. Guntuku Indira ....Plaintiff

AND

1. Smt. Shaik Mybhu (died) rep. by her Lrs. .....Defendants

To,
2 : Shaik Madar, S/o. Late Mybhu, 41 yrs, Flower Business,
3 : Shaik Pasha, S/o. Late Mybhu, 39 yrs, Flower Business
4: Shaik Khasim bee, W/o. Moulali, D/o. late Mybhu, 37 yrs,
5: Shaik Alina Bee, W/o. Late Raheem Pasha, 40 yrs, household,
6: Shaik Naharus Pasha, S/o. Late Raheem Pasha, 22 yrs, Flower Business

All are R/o. 31-1-144, Vengal Rao Colony, Paloncha Town, Bhadradri Kothagudem Dist. T.S .....(Respondents/Defendants 2 to 6)

WHEREAS the plaintiff filed the above suit against the defendant No.12 for recovery of money. Pending the suit, the defendant no.1 died leaving the defendants 2 to 6. Who are legal heirs to defendant No.1. Whereas the defendants 2 to 6 are hereby directed all of you to appears before this Hon'ble court on **28-4-2023 at 10.30 AM** for your appearance or through counsel, failing which the matter will be decided ex-parte.

//By order of the Court//
A. RAM PRASADA RAO,
Kothagudem Advocate,
Dt 13-04-2023 Kothagudem

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE AT KOTHAGUDEM
O.S.NO 89 OF 2017

BETWEEN:
Tella Chennaiah & another ....Plaintiffs

AND

Venna Srinu & others ....Defendants

NOTICE

To
1) Venna Kavya, D/o.Srinu, age 21 years, Occ: NIL. R/o.Srinivasa Nagar Colony, Paloncha town and mandal, Bhadradri Kothagudem District (defendant No.4).
2) Venna Divya, D/o.Srinu, age 19 years, Occ: Nil, R/o.Srinivasa Nagar Colony, Paloncha town and mandal, Bhadradri Kothagudem District (defendant No.5).

That the plaintiffs filed the above case against the defendants.Inspite of summons sent to the dependants No.4 and 5, you are evading to receive the summons on one or other pretext. Take note that the above original suit is posted on **24-04-2023.** If the defendants No.4 and 5 fails to appear before this Hon'ble Court either person or through their counsel on **24-04-2023 at 10.20 AM** the matter will be deemed to set exparte.

//By order of the above said Hon'ble court.//
VELLANKI VENAKTESWARA RAO
Kothagudem Advocate for Plaintiff
Dt 13-04-2023 Kothagudem

మానవి
www.navatelangana.com
ఖమ్మం
నవతెలంగాణ
శుక్రవారం 14 ఏప్రిల్ 2023





చీరకు మెరుగులు దిద్దుతూ...
చేనేతకు చేయూతనిస్తూ...

మన చేనేతకు చేయుతగా నిలిచి, పర్యావరణ ప్రేమికగా, మన దేశ వస్త్రాల ప్రాముఖ్యాన్ని, ప్రాభావాన్ని ప్రపంచానికి చాటుతున్న వ్యాపారవేత్త... నేటి మహిళ మేటి మహిళ అని నిరూపిస్తున్నారు **మృణాళిని శాస్త్రి**. సిక్స్ యార్డ్స్ ప్లస్ అనే సంస్థ ద్వారా చీరకు మెరుగులు దిద్ది నేటి ఆధునిక మహిళకు కూడా చీర సొబగులను నేర్పి వారు సులభంగా చీరను కట్టుకునే ట్రిక్‌ను చెబుతున్న వీరి అంతరం నేటి **మానవి**లో...

మృణాళిని తల్లిదండ్రులిద్దరూ ప్రైవేట్ డాక్టర్స్. మధ్యతరగతి కుటుంబం. తల్లికి సంగీత జ్ఞానం కూడా ఉండేది. మొదటి నుంచి పుస్తకాలు బాగా చదవడమన్నా, సినిమాలు చూడడమన్నా మృణాళినికి చాలా ఇష్టం. అలాంటి అందమైన కుటుంబ వ్యవస్థలో ఆమె పెరిగారు. టాప్ స్టూడెంట్‌గా ఉండి కూడా సైన్స్‌కి బదులుగా కామర్స్ ఎంచుకున్నారు. ఇది చాలా మందిని ఆశ్చర్యపరిచినప్పటికీ ఇదే తనలో ఉన్నటువంటి కళకు, సృజనాత్మకతకు పదును పెట్టిందంటున్నారు. అంతేకాదు తనను ఓ అడ్మినిస్ట్రేటివ్‌గా ఎదగడానికి దోహద పడిందని అన్నారు. "కష్టపడుతున్నానని అందరూ అంటున్నారు, కానీ ఈ కష్టపడే తత్వం నాకు నా తల్లిదండ్రుల నుండి వచ్చింది' అంటారు ఆమె.

సిక్స్ యార్డ్స్ ప్లస్ ఆవిర్భావం

ఏదో సాధించాలని తపన తనలో బాగా ఉండేది. బీకాం చేసి ఎంబీఏ పూర్తి చేశారు. ఫ్రెంచ్ భాషను కూడా నేర్చుకున్నారు. ఎంబీఏ పూర్తి చేశాక 16 ఏండ్లు కొన్ని ఎన్జీఓలలో పనిచేశారు. అక్కడ చేనేత కళాకారుల నేత పనితనాన్ని బాగా గమనించేవారు. చీరలపై వాళ్ళు చేస్తున్న వర్క్‌ని చూసి ఇంప్రెస్ అయ్యారు. అలా చీరనే తనకు ఆధారమయింది. ఆ చీరనే తన కెరీర్‌గా మలచుకున్నారు. అందులోంచే ఆవిర్భవించిందే సిక్స్ యార్డ్స్ ప్లస్. నేడు హైదరబాద్, శ్రీనగర్ కాలనీలో వైభవోపేతంగా కొలువుదీరి ఉంది.

కళాకారులకు గుర్తింపు కోసం...

చేనేత రంగానికి, చేనేత కార్మికులకు, కళాకారులకు గుర్తింపు రావాలి. తమకంటూ ఒక విలువ లభించాలి వాళ్ళ పనితనానికి, నైపుణ్యానికి సమాజంలో ఒక మహోన్నతమైన స్థానం లభించాలి. అలా జరగాలంటే ముందు చీర వైభవాన్ని తిరిగి తీసుకురావాలి. ఆధునిక మహిళ చీర కట్టును ఆస్వాదించగలగాలి. చీర కట్టుకోవడంలో మెళకువలు తెలుసుకోవాలి. ఆ దిశగా చేనేత కార్మికులకు తోడుగా సాగుతుంది సిక్స్ యార్డ్స్ ప్లస్. చేనేత కళాకారుల పనితనం కేవలం వారి కళ మాత్రమే కాదు. అది వాళ్ళ జీవన భృతి.

సిక్స్ యార్డ్స్ ప్లస్ ఏం చేస్తుంది..?

కేవలం 11 వేల రూపాయలతో, కొన్ని జాకెట్ ముక్కలతో మృణాళిని పూర్తి ఆత్మవిశ్వాసంతో ఈ వ్యాపారాన్ని ప్రారంభించారు. భర్త సూర్య, పిల్లలు, తల్లిదండ్రుల అందరి ప్రోద్బలంతో నిర్దిష్టమైన సమయాన్ని పెట్టుకొని అంచలంచలుగా కష్టపడుతూ ఈరోజు 12 రాష్ట్రాలలో చేనేత కళాకారులతో పని చేస్తున్నారు. అన్ని రాష్ట్రాలలో 65శాతం మహిళలు, 80శాతం రూరల్ ప్రాంత చేనేత కళాకారులు ఇందులో పనిచేయడం తనకు చాలా గర్వకారణంగా ఉందని ఆమె అంటున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి గొల్లభామ, గోవా నుంచి కుంది, బీహార్ నుంచి బావన్ బూటీ శారీస్, హంబుల్ వీవింగ్ పద్ధతిలో తక్కువ ధరలోనే హాయిగా కట్టుకునే విధంగా చీరలు రూపొందిస్తున్నారు.

చేనేత మన వారసత్వ సంపద

శ్రీనగర్ ఆఫీసులో కేవలం ఐదుగురు మాత్రమే ఉండి పని చేస్తారు. తనతో పాటుగా మరో నలుగురు ఆపరేషన్ సిస్టం, అడ్మిన్ ప్రొడక్షన్ అండ్ సేల్ వారు ఉంటారు. మిగిలిన వారంతా లూమ్స్ మీద పని చేస్తుంటారు. వారికి అవసరమైన లూమ్స్, డిజైన్స్ అందజేస్తుంటారు. ఇలా మగ్గాల పైన 300 మంది కళాకారులు చేనేత వస్త్రాలను సిక్స్ యార్డ్స్ ప్లస్ కోసం నేస్తున్నారని ఆమె చెప్పారు.

చేనేతకు చేయూతగా...

చేనేత కార్మికులకు పని కల్పించడం, సాంకేతిక విజ్ఞానాన్ని అందించి దాని ద్వారా చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడం, టెక్నాలజీని చేనేతను కలపడం వల్ల మార్కెటింగ్ చేయడం చాలా సులభవుతోంది. చేనేత వస్త్రాలు ప్రజల వరకు సులభంగా అందుబాటులోకి రాగలుగుతాయి. వారి పనితనానికి తగినంత మూల్యం ఇవ్వడంలో ప్రజలకు అవగాహన ఏర్పడుతుంది. కళాకారుల నైపుణ్యానికి సరైన గుర్తింపు, వాళ్ళ జీవితానికి సరిపడినంత సంపద ఏర్పడడానికి అవకాశం కల్పిస్తోంది సిక్స్ యార్డ్స్ ప్లస్.

ఇన్‌స్టెంట్ చీరలు

"ఆధునిక అమ్మాయిలో కొందరికి చీర కట్టుకోవడం నిజంగా ఒక సవాలే. మార్కెట్లో సైజులవారిగా కుట్టినటువంటి చీరలు కొంతవరకు దొరుకుతాయి. కానీ నాకు ఇలాంటి అప్రోచ్ నచ్చదు. చీరలకు సైజులతో సంబంధం లేదు. కుట్టిన చీరలు సైజుతో సంబంధం లేకుండా ఎవరైనా కేవలం అర నిమిషంలో కట్టుకునేలా అందరికోసం రూపొందించాం. రాప్, హుక్, ఫ్లిప్ ఇంతే కేవలం మూడే మూడు స్టెప్స్ అంతే..! మూడే మూడు చిటికల్లో చీర కట్టుకునే విధంగా ఇన్‌స్టెంట్ చీరను రూపొందించాను. పర్యావరణానికి హితాన్నిచ్చే కుట్టిన ఇన్‌స్టెంట్ సిక్స్ యార్డ్స్ ప్లస్ చీరలో ఒదిగిన సెలెబ్రిటీలు కూడా ఉన్నారు" అంటున్నారు మృణాళిని.

అవార్డులు గుర్తింపు

మృణాళిని తాను చేస్తున్న ఈ సృజనాత్మక వ్యాపారానికి ఎన్నో అవార్డులు అందుకున్నారు. అందులో ఇనార్బిట్ పింక్ పవర్ అవార్డ్ - 2019, షీ ద పీపుల్ టీవీ డిజిటల్ మార్కెటింగ్ అవార్డ్ - 2021, కోవిడ్ వారియర్ అవార్డ్ - 2020, స్త్రీ శక్తి అవార్డ్ - 2022 ఉన్నాయి.

వి హబ్ సహకారంతో

"వి హబ్ మా ఆశయానికి తోడుగా నిలిచింది. చేనేతకు చేయూత అయిన మా సిక్స్ యార్డ్స్ ప్లస్ ఆశయం నెరవేరడానికి మార్కె టింగ్ చేయడంలో మాకు పూర్తి సహకారాన్ని అందించారు" అంటున్నారు ఆమె. "ముదితల్ నేర్వగరాదే ముద్దార నేర్పించినన్" అంటారు. మహిళలు నేర్చే స్థాయికి ఎదిగారు. వాణిజ్య వేత్తలుగా ఎదిగి వ్యాపారరంగంలో తమదైన ముద్రను వేస్తున్నారు. తనకెంతో ఇష్టమైన చీరకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఇవ్వడానికి, చేనేత, కలంకారి కళాకారులకు సమాజం గుర్తించేలా తమ వంతు కృషిని అందిస్తూ మున్ముందుకు సాగుతున్నారు మృణాళిని.

అవసరాలకు అనుగుణంగా

"ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికి ఒక ట్రక్కు లోడు బట్టలను భూమిలో పాతి పెడుతున్నారు. ఎంత వ్యర్థం ఇది? అనవసరంగా ఇంత సరుకును వ్యర్థ పరుస్తున్నారు. దీని మీద అవగాహన రావాలి. వినియోగదారులకు ఎంత అవసరమో అంతే తయారు చేయాలి అనే ఆలోచన ఉండాలి. తయారు చేసేవారు, వినియోగదారులు ఇద్దరూ కూడా అవగాహన కలిగి ఉండాలి. ఎంత అవసరమో అంతవరకే చేయాలంటే డిమాండ్ ఎంతుందో అంతే సప్లై చేయాలి. అనవసరంగా గుట్టలు గుట్టలుగా వస్త్రాలను తయారు చేసి భూమిలో పాతి పెట్టడం వల్ల ఎంత ధనం, ఎంత మూలధనం నాశనం అవుతుంది. ఇది విన్నప్పుడు నేను చాలా బాధపడ్డాను. ఉత్పత్తి చేసేవారు, కొనేవారు ఇద్దరూ సంతోషంగా ఉండాలి. అంటే చేనేత వస్త్రాలకు ఆదరణ లభించాలి. బట్టలు ఎలా కొనాలి? చీరలు ఎలా వాడాలి? పాత వాటిని కూడా కొత్తవాటిగా ఎలా మలుచుకోవాలి అనే అవగాహన వినియోదారులకు కచ్చితంగా ఉండాలి" అంటారు ఆమె.

- రమాదేవి కులకర్ణి, 8985613123

విశ్వమానవుడు అంబేద్కర్

(మొదటిపేజీ తరువాయి)

ఖాయమనీ, జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలనే తాత్వికతకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితమే నిదర్శనమని పేర్కొన్నారు. వర్ణం, కులం పేరుతో వివక్షను, అంటరానితనం అనే సామాజిక దురాచారాన్ని చిన్నతనం నుంచే ఎదుర్కొన్నా.. ఏనాడూ వెనకడుగు వేయని ధీరోదాత్తుడు అని కొనియాడారు. సమస్త శాస్త్రాలను ఔపోసన పట్టిన అంబేద్కర్.. ప్రజాస్వామ్యం, వర్ణ నిర్మూలన, అంటరానితనం, మతమార్పిడులు, స్త్రీల హక్కులు, మతం, ఆర్థిక సంస్కరణలు, చరిత్ర, ఆర్థికవ్యవస్థ తో పాటు అనేక అంశాలపై చేసిన రచనలు, ప్రసంగాలు, విమర్శలు యావత్ ప్రపంచాన్ని ఆలోచింపచేశాయని వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగానికి రూపమిచ్చిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. నేడు దేశంలో అణగారిన వర్గాలు అనుభవిస్తున్న ఫలాలు అంబేద్కర్ తన మేధస్సుతో మదించి సమకూర్చినవేనని తెలిపారు. ప్రపంచంలోనే మరెక్కడా లేని విధంగా హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ మహా విగ్రహాన్ని ఆయన జయంతి రోజున ప్రతిష్టించడం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మూలమైన రాజ్యాంగంలో ఆర్టికల్ 3ను పొందుపరిచిన తెలంగాణ బాంధవుడు అని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాల కొనసాగింపులో భాగంగా దేశంలోనే మరెక్కడా లేని విధంగా రాష్ట్ర నూతన సచివాలయానికి 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం' అనే పేరు పెట్టి ఆయన్ను స్మరించుకుంటున్నామని తెలిపారు. అన్ని పథకాలతో పాటు సామాజిక వివక్షకు గురవుతున్న ఎస్సీ సామాజిక తరగతుల అభ్యున్నతికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దళితుల కోసం గురుకుల పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య, షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రత్యేక ప్రగతి నిధి, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ ద్వారా 20 లక్షల రూపాయల ఆర్థిక సాయం, ఎస్సీలకు నైపుణ్య శిక్షణ, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు, దళితులను ఎంటర్ ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో టీఎస్‌ప్రైడ్, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, ఎస్సీలకు 101 యూనిట్ల వరకు ఉచిత్ విద్యుత్ వంటి ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. దళితుల జీవితాల్లో గుణాత్మక మార్పే లక్ష్యంగా తీసుకొచ్చిన దళితబంధు పథకం దేశ చరిత్రలోనే విప్లవాత్మక పథకంగా మారిందని తెలిపారు. తెలంగాణలోని దళిత సమాజం భారతదేశానికే ఆదర్శంగా నిలవబోతున్నదని స్పష్టం చేశారు. అంబేద్కర్ ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్నదని తెలిపారు. తెలంగాణ స్ఫూర్తితో దేశంలో దళిత సకల జనుల సంక్షేమానికి తమ కృషి కొనసాగుతూనే ఉంటుందని సీఎం పునరుద్ఘాటించారు.

బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకూడదు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గరిష్టంగా బీజేపీ వ్యతిరేక ఓట్లు పోల్ అవ్వాలనీ, రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుకు అంగీకరించాలని సీపీఐ(ఎం) కోరుకుంటుందని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులను బట్టి సీట్ల కేటాయింపు జరగాలనీ, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న చోట కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలు అవసరమైన రాజీలు చేసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాల ఐక్య ఉద్యమాన్ని వేగవంతం చేసేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురువారం నాడిక్కడ సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు ఇతర నేతలను కలిశారు. సమావేశానంతరం సీతారాం ఏచూరి విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షాల ఐక్యత కోసం ప్రయత్నాలు ఊపందుకున్నాయనీ, లౌకిక ప్రత్యామ్నాయం కోసం చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రాజకీయ పరిస్థితులు ఉన్నాయని, ఆయా రాష్ట్రాల పరిస్థితులకనుగుణంగా సీపీఐ(ఎం) రాజకీయ పొత్తుపై నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బీజేపీ గరిష్టంగా మత విభజనను సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజల జీవన సమస్యల పరిష్కారానికి బీజేపీ ప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రణాళిక లేదని, బతుకుదెరువు కష్టాల నుంచి దృష్టి మరల్చి విభజనను సద్వినియోగం చేసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. అయితే దీనికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకతాటిపై నిలబడాలని, ఇలాంటి కార్యక్రమాలకు సీపీఐ(ఎం) ముందుంటుందని తెలిపారు.ప్రతిపక్షాల ఓట్లను ఏకీకృతం చేయడం వల్ల కేవలం 37 శాతం ఓట్లు వచ్చిన పార్టీ (బీజేపీ) అధికారంలోకి వచ్చే పరిస్థితి రాదని అన్నారు. ప్రతిపక్షాల ఐక్యత ఇప్పుడు గణనీయంగా ఊపందుకున్నదనీ, వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య పార్టీల ఐక్యతతోనే బీజేపీని ఓడించవచ్చని పేర్కొన్నారు. 1996, 1998, 2004 మాదిరిగానే ఎన్నికల తరువాతే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే కూటమి ఏర్పడుతుందని స్పష్టం చేశారు. త్వరలో ప్రతిపక్ష పార్టీల సమావేశం నిర్వహించి వ్యూహాలు రచించనున్నట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని పరిరక్షించేందుకు, ప్రజల జీవనోపాధిని కాపాడుకునేందు బీజేపీని ఓడించాలని పిలుపు నిచ్చారు. కేరళలో కాంగ్రెస్, తమ పార్టీ ప్రత్యర్థులనీ, బీజేపీ అక్కడ ప్రధాన పోటీలో లేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

అనంతరం సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో కూడా నితీశ్ సమావేశమయ్యారు. ప్రతిపక్షాల మధ్య రాజకీయంగా ఏకాభిప్రాయం కుదిరిన తరువాతే మిగతా విషయాలపై నిర్ణయం తీసుకుంటామని కూడా రాజా స్పష్టం చేశారు.. "ఆర్ఎస్ఎస్-బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష ఐక్యతపై చర్చించాం. దేశం గందరగోళంలో ఉంది. సమాజంలోని అన్ని వర్గాలు బీజేపీ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నాయి. లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతగా ప్రజాస్వామ్యాన్ని, ప్రజలను రక్షించడం తప్పనిసరి" అని అన్నారు. నితీశ్ కుమార్ ఐక్య ప్రయత్నాలకు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా పూర్తి మద్దతునిస్తుందని హామీ ఇచ్చింది. కేంద్ర ఏజెన్సీల వేటలో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జైలు పాలైన తరువాత కేజ్రీవాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అంతకుముందు, ప్రతిపక్షాల ఐక్య ప్రయత్నాలకు దూరంగా ఉండటమే ఆప్ విధానంగా ఉండేది. ఒడిశాలో బీజేపీ విధ్వంసక ప్రయోగాలను ప్రారంభించినందున బీజేడీ కూడా ప్రతిపక్ష కూటమిలో చేరవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో ఉన్న నితీశ్ కుమార్ శుక్రవారం ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్‌తో భేటీ కానున్నారు.

మత విభజనకు బీజేపీ పదును

- ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో కాషాయ పార్టీ చర్యలు
- బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కావాలి
- వచ్చే ఏడాది ఎన్నికల తర్వాత కూటమికి ఒక రూపం : సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : దేశంలో 2024 సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బీజేపీ మత విభజన రాజకీయాలకు పదును పెడుతున్నదని సీపీఐ(ఎం) జనరల్ సెక్రెటరీ సీతారాం ఏచూరి ఆరోపించారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రామ నవమి వేడుకల్లో భాగంగా పలు వర్గాల ప్రజల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయని ఆయన చెప్పారు. " 2024 (లోక్‌సభ ఎన్నికలు) సమీపిస్తున్నందున, ఎన్నికలు, రాజకీయ సమీకరణ కోసం మత విభజనకు పదును పెట్టడం బీజేపీకి ప్రధానంశంగా మారింది" అని ఒక పత్రికా సమావేశంలో ఏచూరి అన్నారు. ప్రస్తుతం ఘర్షణలు చోటు చేసుకున్న అనేక ప్రాంతాల్లో గతంలో రామనవమి వేడుకల సందర్భంలో ఎన్నడూ అల్లర్లు జరగలేదని తెలిపారు. బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

వచ్చే ఏడాది సాధారణ ఎన్నికల తర్వాత వాస్తవ బీజేపీ వ్యతిరేక కూటమికి ఒక రూపం ఏర్పడుతుందన్నారు. ఈ కూటమి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే స్థానంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక రాజకీయ కూటమి ఉంటుందనీ, అయితే బీజేపీ వ్యతిరేక శక్తుల సమూహాన్ని పెంచుకోవాలన్నదే ఆలోచన అని ఏచూరి చెప్పారు. 1996, 2004లో రెండు సందర్భాల్లో కూటములు ఎన్నికల తర్వాతే ఏర్పడ్డాయని తెలిపారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో పోటీ పడినప్పటికీ.. 2004లో కేంద్రంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి సీపీఐ(ఎం) మద్దతిచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అన్ని లౌకిక, ప్రజాస్వామిక ప్రతిపక్షపార్టీలతో చర్చలు కొనసాగించాలని సీపీఐ(ఎం) నిర్ణయించిందని ఏచూరి తెలిపారు. " రాబోయే 2024 ఎన్నికల్లో ప్రతి రాష్ట్రంలో దేశభక్తి, లౌకిక ప్రతిపక్ష శక్తులను పెంచడానికి ఈ ప్రయత్నం ఉంటుంది. తద్వారా ప్రతిపక్షంలో విభజనను బీజేపీ అనుకూలంగా మార్చుకోలేదు" అని ఆయన అన్నారు.

బీజేపీ వ్యతిరేక శక్తిగా పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ విశ్వసనీయత ఎప్పుడూ ప్రశ్నార్థకంగానే ఉన్నదని తెలిపారు. రాజకీయాలు అంటే కేవలం నంబర్ల గురించి కాదనీ, స్థిరమైన మిత్రుడు ఎవరన్న కోణంలో దానిని చూడాలన్నారు. లెఫ్ట్, కాంగ్రెస్, ఇతర లౌకిక శక్తులను ఒంటరి చేయడమే తృణమూల్, బీజేపీల ఉద్దేశమైతే, భవిష్యత్తులో వారిద్దరు కలిసి ఏమి చేస్తారన్నదే ఇక్కడ అసలు విషయమని తెలిపారు. ఇటీవల భారత ముస్లింలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఆమె వాదన పూర్తిగా ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.

దేశంలో మోడీ పాలనలో గత ఎనిమిదేండ్లకు పైగా వాస్తవ వేతానాలు స్తబ్దుగా ఉన్నాయని చెప్పారు. ద్రవ్యోల్బణం పెరుగుదలతో ఒకవేళ వాస్తవ వేతనాలు స్తబ్దుగా ఉంటే ప్రజల వినియోగం తగ్గిందనీ, దానర్థం పేదరిక స్థాయిలు పెరుగుతున్నాయని ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేండ్లలో మెరుస్తున్న భారత్, బాధపడుతున్న భారత్ అనే రెండు భారత్‌లు ఏర్పడ్డాయనీ, ధనవంతులు ధనవంతులుగా.. పేదలు పేదలుగానే ఉంటున్నారని ఆయన తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), గవర్నర్ వ్యవస్థ వంటివి దుర్వినియోగం అవుతున్నాయని ఏచూరి ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ నాశనమవుతున్నదని తెలిపారు.

నింగినంటిన స్మరణం
భారతరత్నావిష్కరణం

(మొదటిపేజీ తరువాయి)

విగ్రహ విశేషాలు..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం (ఏప్రిల్ 14న) ఆవిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ట్యాంక్‌బండ్ సమీపంలోని ఎన్టీఆర్ గార్డెన్ పక్కనున్న 11 ఎకరాల విస్తీర్ణంలో ఆయన విగ్రహాన్ని భారీఎత్తున ఏర్పాటు చేయాలని ప్రభుత్వం 2016లో నిర్ణయించింది. దాని రూపకల్పన బాధ్యతను కేపీసీ ప్రయివేటు లిమిటెడ్ నిర్మాణ సంస్థకు అప్పగించింది. ప్రధాన శిల్పిగా పద్మభూషణ్ రామ్ వన్‌జీ సుతార్ వ్యవహరించారు. ఆయన కుమారుడు అనిల్ సుతార్ కూడా ఆ ప్రక్రియలో పాలుపంచుకున్నారు. విగ్రహం తయారీకి 353 టన్నుల ఉక్కు, 112 టన్నుల కాంస్యాన్ని ఉపయోగించారు. ఎండలకు,వానలకు సైతం చెక్కుచెదరకుండా ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉండే విధంగా విగ్రహాన్ని అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో నిర్మించారు. విగ్రహం కింది భాగం (బేస్‌మెంట్) ఢిల్లీలోని ప్రస్తుత పార్లమెంటును పోలి ఉంటుంది. విగ్రహం ఎత్తు 125 అడుగులు కాగా, బేస్‌మెంట్ ఎత్తు 50 అడుగులు. విగ్రహం బరువు 465 టన్నులు. వెడల్పు 45 అడుగులు. ప్రాంగణ విస్తీర్ణం విశాలమైన 11 ఎకరాలతో ఉంది. విగ్రహం చుట్టుపక్కల 2.93 ఎకరాల విస్తీర్ణం పచ్చటి మొక్కలతో, గడ్డి మైదానంతో ఆహ్లాదకరంగా ఉండబోతున్నది. విగ్రహం నిర్మాణం ఖర్చు రూ.145 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వమే ఈ వ్యయాన్ని భరించింది. విగ్రహం సమీపంలో 27,556 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల విశాల భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన మ్యూజియం, గ్రంథాలయం, ఆయన రచనలు ఉంటాయి. సభలు సమావేశాలు నిర్వహించుకోవటానికి ఒక కాన్ఫరెన్స్ హాల్‌ను కూడా ఏర్పాటు చేశారు.

స్మృతివనంలో..

మరో వైపు అంబేద్కర్ విగ్రహంతోపాటు స్మృతివనాన్ని సైతం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విగ్రహం చుట్టూ రాక్ గార్డెన్, ల్యాండ్ స్కేప్ ఏరియా, ప్లాంటేషన్, మెయిన్ ద్వారం, ర్యాంప్, వాటర్ ఫౌంటెయిన్, శాండ్ స్టోన్ ఆర్ట్ వర్క్స్, జీఆర్సీ, ఫాల్స్ సీలింగ్, లిఫ్ట్, పార్లమెంట్ బిల్డింగ్ ఆకృతిలో బేస్ మెంట్, మెయిన్ బిల్డింగ్ లోపల ఆడియో, విజువల్ కాన్ఫరెన్స్ హాల్, మ్యూజియం, లైబ్రరీతోపాటు విగ్రహం వద్దకు చేరుకునేందుకు మెట్లదారి వంటివి ఉన్నాయి. అంబేద్కర్ జీవితానికి సంబంధించిన అన్ని విశేషాలను ఇక్కడ తెలుసుకోవచ్చు.

ఏడాది అనుకుంటే.. ఏడేళ్ల పట్టింది!

2016లో అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా హైదారాబాద్ నగరంలో 125 అడుగులతో కూడిన ఈ ప్రతిష్టాత్మక నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అదే ఏడాది ఏప్రిల్ 14 (అంబేద్కర్ జయంతి)న ఎన్టీఆర్ గార్డెన్ సమీపంలో శంకుస్థాపన చేశారు. 2017 ఏప్రిల్ 14లోపు విగ్రహ నిర్మాణం పూర్తి కావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఏడాదిలోపే పని పూర్తి చేయాలనుకున్నప్పటికీ వివిధ కారణాలతో ఆలస్యమవుతూ వచ్చింది. విగ్రహ నిర్మాణం, స్మృతివనం పూర్తి స్థాయిలో ఏర్పాటయ్యేందుకు ఏకంగా ఏడేళ్ల సమయం పట్టింది. చివరకు అన్ని పనులు పూర్తి చేసుకుని శుక్రవారం ఆవిష్కరణ జరుపుకోనున్నది.

సంక్షోభంలో సమాజం..



- ఇప్పటికే మనుస్మృతి విధానాలు యూపీలో అమలు : నవతెలంగాణ ఇంటర్వ్యూలో ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

ములాఖాత్

'కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విధానాల ఫలితంగా సమాజం సంక్షోభంలో కూరుకుపోయింది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే అంబేద్కర్ యాదికొస్తడు.. అందుకే ఇప్పుడు ఏ నోట విన్నా అంబేద్కరే.. నేడు ఆయన ఆశయాలకు పాలకులు నుంచే ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి, ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలన్న నినాదాల ప్రాముఖ్యత పెరుగుతున్నది..' అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి వివరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి ఎస్ వెంకన్నకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

అంబేద్కర్ ఆశించిన సమాజం ఏంటి? ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ ఆచరణ అందుకు అనుగుణంగా ఉందా?

సమాజం సంక్షోభంలో ఉన్నప్పుడు.. ముందే ప్రమాదాన్ని పసిగట్టి, పరిష్కారం చూపించిన వారిని సహజంగానే ప్రజలు గుర్తుపెట్టుకుంటారు. అదే ఇప్పుడు అంబేద్కర్ విషయంలో జరుగుతున్నది. ఆయన అసమానతలు లేని సమాజం కోసం పరితపించిండు. అణగారిన తరగతుల అభ్యున్నతిని కోరుకున్నడు. ముఖ్యంగా అంటరాని తనం, వివక్షతకు వ్యతిరేకంగా జీవితాంతం పనిచేసిన దార్శనికుడు అంబేద్కర్.. అందుకే ఎప్పుడూ లేని విధంగా జేఎన్‌యూ విద్యార్థులు మొదలు..బాధిత మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థుల వరకు సకల రంగాలు, సంఘాలు ఆయన్ను గుర్తుచేసుకుంటున్నాయి. అయితే ఆయన ఆశించిన విధంగా, నిర్దేశించిన దశ, దిశలో ప్రభుత్వాలు పాలించటం లేదు. రాజ్యాన్ని రక్షించాల్సిన ప్రభుత్వాలు..పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తున్నవి. సంస్థలను, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నవి. "ఒక వర్గాన్ని ఇంకొక వర్గం పైకి ఉసిగొల్పే ధోరణి చాలా ప్రమాదకరం" అంటూ అంబేద్కర్ హెచ్చరించినట్టుగా ప్రస్తుతం దుర్భర పరిస్థితులు దేశంలో నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామిక హక్కుల కోసం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సంఘటితం కావటమొక్కటే మార్గం.

ఇతర దేశాల రాజ్యాంగాల్లోంచి అక్కడ కొన్ని, ఇక్కడ కొన్ని అంశాలు పట్టుకొచ్చిన అతుకుల బొంత రాజ్యాంగమంటూ బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. దీన్ని ఎలా చూడాలి?

భారత రాజ్యాంగం పట్ల బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ 'బంచ్ఆఫ్ థాట్స్'లోనే రకరకాల ఆలోచనలు చేసింది. వీహెచ్‌పీ నిర్వహించిన ధర్మసంసద్ భారత రాజ్యాంగం హిందువులకు వ్యతిరేకంగా ఉన్నదనీ, దాని స్థానంలో హిందూ రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలని తీర్మానించింది. మనుస్మృతిలో గొప్ప సమతా ధర్మమున్నదనీ, భారత రాజ్యాంగం కన్నా అదెంతో ఉన్నతమైందని ప్రకటించింది. ఈ రకంగా మొదటి నుంచీ రాజ్యాంగం పట్ల బీజేపీ వ్యతిరేక వైఖరితోనే ఉంది. వాజ్‌పాయ్ కాలంలో రాజ్యాంగ సమీక్షకు జస్టిస్ వెంకటాచలమయ్య నేతృత్వంలో ఒక కమిటీ వేశారు. రాజ్యాంగాన్ని మార్చటానికి ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా ఉందని గుర్తించాకే ఆ ప్రయత్నాన్ని వాయిదా వేసుకున్నారు. కానీ ఎప్పటికైనా రాజ్యాంగాన్ని మార్చటం వాళ్ల లక్ష్యం.తమ మతోన్మాదంలోకి దళితులను కూడా లాగటానికి అంబేద్కర్ మాటలను సందర్భ శుద్ధి లేకుండా ఉటంకిస్తూ సంఘ్ పరివార్ శక్తులు ఆయన్ని కూడా వాడుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి.

ప్రస్తుతం మనుస్మృతి బాటలో బీజేపీ నడుస్తున్నదన్న విమర్శ ఉన్నది ఇది సహేతుకమైన విమర్శేనా?

నిజమే..రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులు ఒకటొకటిగా రాలిపోతున్నాయి. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం నలిగిపోతున్నది. పౌరులు ఏ దుస్తులు వేసుకోవాలి, ఏ భాష మాట్లాడాలి, ఏమేం చదవాలి, ఏమేం చదవకూడదు, ఏం తినాలి, ఏం తినకూడదు అనేది కూడా మనువాదులు నిర్ణయించే పాడుకాలం వచ్చింది. మనుస్మృతి విధానాలు ఇప్పటికే ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో అమల్లో ఉన్నాయి. లైంగిక దాడులు చేసినా, హత్యలు చేసినా, కులం పేరుతో వెలివేసినా అడగటానికి వీలు లేదు. ఇది మన ఖర్మ అని సరిపెట్టుకోవాలంటున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం తదితర అంశాలకు వారి రాజ్యాంగంలో చోటుండదు. ప్రజాస్వామ్యం, లౌకిక విలువలకు తావుండదు. వీటిని ధ్వంసం చేయటమే ప్రస్తుతం బీజేపీ కర్తవ్యంగా ఉంది. ఈ నేపథ్యంలో అంబేద్కర్ ఆలోచనలను, రాజ్యాగ విలువలను రక్షించుకునేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ఉంది.


విద్యాలయాల అప్పులు విద్యార్థులకు తిప్పలు

(మొదటిపేజీ తరువాయి)


ర్యాలీలతో క్యాంపస్‌ను హోరెత్తించారు. ఫీజుల పెంపుపై యాజమాన్యం తీరు గురించి సోషల్ మీడియాలో తీవ్ర ప్రచారం చేశారు. పెంచిన ఫీజులను విద్యాసంస్థ వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అయితే, విద్యార్థుల నిరసనలకు స్పందించామని చెప్పుకోవడానికి యాజమాన్యం ఆగస్టు మొదటి వారంలో కేవలం మెస్ ఫీజులను తగ్గించింది. అయితే, ఈ మెస్ ఫీజుల తగ్గింపుతో తమకు ఒరిగేది ఏమీ ఉండదనీ, పెంచిన సెమిస్టర్, ఇతర ఫీజులను తగ్గించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సంస్థ యాజమాన్యం ఫీజులను పెంచే నిర్ణయం ఏమాత్రమూ సరికాదని, ఇది తమ లాంటి విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, హెచ్ఈఎఫ్ఏ ఏర్పాటే సరికాదని కొందరు విద్యావేత్తలు, నిపుణులు వాదించారు. దీని ఏర్పాటుతో కేంద్రం విద్యాసంస్థల కార్యకలాపాల్లోకి చొరబడేయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ఇందుకు ఐఐటీ బాంబేనే ఒక ఉదాహరణ అంటూ వారు తెలిపారు. దేశంలోని పలు ప్రతిష్టాత్మక ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ విద్యాసంస్థలకు వచ్చేవారిలో అధికంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఆర్థికంగా వెనబడిన వర్గాల విద్యార్థులే ఉంటారనీ, యూనివర్సిటీల రుణాల భారం వారిపైనే పడుతున్నదని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రలోని మోడీ సర్కారు ఇలాంటి నిర్ణయాలను వెనక్కి తీసుకొని, విద్యార్థులపై భారం పడకుండా చూడాలని వారు కోరుతున్నారు.



























































మంచి కథతో నాతో నేను

సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలి రాజపుత్, ఐశ్వర్య రాజీవ్ కనకాల కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'నాతో నేను'. శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యులు, రచయిత విజయేంద్రప్రసాద్ ఇటీవల ఫిల్మ్ ఛాంబర్‌లో విడుదల చేశారు. "టైటిల్ బావుంది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీలా అనిపిస్తుంది. కొత్త నిర్మాతలు చేస్తున్న ఈ ప్రయత్నం చక్కని విజయం సాధించాలి' ఆయన చెప్పారు.

సాయికుమార్ మాట్లాడుతూ, "మంచి కథతో శాంతికుమార్ ఈ చిత్రం చేస్తున్నారు. ఇందులో నేను భాగం కావడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'ఓ మంచి కథ రాసి మొదట నిర్మాతల్ని వెతుక్కున్నాను. నా కథ నచ్చి వెంటనే అంగీకరించారు. నా తొలి ప్రయత్నానికి సాయికుమార్ అండగా ఉన్నారు. చక్కని సలహాలు, సూచనలు అందిస్తున్నారు. రాసిన కథని, చక్కగా తెరపై చూపిస్తానని, ఆ దిశగా కృషి చేస్తున్నాను' అని దర్శకుడు శాంతికుమార్ అన్నారు. నిర్మాత మాట్లాడుతూ, 'దర్శకుడు చెప్పిన కథనచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. బిజీగా ఉండి కూడా మా ఆహ్వానం మేరకు విచ్చేసిన విజయేంద్రప్రసాద్‌కి కృతజ్ఞతలు. ప్రేక్షకులకు మంచి సినిమా చూపించబోతున్నాం' అని తెలిపారు.సమీర్, సి.వి.ఎల్ నరసింహారావు, గౌతమ్ రాజు ఎమ్మెస్ చౌదరి, భద్రం, సుమన్ శెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: యూహ్, మురళి మోహన్ రెడ్డి, సంగీతం: సత్య కశ్యప్, బ్యాక్‌గ్రౌండ్ : ఎస్ చిన్న, ఎడిటింగ్: నందమూరి హరి, ఆర్ట్: పెద్దిరాజు అడ్డాల, పాటలు: రామజోగయ్య శాస్త్రి, శాంతికుమార్, కొరియోగ్రాఫర్: భాను, చంద్ర కిరణ్, ఫైట్స్: నందు, సమర్పణ: ఎల్లలు బాబు టంగుటూరి.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

జాడలేని వన్‌ధన్ స్కీం

అటకెక్కిన అటవీ ఉత్పత్తుల కొనుగోలు

- చేతులెత్తేసిన కేంద్ర ప్రభుత్వం
- కష్టపడి సేకరించినా.. కొనేవారేరి?
- దళారుల చేతిలో మోసపోతున్న గిరిజనులు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

అటవీ ఉత్పత్తులు సేకరించి పొట్ట పోసుకునే జీవితాలు నేడు దుర్భరంగా మారాయి. అటవీ ఉత్పత్తులను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకుండా చేతులెత్తేయడంతో అటవీ ఉత్పత్తుల సేకరణ తప్ప మరో పని తెలీని గిరిజనులు, కూలీలు కుటుంబపోషణ భారంగా మారింది. దాంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు సగానికి సగం ధర చెల్లిస్తూ నిలువునా దోచుకుంటున్నారు. దాంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జన్ ధన్ యోజన పథకం నీరుగారిపోయింది.

పొట్ట కోసం 'లక్క' తిప్పలు..

అటవీ ఉత్పత్తుల సేకరణ, సేకరించిన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు తీసుకొచ్చిన వన్ ధన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. మూడేండ్ల నుంచి పథకాన్ని అమలు చేయకుండా నిలుపుదల చేసింది. ఉత్పత్తులను సేకరించేవారు లేక కొనుగోలు చేయక పోవడంతో గిరిజనులు దళారులను ఆశ్రయిస్తున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నుంచి బోధన్ వెళ్లే రహదారి పక్కనున్న పెద్ద పెద్ద చెట్ల నుంచి గిరిజనులు లక్కను సేకరిస్తుంటారు. బాన్సువాడ, నసురుల్లాబాద్ మండల అటవీ ప్రాంతంలో ఎండిపోయిన చెట్ల నుంచి కొన్నేండ్లుగా రైతుకూలీలు లక్కను సేకరిస్తున్నారు. లక్క ఉత్పత్తులను సేకరించడం అంత సులువైందేమీ కాదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. అంత కష్టపడి లక్కను సేకరించినా దక్కేది మాత్రం అంతంతే. ఇతర రాష్ట్రాల్లో లక్క కేజీ రూ.800 నుంచి రూ.1000 ఉండగా మన రాష్ట్రంలో దళారులు కేజీ లక్కకు రూ. 200 నుంచి రూ.300 మాత్రమే చెలిస్తున్నారు. లక్కను ప్రభుత్వం కొనుగోలు చేస్తే రూ.800 వస్తాయని కూలీలు చెబుతున్నారు. మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి లక్కను కొనుగోలు చేస్తుంటారు.

లక్కతో ఉపయోగాలు

మనం వాడే మాత్రలు ఎక్స్‌పెయిరీ డేట్‌లోగా పాడవకుండా, ఫంగస్ ఏర్పడ కుండా కాపాడటంలో లక్క పూత కీలకం. నాణ్యమైన లక్కను మాత్రలపై పూతగా వేస్తారు. కొన్ని దేశాల్లో ఆహారపదార్థాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి తింటారు. అవి పాడవకుండా లక్క రంగు కలిపి పూత వేస్తారు. గోళ్ల రంగు, బూటు పాలిష్‌లోనూ వాడతారు. సిల్క్ వస్త్రాల తయారీలోనూ లక్క వినియోగిస్తారు. రెడీమేడ్ బంగారు ఆభరణాలు, బాడీ స్ప్రేల్లోనూ వినియోగిస్తున్నారు.

వ్యవసాయం లేక లక్క సేకరణ

వివిధ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కూలీలకు వ్యవసాయం పనులు లేకపోవడంతో వారూ లక్కను సేకరిస్తున్నారు. అటవీ ప్రాంతంలో లభించే ఆటవీ సంపదతతో రైతు కూలీలకు ఉపాధి లభిస్తుంది. గతంలో అటవీ సంపదపై వారికి అవగాహన కల్పిస్తూ, వారు సేకరించిన అటవీ సంపదను ప్రభుత్వమే ఐకేపీ ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించేది. దాంతో గిరిజన, గ్రామీణ ప్రాంతాల వాసులు గానుగ, వేప, ఇప్ప గింజలు, ఇప్ప పువ్వు, రబ్బరును సేకరించి ఉపాధి పొందారు. కాగా, మూడేండ్లుగా రైతుకూలీలు సేకరించిన అటవీ ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయడం నిలిపేసింది. దాంతో దళారులను ఆశ్రయించి వారు చెప్పిన ధరకు అమ్ముకుంటున్నామని కూలీలు ఆవేదన చెందుతున్నారు.

కష్టపడి లక్క సేకరిస్తున్నం



మేము కొన్నేండ్లుగా లక్క సేకరిస్తున్నం. సేకరించిన లక్కకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం. గతంలో బాన్సువాడలో కొనుగోలు కేంద్రాలు ఉండేవి. ఇప్పుడు అవి లేకపోవడంతో దళారులే కొంటున్నారు. కిలోకు రూ.150 మాత్రమే ఇస్తున్నారు. వారు శుద్ధి చేసి తులాల చొప్పున విక్రయించి లాభం పొందుతున్నారు. ప్రభుత్వమే లక్కను కొనుగోలు చేస్తే మాకు ఉపాధి లభిస్తుంది.

- కడవాత్ అశోక్, మొగులన్‌పల్లి, బాన్సువాడ.

ఔషధ మొక్కలపై చిన్నచూపా..?

గ్రామీణ ప్రాంతాల్లో పెరటి తోటలో, ఇంటి ఆవరణంలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు పెంచినా కొనే వారు ఎక్కడ అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఔషధ మొక్కల కొనుగోలు చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక మార్కెట్లు ఉన్నాయి. జిల్లాలో మాత్రం ఔషధ మొక్కలు కొనే వారే కరువయ్యారు. ఇంటి వద్ద కలబంద, వేపగింజలు, నేల ఉసిరి, తెల్ల ఆముదం, కానుగ, గన్నేరు, గోరింట, తంగేడు, తురక వేప, సరస్వతి ఆకు, తదితర ఔషధ గుణలు ఉన్న మొక్కలు పెంచినా కొందరికి వాటి విలువ తెలియక కత్తిరించి పారేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో అధికంగా అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ కానుగ, వేప, ఉసిరి, చింత, నేరేడు, లక్క, మారేడు, కరక్కాయ, తానికాయ తదితర అటవీ ఉత్పత్తులు లభిస్తాయి.

పరిహారమివ్వాలని ఎంపీడీఓ కార్యాలయానికి తాళం

- లప్పనాయక్ తండావాసుల ధర్నా



నవతెలంగాణ -యాదగిరిగుట్ట రూరల్

తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లప్పనాయక్ తండా వాసులు గురువారం యాదగిరిగుట్ట మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగా ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. సమావేశం ప్రారంభమైనప్పుడు తండా సర్పంచ్ బుజ్జి శంకర్‌నాయక్ పోడియం ముందు కూర్చొని నిరసన తెలిపింది. అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ బయటికి వచ్చిన తర్వాత గ్రామస్తులు కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పరిహారం, పునరావాసానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. 28 రోజులుగా బస్వాపూర్ రిజర్వాయర్ కట్టపై ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో 250 యూనిట్లను గుర్తించారని, అర్హులైన 50 యూనిట్లను చేర్చి మొత్తం 300 యూనిట్లకు ప్యాకేజీ, 205 ఎకరాల భూమికి నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాతరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 294 సర్వే నెంబర్‌లో లేఅవుట్ చేసి, మౌలిక సదుపాయలు కల్పించి ఇండ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని కోరారు. గ్రామకంఠం భూమి 8ఎకరాల 08 గుంటల్లో ప్లాట్ల కేటాయింపు, ఇండ్లకు పరిహారం ఒకే దఫాలో అందించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు బస్వాపూర్ రిజర్వాయర్ కట్టపై ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ శోభన్ బాబు మాట్లాడుతూ.. అన్ని విషయాలపై ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు నిరసన విరమించారు. ఈ సమావేశంలో లపనాయక్ తండావాసులకు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. నిరసన, మండల సమావేశాల్లో ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ తోటకూర అనురాధ, ఎంపీడీవో ప్రభాకర్ రెడ్డి, వైటీడీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పురుషోత్తంరావు ఎంపీటీసీలు సర్పంచులు, లప్పనాయక్‌తండా ఉపసర్పంచ్ మంక్యా నాయక్, మోహన్, దసిరం నాయక్, బాధితులు పాల్గొన్నారు.

'భగీరథ' సిబ్బందికి జీతాలు వచ్చాయి..

- 'నవతెలంగాణ' కథనానికి స్పందన



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'మిషన్ భగీరథ' శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ల్యాబ్ సిబ్బందికి జీతాలు వచ్చాయి. అయితే, ఏడాదిగా జీతాలు రాక అవస్థలు పడ్డారు. ఎన్నిమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న సుమారు 400 మంది ఏడాది పొడవునా వేతనాలు రాక అప్పులపాలయ్యారు. వారి బాధలు వివరిస్తూ 'భగీరథ'లో బతుకు భారం అనే శీర్షికతో 'నవతెలంగాణ' పత్రిక మెయిన్ పేజీలో ఈనెల 7న కథనాన్ని ప్రచురించింది. దాంతో స్పందించిన ప్రభుత్వం మిషన్ భగీరథలోని ల్యాబ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, తమ బాధలు పత్రికలో ప్రచురించిన 'నవ తెలంగాణ' యాజమాన్యానికి భగీరథ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా వాక్ ఫర్ సోషల్ జస్టిస్

- మనువాదానికి గోరీకడదాం..
- ఆర్థిక దోపిడీ.. సామాజిక అణచివేతపై జమిలి పోరాటం
- సీఐటీయూ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ పాదయాత్రలు



నవతెలంగాణ- విలేకరులు

దేశంలో సామాజిక న్యాయాన్ని కాపాడాలని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం వాక్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాలు జరిగాయి. నిజామాబాద్, వికారాబాద్, భూపాలపల్లి జిల్లా మినహా మిగతా అన్ని జిల్లాల్లో పాదయాత్రలు నిర్వహించినట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు.

మనువాదానికి గోరీకట్టేందుకు కార్మిక, కర్షకులు సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలో 10కె, వాక్ ఫర్ సోషల్ జస్టిస్ పాదయాత్ర నిర్వహించారు. కంది మండల కేంద్రం నుంచి సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వరకు మండుటెండల్ని సైతం లెక్క చేయకుండా కార్మికులు కదం తొక్కారు. కంది కేంద్రంలో చుక్క రాములు డాక్టర్ బీఆర్ అంబేదర్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించి నడిచారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి కాలం చెల్లిన మూడు వేల సంవత్సరాల నాటి మనువాదాన్ని రాజ్యాంగంగా గుర్తించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కుట్రలు చేస్తున్నామన్నారు. మతోన్మాదాన్ని అడ్డుకోకపోతే లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో సామాజిక న్యాయ పాదయాత్రలు నిర్వహించారు.

ఖమ్మం నగరంలో ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి పాత కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా నుంచి జలగం నగర్ వరకు పాదయాత్ర సాగింది.

కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కరీంనగర్‌లో కళాభారతి నుంచి కలెక్టరేట్ వరకు, సిరిసిల్ల జిల్లాలో ధార్మిక క్షేత్రమైన వేములవాడ నుంచి కార్మిక క్షేత్రం సిరిసిల్ల కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు.

10కె వాక్ ఫర్ సోషల్ జస్టిస్ నినాదంతో హనుమకొండ జిల్లా గోపాల్ పూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కలెక్టరేట్ వరకు వందలాది మందితో సాగింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లాలో రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు సామాజిక న్యాయ పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవో మన్సూర్‌కు అందజేశారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపూర్‌లో పాదయాత్ర నిర్వహించారు.



ఎన్నికలు ఒక్కటే ప్రజాస్వామ్యం కాదు

- పద్మశ్రీ, రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత ఆచార్య శాంతా సిన్హా

నవతెలంగాణ-కేయూ క్యాంపస్

ఎన్నికలు ఒక్కటే ప్రజాస్వామ్యం కాదని, నిరంతర జాతి నిర్మాణానికి కృషి జరగాలని పద్మశ్రీ, రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత ఆచార్య శాంతాసిన్హా అన్నారు. గురువారం కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన ఆచార్య బి.జనార్ధన్‌రావు మెమోరియల్ ఫౌండేషన్ 21వ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు దూరవిద్యా కూడలిలో ఉన్న జనార్ధన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గొప్ప మేధావి ఆచార్య జనార్ధన్‌రావు అని కొనియాడారు. ప్రభుత్వ పథకాల్లో అట్టడుగు వర్గాలకు న్యాయం చేకూరేందుకు పాటుపడ్డారని చెప్పారు. ప్రభుత్వ విధానాల్లో మార్పులు చట్ట సభల ద్వారా రాలేదని, ఉద్యమాల వల్ల వచ్చాయని అన్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే ఎన్నికల విధానం అత్యంత ఆందోళనకరం అన్నారు. యువత ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా అడుగులు వేయాలని కోరారు. విద్యార్థుల నుంచి నాయకులుగా రావాలన్నారు. ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. ప్రజలు, ఆదివాసీల సమస్యలు తెలిసిన వ్యక్తి జనార్ధన్‌రావు అని కొనియాడారు. అనంతరం ఆచార్య శాంతా సిన్హాను ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఆచార్యులు ఆచార్య కె.మురళి మనోహర్, ఫౌండేషన్ సెక్రటరీ ఆచార్య ఇ.రేవతి, ఆచార్య నరేంద్ర బాబు, టి.బుచ్చిబాబు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ ముందడుగుతోనే కేంద్రం వెనక్కి

- బయ్యారానికి మొండిచేయి
- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం
- వికారాబాద్‌కు కృష్ణా జలాలు తీసుకొస్తాం..: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- వికారాబాద్‌లో మెడికల్ కాలేజీ, ఆయుష్ ఆస్పత్రికి శంకుస్థాపన



నవతెలంగాణ వికారాబాద్ ప్రతినిధి, మర్పల్లి

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ విషయంలో సీఎం కేసీఆర్ ముందడుగు వేయడంతోనే కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర మంత్రి ప్రకటన చేశారన్నారు. ఇది కార్మికుల, ప్రజల విజయంగా అభివర్ణించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను బలోపేతం చేసే వరకూ పోరాడుతామన్నారు. గురువారం వికారాబాద్ జిల్లాలో మంత్రి పర్యటించారు. వికారాబాద్ పట్టణంలోని అనంతగిరిలో రూ.7.50 కోట్లతో 50 పడకల ఆయుష్ ఆస్పత్రి, రూ.3.6 కోట్లతో కేంద్రీయ ఔషధ గిడ్డంగి నిర్మాణానికి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో 280 అదనపు పడకల విస్తీర్ణపు నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. వికారాబాద్‌కు కృష్ణా జలాలను రప్పించి ప్రజల రుణం తీర్చుకుంటామని చెప్పారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమకు మొండిచేయి చూపిందన్నారు. అన్ని విషయాల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీని మంజూరు చేయలేదన్నారు. వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపులో వివక్ష చూపిస్తోందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. చివరకు సబ్సిడీ బియ్యంలోనూ కోత విధించినట్టు వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయం, వైద్యం, విద్యుత్, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ సంక్షేమాల పట్ల ప్రజల్లో చర్చ పెట్టాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎండగడుతూ ఆ పార్టీల నాయకులు గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. అంతకుముందు మంత్రులు అనంతగిరి గుట్టలోని అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మర్పల్లి మండల కేంద్రంలో వికారాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం
ప్రత్యక్ష కార్యాచరణ

- నాలుగు దశలుగా రాష్ట్రవ్యాప్త ఆందోళన
- మే 15న హైదరాబాద్‌లో మహాధర్నా
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర విస్తృత సమావేశం తీర్మానం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటించింది. వచ్చే రెండు నెలల పాటు ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ప్రభుత్వం స్థలాలు ఇచ్చేవరకు ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానించింది. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా జిల్లాల అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండ్ల స్థలాలపై సుదీర్ఘంగా చర్చించిన సమావేశం, పలు నిర్ణయాలు తీసుకుంది. ఏప్రిల్ 17, 18 తేదీల్లో నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో జర్నలిస్టుల సంతకాలు సేకరణకు పిలుపునిచ్చింది. ఏప్రిల్ 25, 26 తేదీల్లో ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటూ స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించాలని తీర్మానించింది. మే 2, 3 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో దీక్షలు చేయాలని కోరింది. అలాగే మే 15న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించాలని సమాశం నిర్ణయించింది.

ఫెడరేషన్ సీనియర్ ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ ఇండ్లస్థలాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. గత 35 ఏండ్లుగా ఇండ్లస్థలాల కోసం జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించకపోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. విస్తృతస్థాయి సమావేశం నిర్ణయాలను కచ్చితంగా అమలు చేయాలని ఫెడరేషన్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పి.ఆనందం, ఎల్గోయి ప్రభాకర్, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, పి.రాధిక, వి.జగన్, బి.విజయానంద్, బి.రాజశేఖర్, కార్యదర్శులు ఎర్రం నర్సింగరావు, ఎస్‌కె సలీమ, ఇ. చంద్రశేఖర్, గండ్ర నవీన్, బి.దామోదర్, బి. జగదీశ్వర్, కొప్పు నిరంజన్, పి.బిక్షపతి, కె.అనిల్‌రెడ్డి, తన్నీరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పండి

- కరీంనగర్ సీఐకి హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ -హైదరాబాద్

కోర్టుధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని కరీంనగర్ సీఐ(కరీంగనర్-2) లక్ష్మీబాబుకి హైకోర్టు నోటీసులిచ్చింది. ఈ నెల 21న జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ కేసు విచారణ జరిగిన అన్ని వాయిదాలకు గైర్హాజరు అవ్వడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. 2022, ఆగస్టు 10న ఉదయం 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు తనను చట్టవిరుద్ధంగా కరీంనగర్ సీఐ స్టేషన్‌లో ఉంచారనీ, చేయి చేసుకున్నారనీ, అసభ్యకరంగా మాట్లాడారంటూ నూగూరి వంశీకృష్ణ వేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ వినోద్‌కుమార్ విచారించారు. తాను చెప్పిన ఆ విషయాలన్నీ పీఎస్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయిందని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. అలాగే ఎలాంటి వారెంట్ ఇవ్వకుండా పోలీసులు పిటిషనర్ ఇంటిపై దాడి చేసి ఆస్తుల పత్రాలు తీసుకున్నారని తెలిపారు. పంచనామా, సీజ్ ప్రక్రియను పాటించలేదన్నారు. డాక్యుమెంట్లను కాల్చేస్తానని బెదిరించారన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఆయా తేదీలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీని సమర్పించాలని గతంలో ఆదేశించింది. అయినా సీఐ సమర్పించక పోవడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. కరీంనగర్-2 పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీలను నవంబర్‌లో ఏర్పాటు చేశా రని జీపీ వాదించారు. అయితే 2018లో సీసీ టీవీలు ఉన్న స్టేషన్‌గా కరీంనగర్-2ను పేర్కొం టూ మోడల్ స్టేషన్ ప్రకటించారన్న విష యాన్ని పిటిషనర్ తరుపు లాయర్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. వాదనల తర్వాత హైకోర్టు, సీఐని వ్యక్తి గతంగా హాజరుకావాలని ఆదేశించింది. సీసీ కెమె రాల తీరుతెన్నులపై నివేదిక ఇవ్వాలని ఆదేశం చింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

మార్గదర్శి కేసులో మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రధాన కార్యాలయ ఉద్యోగులపై ఏపీ సీఐడీ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవద్దనీ, ఆ ఉద్యోగులు పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శి కార్పొరేట్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రామకృష్ణారావు ఇతర జీఎంలు, డీజీఎంలు వేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారించారు. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీ, ఇతర ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది, విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

జస్టిస్ వెంకటేశ్వర్‌రెడ్డికి వీడ్కోలు

రిటైర్ అయిన జస్టిస్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డికి హైకోర్టు వీడ్కోలు చెప్పింది. చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అధ్యక్షతన గురువారం ఫుల్ కోర్టు సమావేశమైంది. అనంతరం జడ్జీల చాంబర్‌లో వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులకు సీజే దంపతులు జ్ఞాపికను అందజేశారు. హైకోర్టు బార్ అసోసియేషన్ కూడా జస్టిస్ వెంకటేశ్వర్‌రెడ్డిని సత్కరించింది.

సత్వర దర్యాప్తు చేయండి

ఏపీకి చెందిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తును వేగవంతం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ గురువారం ఆదేశించారు. వివేకా హత్య కేసులో దస్తగిరి అప్రూవర్‌గా మారిన నేపథ్యంలో ఆతను చెప్పిన వాటిని పట్టుకుని సీబీఐ విచారణ చేయడం అన్యాయమని, ఆయనకు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలంటూ వైఎస్ భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించారు. అనంతరం కేసు విచారణను 17 వ తేదీకి వాయిదా వేశారు.

ఐమాక్స్, నెక్లెస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ..

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరం నడిబొడ్డున నిర్మించిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ నేపథ్యంలో శుక్రవారం పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హుస్సేన్ సాగర్ తీరంలో 125 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించనున్నారు. నగరవాసులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు, అభిమానులు, అధికారులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఐమాక్స్, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్, హుస్సేన్ సాగర్, మింట్ కంపౌండ్ మార్గాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ సీపీ సుధీర్ బాబు గురువారం తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

- వీవీ విగ్రహం(ఖైరతాబాద్), ఓల్డ్ సైఫాబాద్ పోలీసు స్టేషన్ జంక్షన్, రవీంద్ర భారతీ జంక్షన్, మింట్ కంపౌండ్ రోడ్డు, నెక్లెస్ రోడ్, నల్లగుట్ట జంక్షన్, కట్ట మైసమ్మ టెంపుల్(లోయర్ ట్యాంక్ బండ్), ట్యాంక్ బండ్, లిబర్టీ జంక్షన్ వైపు వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి.



- అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే ఆర్టీసీ బస్సులను ట్యాంక్‌బండ్ వైపునకు అనుమతించరు. ఈ మార్గంలో వచ్చే ఆర్టీసీ బస్సులను రవీంద్ర భారతి, తెలుగుతల్లి ఫ్లై ఓవర్, కట్ట మైసమ్మ టెంపుల్, లోయర్ ట్యాంక్ బండ్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ మార్గాల్లో అనుమతించనున్నారు.

రైడర్స్‌తో రైజర్స్ ఢీ

- కోల్‌కత, హైదరాబాద్ పోరు నేడు
- ఆరెంజ్ ఆర్మీకి మరో కఠిన సవాల్



రసెల్‌ను ఆపగలరా..! : సన్‌రైజర్స్ కోచ్ లారాతో ఆండ్రీ రసెల్

నవతెలంగాణ-కోల్‌కత

రెండు మ్యాచులు.. రెండు 200 ప్లస్ స్కోర్లు. ఓ మ్యాచ్‌లో ఆ స్కోరు కాపాడుకుంటే.. మరో మ్యాచ్‌లో ఛేదించారు. సీజన్ తొలి మ్యాచ్ వైఫల్యం అనంతరం కోల్‌కత నైట్‌రైడర్స్ శిబిరంలో నైరాశ్యం ఆవహించగా.. నెగ్గిన రెండు మ్యాచుల్లోనూ అనూహ్య ప్రదర్శనలు నమోదయ్యాయి. శార్దుల్ ఠాకూర్ మెరుపులే అద్భుతం అనుకుంటే.. రింకూ సింగ్ అద్భుతానికి మించిన ప్రదర్శన చేశాడు. అతడి సంచలన ముగింపు క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించింది. మరోవైపు, తొలి రెండు మ్యాచుల్లో పేలవ ప్రదర్శనతో పరాజయాలు చవిచూసిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. మూడో మ్యాచ్‌లో మెరిసింది. బౌలర్లు అదరగొట్టడంతో తొలి విజయం ఖాతాలో వేసుకుంది. అటు కోల్‌కత, ఇటు హైదరాబాద్ విజయోత్సాహంలో కనిపిస్తున్నాయి. అసమాన ప్రదర్శనలతో కోల్‌కత జోరుమీదుంది. సఫారీ క్రికెటర్ల చేరితో సన్‌రైజర్స్ శిబిరం సైతం ఉత్సాహంగా కనిపిస్తుంది. దీంతో నేడు రైడర్స్, రైజర్స్ పోరులో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి.

ఆ ఇద్దరు కీలకం! : పంజాబ్ కింగ్స్‌తో స్వల్ప లక్ష్యాన్ని సన్‌రైజర్స్ ఛేదించింది. కానీ టాప్ ఆర్డర్ నుంచి ఆశించిన దూకుడు కనిపించలేదు. మూడు మ్యాచుల్లో మూడు ఓపెనింగ్ కాంబినేషను ప్రయోగించిన సన్‌రైజర్స్ నేడు ఏం చేస్తుందో ఆసక్తికరం. ఇంగ్లాండ్ యువ కెరటం హ్యారీ బ్రూక్, కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్‌లు హైదరాబాద్‌కు అత్యంత కీలకం. ధనాధన్ క్రికెట్ ఆడటంలో బ్రూక్ దిట్ట. కానీ భారత పిచ్‌లపై అతడు లయ అందుకోలేకపోతున్నాడు. బ్రూక్ ఫామ్‌లోకి వస్తే సన్‌రైజర్స్ బ్యాటింగ్ కష్టాలు తీరినట్టే. కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్ పంజాబ్‌తో మ్యాచ్‌లో ఆకట్టుకున్నాడు. రాహుల్ త్రిపాఠికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో చూడచక్కని బౌండరీలతో అలరించాడు. మయాంక్ అగర్వాల్, వాషింగ్టన్ సుందర్, భువనేశ్వర్ కుమార్‌లు అంచనాలను అందుకోవటం లేదు. స్పిన్నర్ మయాంక్ మార్కండె పంజాబ్‌పై నాలుగు వికెట్లు పడగొట్టాడు. నేడు నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌లోనూ మార్కండె మాయజాలంపై ఆరెంజ్ ఆర్మీ భారీ ఆశలు పెట్టుకుంది. మార్కో జాన్సెన్, నటరాజన్ కొత్త బంతితో కీలకం కానున్నారు. హెన్రిచ్ క్లాసెన్‌ను తుది జట్టులోకి తీసుకోవటంతో బ్యాటింగ్ లైనప్ మరింత బలోపేతం కానుంది.

ఎదురుందా? : రెండు వరుస సంచలన విజయాల ఊపులో ఉన్న కోల్‌కత నైట్‌రైడర్స్‌ను నిలువరించటం హైదరాబాద్ సన్‌రైజర్స్‌కు కఠిన సవాల్. కీలక ఆటగాళ్లు తేలిపోతున్నా.. జట్టులోని ఇతర ఆటగాళ్లు అసాధారణ ప్రదర్శనలతో రెచ్చిపోవటంతో నైట్‌రైడర్స్‌కు ఎదురులేకుండా పోయింది!. ఆ ప్రదర్శనల స్ఫూర్తి ఇతర ఆటగాళ్లలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. సొంతగడ్డపై ఆడుతున్న అదనపు అనుకూలత కోల్‌కతకు ఉంది. వెంకటేశ్ అయ్యర్, రెహ్మనుల్లా గుర్బాజ్, నితీశ్ రానా ఫామ్‌లో ఉన్నారు. ఆండ్రీ రసెల్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. శార్దుల్ ఠాకూర్, రింకూ సింగ్‌లు ప్రత్యర్థుల ప్రణాళికల్లో ఇక నుంచి కీలకం కానున్నారు. సునీల్ నరైన్, ఫెర్గుసన్, వరుణ్ చక్రవర్తికి తోడు మిస్టరీ స్పిన్నర్ సుయాశ్ శర్మ బౌలింగ్ విభాగాన్ని నడిపించనున్నారు.




ఐపీఎల్‌లో నేడు
హైదరాబాద్ X కోల్‌కత
వేదిక : కోల్‌కత, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రసారం

ఇక మొదలెడదామా.. !: ప్రాక్టీస్‌లో మార్క్‌రామ్, బ్రూక్ చిట్‌చాట్

అంపైర్ల నిర్ణయాలు గందరగోళం

- బంతి మార్పుపై అశ్విన్ విమర్శలు
- 25 శాతం జరిమానా విధించిన రిఫరీ



చెన్నై : రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌లో అంపైర్ల నిర్ణయాలపై రాయల్స్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించారు. చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్ మధ్యలో మంచు కారణంగా బంతి తడిగా ఉందనే కారణంతో అంపైర్లు మరో బంతిని తీసుకున్నారు. దీనిపై అశ్విన్ తీవ్ర అభ్యంతరం తెలిపాడు. ఫీల్డింగ్ జట్టు ఫిర్యాదు చేయకుండా అంపైర్లు బంతి మార్చటం గందరగోళంలో పడేసిందని విమర్శించాడు. ' అంపైర్లు తమంతట తామే బంతిని మార్చటం ఆశ్చర్యానికి గురి చేసింది. ఇది గతంలో ఎన్నడూ జరుగలేదు. ఆ నిర్ణయం నన్ను గందరగోళంలో పడేసింది. అది మంచికైనా, చెడుకైనా కొంచెంత సమతుల్యత అవసరం. బౌలింగ్ జట్టు నుంచి బంతిపై ఏ ఫిర్యాదు లేదు. అంపైర్లు తమకు తాముగా బంతిని మార్చారు. బంతిని ఎందుకు మార్చారని అడుగగా.. వేము (అంపైర్లు) మార్చవచ్చని బదులిచ్చారు. అయితే, ప్రతి మ్యాచ్‌లో మంచు కురిసిన ప్రతిసారి బంతిని మార్చాలి. ఐపీఎల్‌లో ప్రతి మ్యాచ్‌కు ఇది వర్తించాలి. అంపైర్లు ఏదైనా చేయవచ్చు కానీ అది ప్రామాణికంగా ఉండాలని' అశ్విన్ అన్నాడు. కాగా, ఐపీఎల్, ఐసీసీ నిబంధనల ప్రకారం అంపైర్లకు బంతిని మార్పు చేసే అధికారం ఉంటుంది.

ఇక మ్యాచ్‌లో జరిగిన సంఘటనలపై అధికారులను, ఆటగాళ్లను, ఇతరులపై బహిరంగ విమర్శలు చేసినందుకు రవిచంద్రన్ అశ్విన్‌కు మ్యాచ్ రిఫరీ జరిమానా విధించాడు. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు. రిఫరీ జరిమానాను అశ్విన్ అంగీకరించాడు. దీంతో ఈ విషయంలో ఎటువంటి అప్పీల్‌కు అవకాశం ఉండదు.

మోకాలి గాయంతోనే..!

- ఐపీఎల్‌లో ఆడుతున్న ఎం.ఎస్ ధోని
- సూపర్‌కింగ్స్ కోచ్ ఫ్లెమింగ్ వెల్లడి




చెన్నై : వికెట్ల మధ్య పరుగులో ఎం.ఎస్ ధోని అత్యుత్తమం. డెత్ ఓవర్లలో ఆ వేగం అందుకోవటం నాన్‌స్ట్రయికర్‌కు కష్టంతో కూడుకున్న పని. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో ధోని పరుగుపై వ్యాఖ్యాత మాథ్యూ హెడెన్ సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. రెండు సిక్సర్లతో మ్యాచ్‌ను చివరి బంతి వరకు తీసుకొచ్చిన ధోని.. మూడో బంతికి సింగిల్‌తో జడేజాకు స్ట్రయిక్ ఇచ్చాడు. నిజానికి ధోని ఇక్కడ రెండు పరుగులు తీసుకునేవాడు. కానీ, ఆ పని చేయలేదు. అందుకు గల కారణాన్ని సూపర్‌కింగ్స్ కోచ్ స్టిఫెన్ ఫ్లెమింగ్ మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వెల్లడించాడు. ' ధోని మోకాలి నొప్పితో బాధపడుతున్నాడు. ఆ సంగతి అతడి కదలికల్లో గమనించవచ్చు. మోకాలి నొప్పితో అతడు పరుగు తీసేందుకు ఇబ్బంది పడుతున్నాడు. అయినా, రాయల్స్‌తో మ్యాచ్‌లో ధోని గొప్ప ప్రదర్శన చేశాడు. అతడి ఫిట్‌నెస్ స్థాయి ఎల్లప్పుడూ ప్రొఫెషనల్' అని ఫ్లెమింగ్ కితాబిచ్చాడు.

బెన్ స్టోక్స్, దీపక్ చాహర్, శిసింద మంగళ.. ఇలా వరుసగా ఆటగాళ్లు గాయాలతో బెంచ్‌కు పరిమితం కావటం చెన్నై సూపర్‌కింగ్స్ యాజమాన్యానికి ఆందోళన కలిగిస్తోంది. గాయాలతో ఒకట్రెండు వారాలు ఆటకు దూరం కానున్న ఆటగాళ్లు తుది జట్టుకు ఎంపిక దూరమవుతున్నారు. ఈ సమయంలో ఉత్తమ జట్టును ఎంపిక చేయటం సూపర్‌కింగ్స్‌కు కత్తి మీద సాముగా మారింది.

చెమటోడ్చిన పంజాబ్

- రాణించిన టైటాన్స్ బౌలర్లు
- పంజాబ్ కింగ్స్ 153/8

నవతెలంగాణ-మొహాలి



పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు తడబడ్డారు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో చతికిల పడిన ధావన్‌సేన.. తాజాగా సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ బౌలర్లను ఎదుర్కొవటంలో ఇబ్బంది పడింది. టైటాన్స్ బౌలర్లు సమిష్టిగా మెరవటంతో పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 153 పరుగులే చేసింది. మాథ్యూ షార్ట్ (36, 24 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కగా.. భానుక రాజపక్స (20, 26 బంతుల్లో 1 ఫోర్), జితేశ్ శర్మ (25, 23 బంతుల్లో 5 ఫోర్లు) మిడిల్ ఓవర్లలో పంజాబ్ నెమ్మదించేందుకు కారణమయ్యారు!. షారుక్ ఖాన్ (22, 9 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్) చివర్లో మెరుపు సిక్సర్లతో పంజాబ్ కింగ్స్‌కు 153 పరుగుల స్కోరు అందించాడు. మూడేండ్ల తర్వాత ఐపీఎల్‌లో ఆడుతున్న మోహిత్ శర్మ టైటాన్స్ తరఫున (2/18) గొప్పగా బౌలింగ్ చేశాడు.

టైటాన్స్ బౌలర్ల జోరు : టాస్ నెగ్గిన గుజరాత్ టైటాన్స్ ఛేదనకు మొగ్గుచూపింది. సొంతగడ్డపై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన పంజాబ్ కింగ్స్‌కు తొలి ఓవర్లోనే మహ్మద్ షమి షాక్ ఇచ్చాడు. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (0)ను డకౌట్ చేశాడు. కెప్టెన్ శిఖర్ ధావన్ (8)ను లిటిల్ వెనక్కి పంపటంతో పవర్‌ప్లేలో పంజాబ్ ఓపెనర్లను కోల్పోయింది. మాథ్యూ షార్ట్ (36) ఎదురుదాడితో పంజాబ్‌ను మళ్లీ రేసులోకి తెచ్చాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్ బాదిన మాథ్యూ.. రన్‌రేట్‌ను ముందుకు నడిపించాడు. కానీ షార్ట్ నిష్క్రమణతో పంజాబ్ కథ మొదటికొచ్చింది. నం.4 బ్యాటర్ భానుక రాజపక్స (20) పంజాబ్‌ను వెనక్కి నెట్టాడు. బౌండరీలు కొట్టలేకపోయిన రాజపక్స.. స్ట్రయిక్ సైతం రొటేట్ చేయలేదు. దీనికి తోడు మిడిల్ ఆర్డర్‌లో మోహిత్ శర్మ గొప్ప లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు సంధించాడు. జితేశ్ శర్మ (25), శామ్ కరణ్ (22) పోరాడినా.. దూకుడుగా పరుగులు సాధించలేకపోయారు. చివర్లో షారుక్ ఖాన్ మెరుపులతో పంజాబ్ గౌరవప్రద స్కోరు సాధించింది. రషీద్ ఖాన్ (1/26), జోశ్ లిటిల్ (1/31) రాణించారు.



స్కోరు వివరాలు :

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ : ప్రభుసిమ్రన్ (సి) రషీద్ (బి) షమి 0, శిఖర్ ధావన్ (సి) అల్జారీ (బి) లిటిల్ 8, మాథ్యూ షార్ట్ (బి) రషీద్ 36, రాజపక్స (సి) గిల్ (బి) అల్జారీ 20, జితేశ్ శర్మ (సి) సాహా (బి) మోహిత్ 25, శామ్ కరణ్ (సి) గిల్ (బి) మోహిత్ 22, షారుక్ ఖాన్ రనౌట్ 22, హర్‌ప్రీత్ బరార్ నాటౌట్ 8, రిషి ధావన్ రనౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 153.**

వికెట్ల పతనం : 1-0, 2-28, 3-55, 4-92, 5-115, 6-136, 7-152, 8-153.

బౌలింగ్ : మహ్మద్ షమి 4-0-44-1, లిటిల్ 4-0-31-1, అల్జారీ జోసెఫ్ 4-0-32-1, రషీద్ ఖాన్ 4-0-26-1, మోహిత్ శర్మ 4-0-18-2.

జాతీయ పోటీలకు ధన్వాడ రెజ్లర్లు



హైదరాబాద్ : ఇటీవల హైదరాబాద్‌లోని యాకత్‌పురాలో తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో ధన్వాడ గిరిజన బిడ్డలు సత్తా చాటారు. బాలికల 49 కిలోల విభాగంలో గీత, బాలికల 57 కిలోల విభాగంలో నాగలక్ష్మి బంగారు పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరిసి ఏప్రిల్ 16-18న ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో జరిగే జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన ధన్వాడ గిరిజన బిడ్డలను మాజీ మంత్రి డి.కె అరుణ అభినందించారు. జాతీయ పోటీలకు వెళ్లేందుకు గీత, నాగలక్ష్మీలకు ఈ సందర్భంగా అవసరమైన సహాయం అందజేశారు.

నవచిత్రం



రచయిత విజయేంద్రప్రసాద్‌తో 'నాతో నేను' చిత్ర బృందం

మంచి కథతో నాతో నేను

సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలి రాజపుత్, ఐశ్వర్య రాజీవ్ కనకాల కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'నాతో నేను'. శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యులు, రచయిత విజయేంద్రప్రసాద్ ఇటీవల ఫిల్మ్ ఛాంబర్‌లో విడుదల చేశారు. "టైటిల్ బావుంది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీలా అనిపిస్తుంది. కొత్త నిర్మాతలు చేస్తున్న ఈ ప్రయత్నం చక్కని విజయం సాధించాలి' ఆయన చెప్పారు.

సాయికుమార్ మాట్లాడుతూ, "మంచి కథతో శాంతికుమార్ ఈ చిత్రం చేస్తున్నారు. ఇందులో నేను భాగం కావడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'ఓ మంచి కథ రాసి మొదట నిర్మాతల్ని వెతుక్కున్నాను. నా కథ నచ్చి వెంటనే అంగీకరించారు. నా తొలి ప్రయత్నానికి సాయికుమార్ అండగా ఉన్నారు. చక్కని సలహాలు, సూచనలు అందిస్తున్నారు. రాసిన కథని, చక్కగా తెరపై చూపిస్తానని, ఆ దిశగా కృషి చేస్తున్నాను' అని దర్శకుడు శాంతికుమార్ అన్నారు. నిర్మాత మాట్లాడుతూ, 'దర్శకుడు చెప్పిన కథనచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. బిజీగా ఉండి కూడా మా ఆహ్వానం మేరకు విచ్చేసిన విజయేంద్రప్రసాద్‌కి కృతజ్ఞతలు. ప్రేక్షకులకు మంచి సినిమా చూపించబోతున్నాం' అని తెలిపారు.సమీర్, సి.వి.ఎల్ నరసింహారావు, గౌతమ్ రాజు ఎమ్మెస్ చౌదరి, భద్రం, సుమన్ శెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: యూహ్, మురళి మోహన్ రెడ్డి, సంగీతం: సత్య కశ్యప్, బ్యాక్‌గ్రౌండ్ : ఎస్ చిన్న, ఎడిటింగ్: నందమూరి హరి, ఆర్ట్: పెద్దిరాజు అడ్డాల, పాటలు: రామజోగయ్య శాస్త్రి, శాంతికుమార్, కొరియోగ్రాఫర్: భాను, చంద్ర కిరణ్, ఫైట్స్: నందు, సమర్పణ: ఎల్లలు బాబు టంగుటూరి.

9 పాటలతో ఫేమస్..


'రైటర్ పద్మభూషణ్' విజయం తర్వాత లహరి ఫిల్మ్స్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి చేస్తున్న మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 'మేమ్ ఫేమస్'. సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్ర పోషించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య , సిరి రాసి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర బృందం నేటి (శుక్రవారం) నుంచి మ్యూజికల్ జర్నీ ప్రారంభించనుంది. ఇందులో భాగంగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ని విడుదల చేయనున్నారు. రైటర్ పద్మభూషణ్‌కి అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించిన కళ్యాణ్ నాయక్ ఈ సినిమా కోసం 9 పాటలను కంపోజ్ చేశారు. కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ ఒక్కో పాటను పాడగా, గాయని మంగ్లీ మరో పాటని ఆలపించారు. మిగిలిన పాటలను ప్రముఖ సింగర్స్ పాడారు. ఫేమస్ సింగర్స్ పాడిన మేమ్ ఫేమస్ ఆల్బమ్ చార్ట్‌బస్టర్‌గా మారబోతోంది. ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ 'అయ్యయ్యో..' పాటని నేడు విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు మేకర్స్.



సుమంత్ ప్రభాస్, సార్య

బ్రేకప్ అయినా హ్యాపీనే..

అఖిల్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'ఏజెంట్'. ఈనెల 28న బిగ్ స్క్రీన్స్ పైకి రానుంది. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొల్పింది. అలాగే టీజర్ నేషనల్‌వైడ్ ట్రెండ్ అవ్వగా, ఇప్పటికే విడుదలైన పాటలు కూడా మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి బాయ్స్ సెలబ్రేట్ చేసుకునే బ్రేక్-అప్ సాంగ్ 'రామా కృష్ణ' పాటని విడుదల చేశారు. ఇది బ్రేక్-అప్ సాంగ్ అయినప్పటికీ, హీరో జీవితాన్ని బ్రేకప్ ప్రభావితం చేయలేదని చాలా ఆసక్తికరంగా వినోదాత్మకంగా చెప్పారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటకు హిప్ హాప్ తమిళ పెప్పీ నంబర్‌ని స్కోర్ చేయగా, రామ్ మిర్యాల ఈ పాటని ఎనర్జిటిక్‌గా పాడారు. అఖిల్ ఒక సాధువులా కాషాయ దుస్తులతో కనిపించడం సర్‌ప్రైజింగ్‌గా ఉంది. కలర్‌ఫుల్ సెట్‌లో చిత్రీకరించిన పాటలో సాక్షి వైద్య కూడా కాషాయం ధరించి మెరిసింది. దీనికి శేఖర్ మాస్టర్ అద్భుతమైన కొరియోగ్రఫీ అందించారు. ఈ పాట అందర్నీ అలరిస్తోంది.



అఖిల్

అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు

జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న కొత్త సినిమా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. బన్నీ వాసు, దర్శకుడు వెంకటేష్ మహా ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. 'భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతిరోజూ పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, 18 పేజెస్' లాంటి అద్భుతమైన చిత్రాల తర్వాత జీఏ 2 పిక్చర్స్ బ్యానర్లో వస్తున్న సినిమా ఇది. సుహాస్ హీరోగా చేస్తున్న ఈ మూవీ షూటింగ్ పనులను ముగించుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది. జీఏ2 పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్మెంట్స్, వెంకటేశ్ మహా నిర్మాణంలో దుశ్యంత్ కటికనేనిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను నిర్మించారు. మ్యారేజ్ బ్యాండ్‌లో పనిచేసే మల్లి అనే కుర్రాడిగా సుహాస్ ఈ సినిమాలో నటిస్తున్నాడు. తాజాగా చిత్ర యూనిట్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.రిలీజ్ చేసిన పోస్టర్‌లో మల్లికార్జున సెలూన్ షాప్‌ను చూపిస్తూ, సెలూన్ షాప్ ముందు 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' మెంబర్స్‌ను రివీల్ చేసారు. సుహాస్‌తో పాటు గోపరాజు రమణ, పుష్ప ఫేమ్ జగదీశ్ డప్పులు, సన్నాయితో పాటు పలురకమైన మంగళవాయిద్యాలతో ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. సినిమాకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్‌ను త్వరలో అధికారికంగా ప్రకటించనుంది చిత్ర బృందం.ఈ చిత్రానికి దర్శకుడు: దుష్యంత్ కటికనేని, డివోపి : వాజిద్ బేగ్, సంగీతం: శేఖర్ చంద్ర, ఎడిటర్: కోదాటి పవన్ కళ్యాణ్, కళ: ఆశిష్ తేజ పుల్లాల.



గోపరాజు రమణ, సుహాస్, జగదీశ్

మెప్పించే యమ డ్రామా

సోసియో ఫాంటసీ థ్రిల్లర్ సినిమాలు ట్రెండ్‌తో నిమిత్తం లేకుండా ఎప్పుడొచ్చినా ప్రేక్షకుల ఆదరణ చూరగొన్నాయి. అలాగే యముడిని సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ చేసుకుని రూపొందిన సినిమాలు సైతం ఎంతగానో అలరించాయి. ఇప్పుడు ఆ కోవలోనే 'యమ డ్రామా' చిత్రాన్ని మలచడం విజయానికి సంకేతమని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె.ఎల్.దామోదర ప్రసాద్, నిర్మాత డి.ఎస్.రావు అన్నారు ఫిల్మీ మెజీషియన్స్ పతాకంపై యువచంద్ర, శివకుమార్, కౌటిల్య, సుదర్శన్ రెడ్డి హీరోలుగా, ప్రియాంక శర్మ (సవారి ఫేమ్), నేహాదేశ్ పాండే, హమీద హీరోయిన్లుగా నటించారు. టి.హర్షచౌదరి దర్శకత్వంలో తోటకూర శివరామకృష్ణారావు నిర్మించిన ఈ సినిమా విడుదలకు సన్నద్ధమవుతోంది. ఈ సినిమాలోని 'నిను చూసినాకనే...' అనే మొదటి పాటకు కరుణాకర్ సాహిత్యం అందించగా, సునీల్ కశ్యప్ బాణీలు సమకూర్చారు. ఈ వీడియో సాంగ్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె.ఎల్.దామోదర ప్రసాద్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు టి.హర్షచౌదరి మాట్లాడుతూ, 'సాయికుమార్ మొదటి సారి ఈ సినిమాలో యముడి పాత్రలో నటించడం ఓ హైలైట్. మంచి వినోదం, భావోద్వేగాలను రంగరించి, ఆద్యంతం ఆకట్టుకునేలా రూపొందించిన ఈ సినిమాలో యూత్‌కు ఓ మంచి సందేశం కూడా ఉంది. ఫ్యామిలీస్, ఫ్రెండ్స్, లవర్స్ వంటి అన్ని వర్గాల వారు మెచ్చేలా దీనిని మలిచాం' అని చెప్పారు. 'అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను ఇదే నెలలో విడుదల చేస్తాం' అని తెలిపారు.



ప్రియాంక శర్మ

లవర్స్ ఫీలింగ్స్‌తో తు..మేరా పాట

దర్శకుడు కె దశరథ్ అందిస్తున్న కథతో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ యూ రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. డివై చౌదరి, కె దశరథ్ కలిసి మన ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ చక్ర ఫిలింస్ బ్యానర్‌లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ జంటగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్ వీడియోతో పాటు 'ఉండా లని ఉందీ నీతో' పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి 'తు మేరా' పాటని విడుదల చేశారు. కె వేద ఈ పాటని బ్యూటీఫుల్ మెలోడీగా కంపోజ్ చేయగా, లిప్సిక మరింత అందంగా అలపించారు. సరస్వతి కార్తీక అందించిన సాహిత్యం కథానాయికల మనసులోని ఫీలింగ్స్‌ని లవ్లీగా ప్రజంట్ చేసింది. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్‌ల కెమిస్ట్రీ చూడముచ్చటగా ఉంది. ఈ చిత్రానికి సుధాకర్ బొర్రా (టీనస్సీ), డి నాగేశ్వర్‌రావు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886